సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+12 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 322

బుధవారం 12-2-2020








**రెండు రోజుల నష్టాలకు బ్రేక్**

లాభాల్లో మార్కెట్లు ..237 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్

- బిజినెస్‌లో



**23 ఏళ్ల తర్వాత... 0-3**

న్యూజిలాండ్ చేతిలో చివరి వన్డేలోనూ ఓడిన భారత్

- స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

# ఆప్... మళ్లీ క్లీన్‌స్వీప్

## ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఘన విజయం ● 70 సీట్లకు గానూ 62 స్థానాల్లో గెలుపు

8 సీట్లకు బీజేపీ పరిమితం; ఖాతా తెరవని కాంగ్రెస్

‘ఐ లవ్ యూ’ అంటూ ఢిల్లీ ప్రజలకు ఆప్ చీఫ్ కేజ్రీవాల్ ప్రేమపూర్వక కృతజ్ఞతలు

‘పని రాజకీయం’ అనే కొత్త తరహా రాజకీయానికి పురుడు పోశారని ప్రశంసలు

కేజ్రీవాల్‌కు ప్రధాని మోదీ అభినందనలు

ఎల్లుండి సీఎంగా మూడోసారి ప్రమాణ స్వీకారం చేయనున్న కేజ్రీ!

ఢిల్లీ ప్రజలు ‘పని’ రాజకీయానికి పట్టం కట్టారు. విద్వేష వ్యాఖ్యలను, వెకిలి రాజకీయాలను ‘చీపురు’తో ఊడ్చేశారు. అభివృద్ధి వైపే మేమున్నామని ‘సాక్షి’ వక్కాణించారు. సామాన్యుడి కోసం పనిచేసే ‘ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)’ని మరోసారి అందలం ఎక్కించారు. బీజేపీ హై ఓల్టేజీ ప్రచారాన్ని ‘ఒకే ఒక్కడు’గా ఎదుర్కొన్న అరవింద్ కేజ్రీవాలే ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోవాలని స్పష్టమైన తీర్పునిచ్చారు. కాంగ్రెస్‌కు మళ్లీ గుండు సున్నా మార్కులే వేశారు.




ఢిల్లీ ప్రజలారా.. మీరు అద్భుతం చేశారు. ఇది అందరి విజయం. నన్ను పెద్ద కొడుకుగా భావించి, ఇంత పెద్ద గెలుపును అందించిన ప్రతీ ఒక్క కుటుంబ విజయం ఇది. ఈ రోజు ఢిల్లీ ప్రజలు ‘పని రాజకీయం(పాలిటిక్స్ ఆఫ్ వర్క్స్)’ అనే కొత్త తరహా రాజకీయ సంస్కృతికి తెర తీశారు.

– కేజ్రీవాల్

10లో

ఢిల్లీ ప్రజల తీర్పును బీజేపీ అంగీకరిస్తోంది. ప్రతిపక్షంగా నిర్మాణాత్మక పాత్ర పోషిస్తుంది. బీజేపీ కోసం కష్టపడిన కార్యకర్తలకు కృతజ్ఞతలు. ఘన విజయం సాధించిన కేజ్రీవాల్‌కు అభినందనలు.

– జేపీ నడ్డా, బీజేపీ అధ్యక్షుడు



కలెక్టర్ల సదస్సులో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో సీఎస్ సోమేశ్ కుమార్

# మార్పు రాకుంటే ఉపేక్షించం!

## కలెక్టర్లు, అదనపు కలెక్టర్లకు సీఎం కేసీఆర్ స్పష్టీకరణ

పల్లె.. ప్రగతిబాట పట్టాలి

ప్రభుత్వం చేయాల్సినదంతా చేసింది.. ఇక బాధ్యత అంతా మీదే

రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే జిల్లా యంత్రాంగం ప్రాధాన్యతలు

ప్రభుత్వ నిర్ణయాలనే యంత్రాంగం అమలు చేయాలి

పల్లెలు, పట్టణాలు పచ్చదనం, పరిశుభ్రతతో వెల్లివిరియాలి

కలెక్టర్ల చేతిలోనే రెవెన్యూ అజమాయిషీ

గుట్టలపై ఇళ్లు నిర్మించుకున్న వారికి పట్టాలివ్వాలని ఆదేశం

11 గంటలపాటు మారథాన్ సమావేశం

సాక్షి, హైదరాబాద్

‘గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంది. కొత్త జిల్లాలు, కొత్త డివిజన్లు, కొత్త మండలాలు, కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటుతో పరిపాలనా విభాగాలు చిన్నవయ్యాయి. పల్లెల అభివృద్ధికి నిధుల కొరత ఏర్పడకుండా ప్రతినెలా రూ.339 కోట్ల ఆర్థిక సంఘం నిధులను విడుదల చేస్తున్నాం. అన్ని గ్రామాలకు గ్రామ కార్యదర్శులను నియమించాం. ఎంపీఓ, ఎంపీడీవో, డీఎల్పీవో, డీపీఓ, జెడ్పీ సీఈఓ వంటి పోస్టులన్నింటినీ భర్తీ చేశాం. ఇంకా ఎక్కడైనా ఖాళీలు ఏర్పడితే వెంటనే అక్కడ వేరొకరిని నియమించే అధికారం కలెక్టర్లకు ఇస్తున్నాం. పంచాయతీ సిబ్బంది వేతనాలు పెంచాం. ప్రతీ గ్రామంలో ట్రాక్టర్లను సమకూర్చుకునే అవకాశం కల్పించాం. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకునే అధికారం కలెక్టర్లకు ఇచ్చాం. నేరుగా కోర్టుకు వెళ్లకుండా ట్రిబ్యునల్ ఏర్పాటు చేశాం. ప్రభుత్వం కలెక్టర్లపై నమ్మకంతో తన అధికారాలను వారికి బదిలీ చేసింది. ప్రభుత్వం చేయాల్సిందంతా చేసింది. ఇంత చేసినా గ్రామాల్లో మార్పు రాకుంటే మాత్రం ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు’అని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు స్పష్టం చేశారు. ఎవరి బాధ్యతలు వారు నెరవేర్చే విధంగా పనిచేయించే బాధ్యతను కలెక్టర్లు తీసుకోవాలని సూచించారు. ప్రగతిభవన్‌లో మంగళవారం ఉదయం 11 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు 11 గంటలపాటు కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో సీఎం కేసీఆర్ మారథాన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధి,

మిగతా 2వ పేజీలో ▶

# నేరగాళ్ల ‘ట్రాకింగ్’

■ పదేపదే నేరాలకు పాల్పడేవారికి సత్వరం శిక్ష పడేలా చేసేందుకు మన పోలీసులు కొత్త విధానం తీసుకొస్తున్నారు. దర్యాప్తునకు ముందే నిందితుడి నేరచరిత్రను తెలిపే ‘సీసీటీఎన్ఎస్’ విధానాన్ని రెండు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నారు. తొలుత ఈ విధానాన్ని విమెన్ సేఫ్టీవింగ్, రోడ్ సేఫ్టీ అథారిటీలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయాలని నిర్ణయించారు.

3లో



# ‘సాక్షి’ సెలబ్రేషన్ ఆఫర్..
## అరకిలో గోల్డ్ విజేత శ్రీనివాస్‌రెడ్డి

- ఇద్దరికి స్విఫ్ట్ కార్లు.. పది మందికి యాక్టివా స్కూటీలు
- విజేతలుగా 20,083 మంది పాఠకులు
- విజేతలను ప్రకటించిన రిటైర్డ్ జస్టిస్ రవీందర్‌రెడ్డి

5లో



గోల్డ్ విజేతతో మాట్లాడుతున్న జస్టిస్ రవీందర్‌రెడ్డి









ఇదం జగత్




# 31 ప్రశ్నల ‘జన గణన’

ఇంటికప్పు నుంచి ఇంటర్నెట్ సౌకర్యం వరకు వివరాల సేకరణ

- విద్యుత్, మంచినీరు, మరుగుదొడ్ల సౌకర్యాలపై ఆరా
- ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు కొనసాగనున్న గణన
- దేశ గెజిట్‌ను రాష్ట్ర గెజిట్‌లో రీపబ్లిష్ చేస్తూ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం నిర్వహించే జాతీయ జనగణన (సెన్సస్–2021) ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి రాష్ట్రంలో ప్రారంభం కానుంది. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రజల నుంచి సేకరించాల్సిన వివరాల కోసం 31 ప్రశ్నలతో కూడిన ఫార్మాట్‌ను కేంద్రం రూపొందించింది. ఇందులో ఇంటి నంబర్ నుంచి ఇంటి పైకప్పు, ఇంటర్నెట్ సౌకర్యం వరకు.. ప్రతి ఇంట్లో ఉన్న కనీస సౌకర్యాలు, కుటుంబ సభ్యుల వివరాలతో పాటు ఆ కుటుంబానికి ఉన్న కనీస ఆస్తుల వివరాలను సేకరించనున్నారు. ఈ మేరకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ రిజిస్ట్రార్ జనరల్ కార్యాలయం రూపొందించిన ప్రశ్నావళిని గత నెల 7న కేంద్ర గెజిట్‌లో ముద్రించారు. ఈ గెజిట్‌ను రాష్ట్ర గెజిట్‌లో పునఃముద్రిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.సోమేశ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, జాతీయ జనగణన ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ వరకు జరగనుంది. ఈ గణనలో గెజిట్‌లో పొందుపరిచిన ప్రశ్నలను



మిగతా 5వ పేజీలో ▶

# 50 రోజుల్లో గజ్వేల్‌కు రైలు!

## గూడ్స్‌లో గజ్వేల్‌కు చేరిన పర్మనెంట్ పట్టాలు

- చివరి దశలో ట్రాక్‌పై పట్టాలు బిగించే పని
- ఇప్పటికే సిద్ధమైన స్టేషన్ భవనాలు..
- మార్చి చివరి వారంలో రైల్వే సేఫ్టీ కమిషనర్ తనిఖీ
- ఆ తర్వాత వారం రోజుల్లో అనుమతి వచ్చే వీలు



సాక్షి, హైదరాబాద్: గజ్వేల్‌లో రైలు కూత పెట్టనుంది. అందుకు కౌంట్‌డౌన్ మొదలైంది. సరిగ్గా మరో 50 రోజుల్లో రైలు రాబోతోంది. కమిషనర్ ఫర్ రైల్వే సేఫ్టీ నుంచి వెంటనే అనుమతి వస్తే ఏప్రిల్ తొలివారంలో గజ్వేల్–సికింద్రాబాద్ మధ్య రైలు సేవలు మొదలవుతాయి. ప్రస్తుతం ట్రాక్‌పై పర్మనెంట్ పట్టాలు బిగించే కీలక పని చివరిదశకు వచ్చింది. స్టేషన్ భవనాలు, ప్లాట్‌ఫారంల పనులు మరో పక్షం రోజుల్లో పూర్తి కానున్నాయి. మార్చి చివరి వారంలో ట్రయల్ రన్ నిర్వహించే విధంగా ఓ ప్రణాళికతో పనులు వేగంగా పూర్తి చేస్తున్నారు. ఆ తర్వాత రైల్వే బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇవ్వటమే తరువాయి, వెంటనే మెమూ రైలును ప్రారంభించనున్నారు. వెరసి దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న.. రైల్వే ప్రాజెక్టు ద్వారా కరీంనగర్‌ను రాజధానితో

మిగతా 5వ పేజీలో ▶

# మొక్కల పెంపకంలో తెలంగాణ టాప్

కేంద్ర అటవీశాఖ గణాంకాల్లో వెల్లడి

సిబ్బందిని అభినందించిన మంత్రి ఇంద్రకరణ్

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా మొక్కల పెంపకంలో తెలంగాణ టాప్ ర్యాంక్‌లో నిలిచింది. కేంద్ర అటవీ శాఖ తాజాగా వెల్లడించిన గణాంకాల ప్రకారం.. 2017–18లో 4,89,673 హెక్టార్లలో మొక్కలు నాటడం ద్వారా జాతీయ స్థాయిలో తెలంగాణ తొలి ర్యాంక్‌ను కైవసం చేసుకుంది. 3,82,364 హెక్టార్లలో మొక్కలు నాటిన ఒడిశా రెండో స్థానంలో నిలిచింది. సోమవారం రాజ్యసభలో ఒక ప్రశ్నకు కేంద్ర పర్యావరణ, అటవీశాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ సమాధానం ఇచ్చిన సందర్భంగా దీనికి సంబంధించిన గణాంకాలను వెల్లడించారు. అంతకుముందు 2016–17లో 4,38,059 హెక్టార్లలో, 2015–16లో 2,36,598 హెక్టార్లలో మొక్కలు నాటడం ద్వారా జాతీయస్థాయిలో ఎక్కువ మొక్కలు నాటిన రాష్ట్రంగా తెలంగాణ తొలి స్థానాన్ని సాధించింది. ఇదిలా ఉంటే 2018–19 సంవత్సరానికి గాను ఒడిశాకు 2,82,755 హెక్టార్లలో, తెలంగాణకు 2,76,870 హెక్టార్లలో మొక్కలు నాటాలని కేంద్రం లక్ష్యాలను నిర్దేశించింది. గతేడాదికి సంబంధించి లక్ష్యాల సాధన గణాంకాలు ఇంకా సిద్ధం చేయలేదని రాజ్యసభలో



మిగతా 5వ పేజీలో ▶

● పర్యటన ఖరారు

## భారత్‌కు ట్రంప్

భారత్‌లో అమెరికా అధ్యక్షుడి పర్యటన తేదీలు ఖరారయ్యాయి. ఈ నెల 24, 25వ తేదీల్లో భారత్ రానున్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ న్యూఢిల్లీ, అహ్మదాబాద్‌ల్లో పర్యటించనున్నారు. భారత్‌లో ట్రంప్ మొదటిసారిగా జరిపే ఈ పర్యటనలో ఆయన భార్య మెలానియా ట్రంప్ కూడా ఉంటారు.



- 5లో

● కరోనా మరణాలు

## 1,016

కరోనా వ్యాధి బారిన పడి మరణిస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. చైనా అధికారుల సమాచారం మేరకు సోమవారం నాటికి కరోనా మహమ్మారికి 1,016 మంది మృత్యువాతపడ్డారు. ఇక ఈ వ్యాధి సోకినట్లు నిర్ధారణ అయిన వారి సంఖ్య 42,638కి చేరింది.



- 5లో

● వాడల్లోకి వచ్చింది...

## రాజుగారి అమ్మాయి

‘‘బడికి వచ్చి చదువుకోండి. ఇంటికి వెళ్లేటప్పుడు ఈ క్యాన్ నిండా మంచినీటిని మీ ఇంటికి పట్టుకువెళ్లండి’’ అని ఐదు లీటర్ల నీటి క్యాన్‌లను అమ్మాయిల చేతికి ఇస్తున్నారు సంచయిత. రాజుగారమ్మాయి ఇంత ఆపేక్షగా చెబుతుండటంతో తల్లిదండ్రులు తమ అమ్మాయిల్ని బడికి పంపిస్తున్నారు.



- ఫ్యామిలీలో

epaper.sakshi.com


మంగళవారం ప్రగతిభవన్‌లో కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రులు శ్రీనివాస్ గౌడ్, జగదీశ్‌రెడ్డి, ఎర్రబెల్లి, కేటీఆర్, మహమూద్ అలీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌శర్మ, మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, ఈటల

# మార్పు రాకుంటే ఉపేక్షించం!

▶ మొదటి పేజీ తరువాయి

ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం రూపొందించిన పథకాలను అమలు చేయడమే జిల్లా యంత్రాంగం ప్రాధాన్యత అయి ఉండాలి తప్ప.. ఎవరికీ వ్యక్తిగత ప్రాధాన్యతలు ఉండరాదని స్పష్టంచేశారు. అధికార యంత్రాంగం అంతటికీ ఒకే ప్రాధాన్యం ఉండాలని, రాష్ట్ర స్థాయి నుంచి కింది స్థాయి వరకు ఒకే ప్రాధాన్యతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. 'విస్తృత మేధోమథనం, అనేక రకాల చర్చోప చర్చలు, అసెంబ్లీలో విస్తృత చర్చ– విషయ నిపుణులతో సంప్రదింపులు జరిపిన తర్వాతే ప్రభుత్వం వాస్తవిక దృష్టితో చట్టాలు తెస్తుంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్య విధానం అవలంభిస్తున్న మన దేశంలో ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలనే అధికార యంత్రాంగం అమలు చేయాలి. ప్రభుత్వం తెచ్చిన చట్టాలు, విధానాలు, పథకాలు, కార్యక్రమాల అమలే కలెక్టర్ల ప్రాధాన్యత కావాలి. మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం మంత్రులు, కలెక్టర్ల బాధ్యత. వారి పనితీరుకు ఇదే గీటురాయి. మొక్కలు నాటి, సంరక్షించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిని ఉపేక్షించే సమస్యే లేదు'అని ముఖ్యమంత్రి స్పష్టంచేశారు. అస్తవ్యస్తంగా ఉన్న భూ రికార్డుల నిర్వహణను సరిదిద్దాల్సిన బాధ్యత కలెక్టర్లపైనే ఉందన్నారు. 'రెవెన్యూ అజమాయిషీ కలెక్టర్ల చేతిలోనే ఉంటుంది. భూ సంబంధ రికార్డులు పక్కాగా ఉండాలి. కచ్చితంగా సంస్కరణలు రావాలి. 95 శాతం భూముల విషయంలో ఎలాంటి పేచీ లేదు. మిగతా వాటిని పరిష్కరించాలి'అని సూచించారు. ఇంకా పలు అంశాలపై సీఎం ఏమన్నారంటే...

### ప్రభుత్వ ప్రతినిధులుగా ఉండాలి...

'రాష్ట్రం ఏర్పడిన తర్వాత తక్కువ వ్యవధిలోనే అద్భుత ప్రగతి సాధించాం. విద్యుత్, తాగునీటి సమస్యలు పరిష్కారమయ్యాయి. భారీ నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణంతో సాగునీటి వసతి ఏర్పడుతోంది. ఇప్పుడు మన ముందున్న అత్యంత ప్రాధాన్యతతో కూడిన పని.. పల్లెలు, పట్టణాలు పచ్చదనం, పరిశుభ్రతతో వెల్లివిరియడమే. కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి, కంటివెలుగు వంటి కార్యక్రమాలు పేదల కష్టాలు, కన్నీళ్లను దూరం చేయాలనే సమున్నత ఆశయం నుంచి పుట్టుకొచ్చిన పథకాలు. ఎంతో మేధోమథనం చేసి, ప్రజల అవసరాలకు అనుగుణంగా వాస్తవిక దృక్పథంతో ప్రభుత్వం కార్యక్రమాలు రూపొందిస్తుంది. అలాంటి కార్యక్రమాలను జిల్లా స్థాయిలో కలెక్టర్లు అమలు చేయాలి. కలెక్టర్ వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా పరిపాలనను క్రమబద్ధం చేయవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే కలెక్టర్లకు అండగా ఉండటం కోసం అదనపు కలెక్టర్లను నియమించాం. జిల్లా స్థాయిలో ప్రభుత్వ ప్రతినిధిగా కలెక్టర్లు వ్యవహరించాలి. కలెక్టర్లపై ప్రభుత్వం ఎంతో నమ్మకం, బాధ్యతలు ఉంచింది. కొత్తగా తెచ్చిన పంచాయతీ రాజ్, మున్సిపల్ చట్టాల అమలులో కలెక్టర్ల బాధ్యత పెరిగింది. గతంలో 112 కమిటీలకు కలెక్టర్లు చైర్మన్‌గా వ్యవహరించేవారు. ఇప్పుడు వాటిని 26 విభాగాలుగా మార్చాం. దీనివల్ల కొంత పనిఒత్తిడి తగ్గుతుంది. కలెక్టర్లు ఇతర అధికారులతో సంప్రదింపులు జరపడానికి వీలుగా వైర్‌లెస్ సెట్లు సమకూర్చాలని నిర్ణయం తీసుకున్నాం.

### దట్టంగా అడవులు పెంచాలి...

పల్లె ప్రగతి కొద్దికాలం చేసి ఊరుకునే కార్యక్రమం కాదు. అది నిరంతరం సాగాలి. దేశంలో ఆదర్శ పల్లెలు ఎక్కడున్నాయంటే తెలంగాణలో ఉన్నాయనే పేరు రావాలి. గ్రామాల్లో ఎవరు చేయాల్సిన పనిని వారితోనే చేయించాలి. మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు వ్యవస్థతో పనిచేయించాలి. ప్రతి గ్రామంలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి. నాటిన మొక్కల్లో 85 శాతం మొక్కలను కచ్చితంగా బతికించాలి. గ్రామంలో శ్మశాన వాటికలు, ఖనన వాటికలు, డంపింగ్ యార్డులు ఏర్పాటు చేయాలి. చెట్లకు నీళ్లు పోయడానికి, చెత్త ఎత్తివేయడానికి ట్రాక్టర్ కొనుగోలు చేయాలి. గ్రామాల్లో పర్యటించినప్పుడు మీ దృష్టికి వచ్చిన అత్యవసర, అత్యంత ప్రాముఖ్యత కలిగిన పనులు చేయడానికి ప్రతి కలెక్టర్ వద్ద రూ.కోటి అందుబాటులో ఉంచుతాం. గ్రామాల్లో మొక్కలు నాటడం మాత్రమే కాదు. అడవుల్లో కలప అక్రమ రవాణాను అరికట్టడానికి కలెక్టర్లు కఠినంగా వ్యవహరించాలి. చెట్లు నరకకుండా చూడాలి. అటవీ భూముల్లో దట్టమైన అడవులు పెంచాలి. పదెకరాల అటవీ భూమిలో అడవిని అభివృద్ధి చేయడం పదివేల ఎకరాల్లో సామాజిక అడవులు పెంచడంతో సమానం. కాబట్టి అడవిని పునరుద్ధరించడానికి అవసరమైన కార్యాచరణ రూపొందించి అమలు చేయాలి. హైదరాబాద్, గద్వాల, కరీంనగర్, జనగామ, వరంగల్ అర్బన్, యాదాద్రి, సూర్యాపేట, నారాయణపేట, సంగారెడ్డి జిల్లాల్లో అడవుల శాతం చాలా తక్కువగా ఉంది. అక్కడి కలెక్టర్లు సామాజిక అడవులు పెంచడానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి. జిల్లాల వారీగా ఫారెస్టు బ్లాకులను గుర్తించి, అడవుల పునరుద్ధరణకు, అడవుల రక్షణకు చర్యలు తీసుకోవాలి. అర్బన్ పార్కులను అభివృద్ధి చేయాలి. అవకాశం ఉన్న ప్రతిచోటా మంకీ ఫుడ్ కోర్టులను ఏర్పాటు చేయాలి. గ్రీన్ ప్లాన్ అమలుకు నిధుల కొరత రాకుండా బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తాం. మొక్కల పెంపకానికి నరేగా నిధులు వినియోగించుకోవాలి.

### సంపూర్ణ అక్షరాస్యతకు కృషి చేయాలి...

ఏ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమమైనా ముందుగా ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల నుంచే ప్రారంభం కావాలి. ఎస్సీ, ఎస్టీ వర్గాలు సమాజంలో అత్యంత వెనుకబడి ఉన్నాయి. దళితవాడలు, గిరిజన తండాలు, ఆదివాసీ గూడేల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పర్యటించాలి. కార్యక్రమాల అమలును అక్కడి నుంచే ప్రారంభించాలి. అక్షరాస్యతలో వెనకబడిన రాష్ట్రాన్ని సంపూర్ణ అక్షరాస్యత కలిగిన రాష్ట్రంగా మార్చేందుకు ప్రతినబూనాలి. గ్రామాల్లో ఉన్న నిరక్షరాస్యులందరినీ అక్షరాస్యులుగా మార్చే బాధ్యతను సర్పంచులకు అప్పగించాలి. జిల్లాను పూర్తి అక్షరాస్యతగా మార్చే బాధ్యత కలెక్టర్లు తీసుకోవాలి. వారు సాధించిన అక్షరాస్యతను జనాభా లెక్కల్లో కూడా నమోదు చేయించాలి. ఎస్సీ, ఎస్టీల్లో అక్షరాస్యత పెంచడానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి.

### అన్ని విషయాలపై అవగాహన ఉండాలి...

సివిల్ సర్వీస్ అధికారులకు దీర్ఘకాలిక వ్యూహం ఉండాలి. అన్ని విషయాలపై అవగాహన పెంచుకోవాలి. ఇప్పుడు కలెక్టర్లుగా పని చేస్తున్న యువ ఐఏఎస్ అధికారులే రేపు రాష్ట్రానికి కార్యదర్శులుగా, శాఖాధిపతులుగా వివిధ హోదాల్లో పని చేస్తారు. అందువల్ల మంచి విధానాలు అమలవుతున్న ఇతర దేశాల పర్యటనలకు వెళ్లాలి. అన్ని రంగాల్లో ఉత్తమ పద్ధతులు, విధానాలను వారు అధ్యయనం చేసి తెలంగాణలో అమలు చేయాలి. డీపీఓ, డీఎల్పీవో, ఎంపీవో, గ్రామ కార్యదర్శులతో అడిషనల్ కలెక్టర్లు నిత్యం సమావేశమవుతూ, ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తూ ఉండాలి. కేంద్ర ప్రభుత్వ పథకాలకు విడుదలయ్యే నిధుల వినియోగానికి సంబంధించి ఎప్పటికప్పుడు యుటిలైజేషన్ సర్టిఫికెట్లు (యూసీ) పంపడం ప్రాధాన్యతాంశంగా కలెక్టర్లు గుర్తించాలి.

### 'పట్టణ ప్రగతి'పై శిక్షణ ఇవ్వాలి...

పల్లె ప్రగతి తరహాలోనే త్వరలోనే పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభిస్తుంది. ఇందులో భాగంగా పట్టణాలు, నగరాల్లో చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించేందుకు అన్ని జిల్లాల కలెక్టరేట్లలో మున్సిపల్ సమ్మేళనం నిర్వహించాలి. మేయర్లు, చైర్‌పర్సన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, కమిషనర్లను ఈ సమావేశానికి పిలిచి శిక్షణ ఇవ్వాలి. పట్టణ ప్రగతి కార్యక్రమం కన్నా ముందే అన్ని వార్డుల్లో కమిటీలు నియమించాలి. ఈ కార్యక్రమానికి పట్టణాల్లోని వార్డును యూనిట్‌గా చూడాలి. ఆ వార్డులోని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం నియమించే ప్రజాకమిటీలోని సభ్యులు పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగస్వాములు కావాలి. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టణంలో పాదయాత్రలు చేసి, వార్డులవారీగా సమస్యలు గుర్తించాలి. పట్టణాలు, నగరాల్లో ప్రభుత్వ స్థలాలను గుర్తించి వాటిని పార్కులు, ఇతర అవసరాలకు వినియోగించాలి. కేబీఆర్ పార్కు తరహాలో అన్ని పట్టణాలకు రెండు కిలోమీటర్ల దూరంలో వాకింగ్‌కు అనుకూలంగా పార్కులను అభివృద్ధి చేయాలి. గుట్టలు, కొండల మీద గుడిసెలు, ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న వారికి పట్టాలివ్వాలి. పట్టణాల్లో రూ.5లక్షల వరకు వ్యయం చేసే పనులను కలెక్టర్ అనుమతితో చేపట్టవచ్చు. ఇళ్లపై వేలాడే కరెంట్ వైర్లను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలి. గ్రామానికి ఒక నర్సరీ పెట్టినట్టే, పట్టణాల్లో కూడా అక్కడి జనాభాను బట్టి అవసరమైనవన్ని నర్సరీలు ఏర్పాటు చేయాలి. పట్టణాల్లో స్థలం దొరకకపోతే సమీప గ్రామంలో పట్టణానికి సంబంధించిన నర్సరీ ఏర్పాటు చేయాలి. అన్ని పట్టణాల్లో వెజ్/నాన్ వెజ్ మార్కెట్లు నిర్మించాలి. మున్సిపల్ కార్పొరేషన్లలో కనీసం మూడు చొప్పున, పట్టణాల్లో కనీసం ఒకటి చొప్పున ఈ మార్కెట్లను నిర్మించాలి. వివిధ పనుల కోసం పట్టణాలకు వచ్చే ప్రజలు, మరీ ముఖ్యంగా మహిళలు టాయిలెట్లు లేక చెప్పరాని అవస్థలు పడుతున్నారు. అన్ని పట్టణాల్లో విధిగా పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలి. ఇందుకు ప్రభుత్వ కార్యాలయాల స్థలాలను వినియోగించాలి. ముందుగా కలెక్టరేట్లలో పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాలి. ప్రత్యామ్నాయం చూపించకుండా వీధుల వెంట షాపులు నిర్వహించేవారిని, టాక్సీ స్టాండ్లను, ఫుట్‌పాత్‌లపై వ్యాపారం చేసుకునేవారిని బలవంతంగా తరలించొద్దు. మెదడువాపుతో పాటు ఇతర వ్యాధులకు కారణమవుతున్న పందుల నివారణకు వ్యూహాత్మకంగా వ్యవహరించాలి. పందులను పోషిస్తూ జీవించే వారికి ప్రత్యేక ఉపాధి చూపించాలి.

### మున్సిపల్ శాఖలో ఖాళీల భర్తీ..

పంచాయతీ రాజ్ శాఖ మాదిరిగానే మున్సిపల్ శాఖలో కూడా అన్ని ఖాళీలను భర్తీ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఎన్ని ఖాళీలున్నాయి. ఎక్కడెక్కడ ఏ పోస్టులు భర్తీ చేయాలో మున్సిపల్ శాఖ ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలి. మొత్తం 141 పట్టణ స్థానిక సంస్థలకు నిధులు కూడా సమకూరుస్తాం. హైదరాబాద్ నగరానికి నెలకు రూ.78 కోట్ల చొప్పున.. మిగతా పట్టణాలు, నగరాలకు రూ.70 కోట్ల చొప్పున విడుదల చేస్తాం. ఈ నిధులతో పాటు, స్థానికంగా సమకూరే నిధులతో పట్టణాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి. గ్రామాలు, పట్టణాల్లో వందకు వంద శాతం పన్నులు వసూలు చేయాలి. గ్రామాల్లో ట్రాక్టర్లు కొనుగోలు చేసినట్లే పట్టణాల్లో చెత్త సేకరణకు వాహనాలు కొనుగోలు చేయాలి'అని కేసీఆర్ ఆదేశించారు. పట్టణ ప్రగతి కార్యక్రమంతో పాటు పట్టణ పరిపాలనకు సంబంధించి వ్యవహరించాల్సిన తీరుపై మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్ కలెక్టర్లకు సూచనలు చేశారు. సమావేశంలో పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి, హరితహారం సహా ఇతర అంశాలపై సీనియర్ అధికారులు, కలెక్టర్లు తమ అభిప్రాయాలు తెలియజేశారు. పీసీసీఎఫ్ శోభ తెలంగాణకు హరితహారం, అడవుల పునరుద్ధరణపై వివరించారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ సత్యనారాయణ కొత్త మున్సిపల్ చట్టంపై వివరణ ఇచ్చారు.

### హైదరాబాద్‌లో డీజిల్ వాహనాలు తగ్గించాలి

'సముద్రం ఒడ్డున లేని నగరాల్లో కాలుష్యం పెరగడానికి అవకాశాలెక్కువ. ఢిల్లీకి అదే సమస్య ఉంది. ఇప్పుడు నివాసయోగ్యమైన నగరాల జాబితాలో ముందున్న హైదరాబాద్‌ను నిర్లక్ష్యం చేస్తే కాలుష్య కాసారం కాక తప్పదు. కాబట్టి ఇప్పటి నుంచే జాగ్రత్త వహించాలి. హైదరాబాద్ నగరం లోపల, చుట్టూ కలిపి లక్షా 60వేల ఎకరాల అటవీ భూమి ఉంది. అందులో దట్టమైన అడవులు పెంచాలి. వనస్థలిపురంలోని హరిణి వనస్థలిని కేబీఆర్ పార్కులాగా తయారు చేయాలి. హైదరాబాద్‌లో కాలుష్యం నివారించడానికి అనుగుణమైన ప్రణాళిక రూపొందించి అమలు చేయాలి. డీజిల్ వాహనాలు తగ్గించి, ఎలక్ట్రానిక్ వాహనాల సంఖ్య పెంచే చర్యలు తీసుకోవాలి. ఈ నగరాన్ని కాలుష్యమయం కాకుండా చూసుకోవాలనే స్పృహ ప్రతి ఇంట్లో కలిగించే చర్యలు తీసుకోవాలి'అని సీఎం కె.చంద్రశేఖర్ రావు సూచించారు.

### అదనపు కలెక్టర్లకు వేరే పనులు అప్పగించొద్దు...

అదనపు కలెక్టర్లలో ఒకరిని పూర్తిగా స్థానిక సంస్థలకు కేటాయించాం. వారికి మరో పని అప్పగించవద్దు. ఒక అడిషనల్ కలెక్టర్ కేవలం స్థానిక సంస్థలను సమర్థవంతంగా పని చేయించే బాధ్యతలు మాత్రమే నిర్వర్తించాలి. వారి కంప్యూటర్లో అన్ని గ్రామాలు, పట్టణాల చరిత్ర, సంపూర్ణ వివరాలు ఉండాలి. అదనపు కలెక్టర్లందరికీ రెండు రోజుల పాటు 'గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి'పై శిక్షణ తరగతులు నిర్వహించాలి. ఈ తరగతులకు కలెక్టర్లను కూడా ఆహ్వానించాలి. రాబోయే పదిహేను రోజుల్లో జిల్లా స్థాయిలో 'పంచాయతీ రాజ్ సమ్మేళనం'నిర్వహించాలి. సర్పంచులు, గ్రామ కార్యదర్శులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలను ఆహ్వానించాలి. గ్రామాలను అభివృద్ధి చేసుకునే పద్ధతి వివరించాలి. ఎవరి బాధ్యత ఏమిటో విడమరిచి చెప్పాలి. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జడ్పీ చైర్‌పర్సన్లను ముఖ్య అతిథులుగా పిలవాలి. సమావేశం తర్వాత పది రోజుల గడువు ఇవ్వాలి. ఆలోగా గ్రామాల రూపురేఖలు మార్చాలని చెప్పాలి. మొత్తంగా 25 రోజుల్లో గ్రామాల పరిస్థితిలో మార్పు రావాలి. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తాం. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు పర్యటిస్తాయి. ముఖ్యమంత్రిగా నేను కూడా ఆకస్మిక పర్యటనలు చేస్తాను. ఏ గ్రామం అనుకున్న విధంగా లేకపోయినా చర్యలు తప్పవు. గ్రామాలను బాగా ఉంచుకునే వారికి అవార్డులు, ప్రోత్సాహకాలు కూడా ఉంటాయి.

## కలెక్టర్లకు 'కీలక సమతుల్య నిధి'

సాక్షి, హైదరాబాద్: అవసరమైన సమయాల్లో తమ విచక్షణ మేరకు వినియోగించేందుకుగాను జిల్లా కలెక్టర్లకు రూ.కోటి చొప్పున కీలక సమతుల్య నిధి(సీబీఎఫ్)ని మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. జిల్లాకు రూ.కోటి చొప్పున 33 జిల్లాలకు (హైదరాబాద్ మినహా) రూ.33 కోట్లు మంజూరు చేస్తూ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి కె.రామకృష్ణారావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ల సదస్సులో సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయం మేరకు ఈ ఉత్తర్వులు వెలువడినట్టు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

## కేజ్రీవాల్‌కు మంత్రి కేటీఆర్ శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్‌కు టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు శుభాకాంక్షలు తెలిపారు. మూడు వరుస ఎన్నికల్లో గెలుపుతో హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసిన కేజ్రీవాల్‌ను అభినందిస్తూ మంగళవారం ఆయన ట్విట్టర్‌లో పోస్టు చేశారు.

## ఆప్ విజయం స్ఫూర్తిదాయకం: కర్నె

సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ వరుసగా మూడోసారి విజయం సాధించడం ప్రాంతీయ పార్టీలకు స్ఫూర్తిగా నిలుస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ ఢిల్లీ ఎన్నికల్లో ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూసినా ప్రాంతీయ పార్టీకే పట్టం కట్టారన్నారు. మంగళవారం అసెంబ్లీ ఆవరణలో కర్నె మీడియాతో మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలను చూసి రెండోసారి ప్రజలు అధికారాన్ని అప్పగించారని, అదే తరహాలో ఢిల్లీలోనూ సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధి చూపిన ఆమ్ ఆద్మీ పార్టీని ప్రజలు ఆదరించారన్నారు.


ప్రగతి భవన్‌లో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు

# శభాష్ తెలంగాణ పోలీస్

**సైబర్ నేరాల నిరోధంపై జాతీయ శిక్షణకు వెళ్లిన తెలంగాణ ఇన్‌స్పెక్టర్లపై ప్రశంసల వర్షం**

సాక్షి, హైదరాబాద్: 'ఇంటర్నెట్ సేఫ్ డే'ను పురస్కరించుకుని బాలలు, మహిళలపై సైబర్ నేరాల నిరోధంపై యూనిసెఫ్ ఆధ్వర్యంలో మంగళవారం న్యూఢిల్లీలోని జేఎన్టీయూలో నిర్వహించిన జాతీయ స్థాయి శిక్షణ సదస్సులో తెలంగాణ పోలీసులకు అభినందనలు వెల్లువెత్తాయి. ఈ సదస్సుకు తెలంగాణ నుంచి హైదరాబాద్ షీ టీం ఇన్‌స్పెక్టర్ సునీత, వరంగల్ పోలీస్ కమిషనరేట్ వర్ధన్నపేట ఇన్‌స్పెక్టర్ విశ్వేశ్వర్‌కు ఆహ్వానం లభించగా.. వీరిద్దరూ సదస్సులో మాస్టర్ ట్రైనర్లుగా ప్రసంగించారు. పిల్లలు, దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన పోలీస్ అధికారులకు ఈ సదస్సులో ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మహారాష్ట్ర, కేరళ, ఛత్తీస్‌గఢ్, అస్సాం, ఒడిశా, తెలంగాణ, యూపీ, మధ్యప్రదేశ్ నుంచి పోలీస్ అధికారులకు, మాస్టర్ ట్రైనర్లకు మన విశ్వేశ్వర్, సునీతలు శిక్షణనిచ్చారు.



ఢిల్లీలో జరిగిన పోలీసు శిక్షణా సదస్సులో విశ్వేశ్వర్, సునీత తదితరులు

**తెలంగాణ పోలీసుల తీరు అభినందనీయం**

సదస్సులో తెలంగాణ పోలీసులపై పలువురు పోలీసు ఉన్నతాధికారులు ప్రశంసల జల్లు కురిపించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ విశ్వేశ్వర్ 'సాక్షి'తో మాట్లాడుతూ..టెక్నాలజీ వినియోగం, నేర దర్యాప్తులో తెలంగాణ పోలీసులు అవలంబిస్తున్న పద్ధతులను సదస్సులో పాల్గొన్న వక్తలు ప్రశంసించారన్నారు. కేసుల ఛేదన, సైబర్‌నేరాల నియంత్రణ, దర్యాప్తులో తెలంగాణ పోలీసుల విధానం ఆదర్శనీయమని పలువురు కొనియాడారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో డైరెక్టర్ రాంపాల్ సన్యాల్, సైబర్ పీస్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ వినీత్ కుమార్, యూ.పీ రిటైర్డ్ డీజీపీ సుతాప్ సన్యాల్, యూనిసెఫ్ చైల్డ్ ప్రొటెక్షన్‌చీఫ్ ప్రతినిధి సోల్డెడ్ హెరెరో తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రతిపాదించండి.. ప్రారంభించేద్దాం!

**కొత్త వైద్యకళాశాలల స్థాపనకు కేంద్రం ప్రతిపాదనలు కోరినా పట్టించుకోని యంత్రాంగం**

సాక్షి, హైదరాబాద్: జిల్లా ఆసుపత్రులకు అనుబంధంగా కొత్తగా వైద్య కళాశాలల ఏర్పాటుకు కేంద్రం నిధులు ఇస్తామని పదేపదే చెబుతున్నా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు స్పందించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. కొత్త వైద్య కాలేజీల ఏర్పాటుకయ్యే ఖర్చులో 60 శాతం భరిస్తానని కేంద్రం చెప్పింది. ఇప్పటికే రెండు విడతల్లో దేశవ్యాప్తంగా 82 జిల్లా దవాఖాన్లకు అనుబంధంగా మెడికల్ కాలేజీల ఏర్పాటుకు పలు రాష్ట్రాలకు నిధులు మంజూరు చేసింది. మొదటి దశలో 58, రెండో దశలో 24 ఏర్పాటుకు నిధులు కూడా మంజూరు చేసింది. మూడో దశలో మరో 75 కాలేజీల ఏర్పాటుకు నిధులిస్తామని, ప్రతిపాదనలు పంపించాలని రాష్ట్రాలను కోరింది. ఇప్పటి వరకూ ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీలు లేని జిల్లాలకు ప్రాధాన్యం ఇస్తామంది. ఇందుకు అనుగుణంగా డిటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్(డీపీఆర్)సహా ప్రతిపాదనలు పంపాలని సూచించింది. 6 నెలలుగా దీనిపై వివరాలు పంపాలని కేంద్రం కోరుతోంది.ఇప్పటికే 17 రాష్ట్రాలు 89 కాలేజీల కోసం ప్రతిపాదనలు పంపాయి. ఇందులో నుంచి 57కు కేంద్రం ఆమోదం తెలిపింది.

**ప్రతిపాదనలు పంపడంలో నిర్లక్ష్యం...**

కేంద్ర ప్రభుత్వ సూచన ప్రకారం రాష్ట్ర వైద్య విద్యా విభాగం అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మొత్తం 5 జిల్లా ఆసుపత్రులను మెడికల్ కాలేజీలుగా ఆధునీకరించేందుకు డీపీఆర్ కూడా తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించారు. వాటిని పంపి 2 నెలలైనా వారు దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని వైద్య విద్యా విభాగం వర్గాలు చెబుతున్నాయి. మెడికల్ కాలేజీల ఏర్పాటులో తెలంగాణకు ప్రాధాన్యం ఇవ్వాలని గతేడాది ఆగస్టులో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ కేంద్ర మంత్రి హర్షవర్ధన్‌కు విజ్ఞప్తి చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపిస్తే కనీసం 3 కాలేజీలకు అనుమతి వచ్చే అవకాశముంది. తమిళనాడు 13 కాలేజీల కోసం పంపితే 11కు ఆమోదం తెలిపారు. కర్ణాటక 4 పంపితే, 3కు అనుమతిచ్చారు. రాజస్థాన్ 17 కాలేజీలు కోరితే 15 ఏర్పాటుకు అనుమతి ఇచ్చింది. ఉత్తరప్రదేశ్ 14కు గాను 13 కు ఓకే అయ్యింది. ప్రభుత్వ యంత్రాంగ నిర్లక్ష్యం కారణంగా రావాల్సిన కాలేజీలు వెనక్కు పోయే ప్రమాదముంది. కాగా, కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వ ఆదేశం మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖకు ప్రతిపాదనలు పంపించామని వైద్య విద్యా సంచాలకుడు డాక్టర్ రమేశ్‌రెడ్డి తెలిపారు.

## ఆరేళ్లలో ఏడాదికిచ్చింది రూ.25 వేల కోట్లే

### కేంద్రం రాష్ట్రానికి ఏమిచ్చిందో తేటతెల్లమైంది: వినోద్‌కుమార్



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్ వేదికగా వెల్లడించిన వాస్తవాలతో నిజం ఏమిటో తేటతెల్లమైందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్ స్పష్టంచేశారు. నిప్పులాంటి నిజాలను దాచాలని ఎవరు చూసినా అవి దాగవని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పార్లమెంట్‌లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై అడిగిన ప్రశ్నలకు కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ విస్పష్ట ప్రకటన చేశారన్నారు. దీనిని చూసి అయినా కాంగ్రెస్, బీజేపీ, ఇతర విపక్షాల నాయకులు కళ్లు తెరవాలని హితవు పలికారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు గోబెల్స్ ప్రచారాన్ని కట్టిపెట్టాలని ఆయన సూచించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై చేస్తున్న దుష్ప్రచారాన్ని మానుకోవాలని తెలిపారు. ఆరేళ్లలో కేంద్రం రాష్ట్రానికి ఇచ్చింది కేవలం రూ.లక్షన్నర కోట్లు మాత్రమేనని, అంటే ఏడాదికి సగటున రూ.25 వేల కోట్లేనని ఆయన వివరించారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రం పట్ల వివక్షత చూపుతోందని వినోద్ ఆరోపించారు. కేంద్రం రాష్ట్రానికి ఇచ్చింది గోరంత అయితే గొప్పలు మాత్రం కొండంతగా చెప్పుకుంటోందని విమర్శించారు. వాస్తవాలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్, బీజేపీ నాయకులు, విపక్షాలు నోరు మూసుకోవాలని వినోద్ హితవు పలికారు.

## కేకేకు ఓటు హక్కు కల్పనపై వివరణ ఇవ్వండి

### రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశం



**సాక్షి, హైదరాబాద్:** తుక్కుగూడ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల్లో ఎక్స్‌అఫీషియో మెంబర్‌గా రాజ్యసభ సభ్యుడు కె.కేశవరావు (కేకే) వేసిన ఓటు చెల్లదని ప్రకటించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యంపై రాష్ట్ర ఎన్నికల సంఘం స్పందనను తెలియజేయాలని హైకోర్టు ఆదేశించింది. రాజ్యసభ సభ్యుడిగా కేకేను ఏపీకి కేటాయించారని, ఆయన్ను ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా పరిగణించి ఓటు కల్పించిన ఎన్నికల అధికారి ఎస్.రాజేశ్వరరెడ్డిపై చర్యలు తీసుకునేలా ఉత్తర్వులివ్వాలని దాఖలైన రిట్ పిటిషన్‌ను మంగళవారం న్యాయమూర్తి జస్టిస్ పి.కేశవరావు విచారించారు. వాస్తవానికి ఇది ఎన్నికల కేసు అవుతుందని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. పిటిషనర్ తరఫు న్యాయవాది సురేందర్‌రావు కల్పించుకుని రాష్ట్రంలో ఎలక్షన్ ట్రిబ్యునల్ లేదని చెప్పారు. రాష్ట్ర ఎన్నికల సంఘం వైఖరిని తెలుసుకుని చెప్పాలని ఆదేశించిన జడ్జి.. విచారణ గురువారానికి వాయిదా వేశారు.

## పెరిగిన అంచనాలకు ఆమోదం

**సాక్షి, హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఎల్లంపల్లి దిగువన ఉన్న ప్యాకేజీ–7 అంచనా వ్యయాలు పెరిగాయి. పెరిగిన అంచనా వ్యయాలకు మంగళవారం నీటి పారుదల శాఖ రాష్ట్ర స్థాయి స్టాండింగ్ కమిటీ (ఎస్‌ఎల్‌ఎస్‌సీ) ఆమోదం తెలిపింది. ప్యాకేజీ–7 వాస్తవ అంచనా వ్యయం రూ. 1,502 కోట్లుండగా, అది రూ. 2,080 కోట్ల మేర పెరిగింది. పెరిగిన భూసేకరణ అవసరాలు, అదనపు నిర్మాణాలు, క్యాంపు కార్యాలయాల నిర్మాణంతో వ్యయం పెరగగా.. దీనికి ఎస్‌ఎల్‌ఎస్‌సీ కమిటీ ఓకే చెప్పింది. ఇప్పటికే ప్యాకేజీ–6 పనులు రూ. 5,243 కోట్ల నుంచి రూ. 6,907 కోట్లకు పెరగగా, ప్యాకేజీ–8 అంచనా వ్యయాలు రూ. 5,166 కోట్ల నుంచి రూ. 6,897 కోట్లకు చేరిన విషయం తెలిసిందే. వీటితో పాటే 'సీతారామ'లోని కొన్ని కొత్త పనులను ప్రస్తుతం ఉన్న ఏజెన్సీలతో చేయించేందుకు ఎస్‌ఎల్‌ఎస్‌సీ ఓకే చెప్పింది.

## హైకోర్టుకు ఆదిభట్ల విప్ ధిక్కార వివాదం

**సాక్షి, హైదరాబాద్:** రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ తరఫున గెలుపొందిన కౌన్సిలర్లకు జారీ చేసిన విప్‌ను ధిక్కరించి టీఆర్‌ఎస్‌లో చేరి చైర్‌పర్సన్ అవ్వడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన రిట్‌పై హైకోర్టు స్పందించింది. ప్రతివాదులైన మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి, ఆదిభట్ల మున్సిపల్ కమిషనర్, రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్‌లతోపాటు వ్యక్తిగత హోదాలో కొత్త ఆర్తికలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణను ఈ నెల 17కి వాయిదా వేస్తున్నట్లు మంగళవారం న్యాయమూర్తి జస్టిస్ పి. కేశవరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఆదిభట్ల మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బి.బాలరాజ్‌గౌడ్, కాంగ్రెస్ కౌన్సిలర్ మర్రి నిరంజన్‌రెడ్డి సంయుక్తంగా దాఖలు చేసిన రిట్‌లో కాంగ్రెస్ పార్టీ గుర్తుపై కొత్త ఆర్తిక కౌన్సిలర్‌గా ఎన్నికైన వెంటనే టీఆర్‌ఎస్ తీర్థం తీసుకుని మున్సిపల్ చైర్‌పర్సన్ అవ్వడాన్ని చట్ట వ్యతిరేకమని ప్రకటించాలని కోరారు. పార్టీ అధ్యక్షుడి హోదాలో బాలరాజ్‌గౌడ్ జారీ చేసిన విప్‌ను ధిక్కరించడం వల్ల మున్సిపల్ చట్టంలోని 2020 నిబంధనల ప్రకారం కౌన్సిలర్‌గా ఆమె ఎన్నిక చెల్లదని ప్రకటించాలన్నారు. మున్సిపల్ చైర్మన్‌గా ఆర్తిక ఎన్నిక చెల్లదని, ఆమె చైర్మన్‌గా విధులు నిర్వహించకుండా ఉత్తర్వులివ్వాలని కోరారు. చైర్‌పర్సన్ ఎన్నికల సమయంలో తీసిన వీడియోను అధికారుల నుంచి తెప్పించుకుని కోర్టు పరిశీలించి ఆ మేరకు ఉత్తర్వులివ్వాలని విన్నవించారు.

## ఇతర రాష్ట్రాల్లో బొగ్గు బ్లాకులు కేటాయిస్తాం

### సింగరేణికి కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి హామీ

**సాక్షి, హైదరాబాద్:** దేశ బొగ్గు అవసరాలు తీర్చడంలో సింగరేణి బొగ్గు గనుల సంస్థ పాత్ర ప్రశంసనీయమని కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి అనిల్ కుమార్ జైన్ కొనియాడారు. దక్షిణ భారతదేశ బొగ్గు అవసరాలను తీర్చడంలో సింగరేణి సంస్థ ప్రముఖపాత్ర పోషించాలని, దీనికోసం ఇతర రాష్ట్రాల్లో బొగ్గు బ్లాకులను కేటాయించడానికి తాము సానుకూలంగా ఉన్నామని తెలిపారు. సింగరేణి అభివృద్ధికి, విస్తరణకు తాము పూర్తి సహకారం అందిస్తామన్నారు. వ్యాపార విస్తరణలో భాగంగా సోలార్, థర్మల్ విద్యుత్ రంగాల్లోకి సంస్థ అడుగుపెట్టడం హర్షణీయమన్నారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో మంగళవారం ఆయన సంస్థ పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సింగరేణి సీఎండీ ఎన్.శ్రీధర్ సంస్థ సాధించిన ప్రగతిని ఆయనకు వివరించారు. 'ఆధునిక బొగ్గు రవాణా పద్ధతులు, తూకం, నాణ్యత ప్రమాణాల పాటింపులో సింగరేణి కృషి మెచ్చుకోదగినది. బొగ్గు రవాణా కోసం స్వయంగా రైల్వే లైన్లను నిర్మించుకోవడం, వినియోగదారుల విశ్వాసం చూరగొనడం సంతోషించదగ్గ విషయాల'ని అనిల్‌కుమార్ ప్రశంసించారు.

## 20న ఎంసెట్ నోటిఫికేషన్!

### 12న ఐసెట్, 17న ఎడ్‌సెట్, 19న పీఈ సెట్ సమావేశాలు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో వృత్తి, సాంకేతిక విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్షల (సెట్స్) కమిటీ సమావేశాలు బుధవారం నుంచి మొదలు కానున్నాయి. ఒక్కొక్క సెట్ కమిటీ సమావేశాన్ని ఒక్కో రోజు నిర్వహించేందుకు సెట్స్ కన్వీనర్లు తేదీలు ఖరారు చేశారు. ఆయా సెట్స్‌కు సంబంధిత యూనివర్సిటీ వైస్ చాన్సలర్ చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. బుధవారం ఐసెట్, 17న ఎడ్‌సెట్, 19వ తేదీన పీఈ సెట్ సమావేశాలను నిర్వహించేందుకు చర్యలు చేపట్టనున్నాయి. ఇక ఎక్కువ మంది విద్యార్థులు ఎదురుచూస్తున్న ఎంసెట్ కమిటీ సమావేశాన్ని ఈనెల 15న లేదా 18వ తేదీన నిర్వహించే అవకాశముంది. అదే రోజు ఈసెట్ కమిటీ సమావేశం కూడా నిర్వహించనున్నారు. ఆ తర్వాత లాసెట్ కమిటీ సమావేశం నిర్వహణకు చర్యలు చేపట్టనున్నారు. ఈ సమావేశాల్లో ఆయా సెట్స్‌కు సంబంధించిన నోటిఫికేషన్ల జారీ తేదీలు, దరఖాస్తుల స్వీకరణ తేదీలను ప్రకటించనున్నారు. వాటితోపాటు అర్హతలు, ఇతర నిబంధనలను కూడా ఈ సమావేశాల్లో ఖరారు చేయనున్నారు. ఇక ఎంసెట్ నోటిఫికేషన్‌ను ఈనెల 20 లేదా 21వ తేదీన జారీ చేసే అవకాశం ఉంది.

## మార్చి 2న పాలిసెట్ నోటిఫికేషన్

**సాక్షి, హైదరాబాద్:** పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పాలిసెట్–2020 నోటిఫికేషన్‌ను మార్చి 2వ తేదీన జారీ చేసేందుకు రాష్ట్ర సాంకేతిక విద్యా శిక్షణ మండలి (ఎస్‌బీటీఈటీ) కసరత్తు చేస్తోంది. ఇందులో పరీక్ష ఫీజు, ఇతర నిబంధనలను, దరఖాస్తుల స్వీకరణ తేదీలను ప్రకటించనుంది. ఈ ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 17వ తేదీన నిర్వహించనుంది.



# ప్రైవేటువి 1,100.. ఆర్టీసీవి 0

## స్లీపర్ సర్వీసుల్లో 'పడకేసిన' రోడ్డు రవాణా సంస్థ

రాత్రి వేళ హాయిగా విశ్రమించి ప్రయాణించాలని కోరుకునే వారే ఎక్కువ. అందుకే దూరప్రాంతాలకు వెళ్లే రైళ్లకు డిమాండు ఎక్కువ. కానీ, వాటి సంఖ్య పరిమితం. అన్ని ప్రాంతాలకు రైళ్లు అందుబాటులో లేవు. అందుకే స్లీపర్ బస్సులకు డిమాండ్ బాగా పెరుగుతోంది. బెంగళూరు, ముంబై, వైజాగ్, తిరుపతి లాంటి సుదూర ప్రాంతాలకు స్లీపర్ బస్సుల్లో ప్రయాణాలు ఎక్కువ. ప్రయాణికుల డిమాండును గుర్తించి ప్రైవేటు ట్రావెల్స్ యజమానులు ఎప్పటికప్పుడు స్లీపర్ బస్సు సర్వీసుల సంఖ్య పెంచుతున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి నిత్యం వివిధ ప్రాంతాలకు దాదాపు 1,100 స్లీపర్ సర్వీసులు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా టూరిస్ట్ పర్మిట్ తీసుకుని స్టేజి క్యారియర్లుగా తిరుగుతున్న బస్సులతోపాటు, అరుణాచల్ ప్రదేశ్ లాంటి పర్యాటకులు ఎక్కువగా ఉండే రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకుని, అక్కడి నుంచే టూరిస్ట్ పర్మిట్ తీసుకుని హైదరాబాద్ కేంద్రంగా తిరుగుతున్న బస్సులు కూడా వీటిలో ఉన్నాయి. అయినా, ప్రయాణికులకు అందుబాటులో ఉంటూ దర్జాగా పరుగుపెడుతూ గల్లా పెట్టెను నింపుకుంటున్నాయి. ఇంత డిమాండ్ ఉండి కూడా స్లీపర్ సర్వీసులు నడపడంలో ఆర్టీసీ చేతులెత్తేసింది. ప్రస్తుతం ఆర్టీసీ వద్ద ఒక్క స్లీపర్ బస్సు కూడా లేదు. – సాక్షి, హైదరాబాద్

- పడుకుని ప్రయాణానికి భారీ డిమాండ్
- ప్రయాణికులను ఆకట్టుకుంటూ బస్సుల సంఖ్య పెంచుకుంటున్న ప్రైవేటు ట్రావెల్స్
- చేష్టలుడిగి చూస్తున్న అధికారులు

### సమ్మె తర్వాత కూడా మారని తీరు..

ఆర్టీసీ తీవ్ర నష్టాలతో కొట్టుమిట్టాడుతూ దివాలా దశకు చేరుకున్న తరుణంలో వచ్చి పడిన సమ్మె దాన్ని పూర్తిగా కుదేలు చేసింది. ఆ తర్వాత ప్రభుత్వం మేల్కొని దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించి, ఆదాయం పెంచుకునే క్రమంలో కి.మీ.కు 20 పైసలు చొప్పున చార్జీలు పెంచుకునేందుకు అనుమతించింది. దీనివల్ల రోజువారీ ఆదాయం రూ.2 కోట్ల మేర పెరిగింది. ఇలాంటి సమయంలో కూడా డిమాండ్‌కు తగ్గట్టుగా తనను తాను మార్చుకోవడంలో ఆర్టీసీ విఫలమవుతోంది. దూర ప్రాంతాలకు స్లీపర్ బస్సులు కావాలని ప్రయాణికులు కోరుతున్నా పట్టించుకోవడం లేదు. నిత్యం అలాంటి సర్వీసులు సీట్లు రిజర్వ్ చేసుకునేందుకు వందలాది మంది ఆర్టీసీని సంప్రదిస్తున్నారు. 'మా వద్ద అలాంటి బస్సుల్లేవు'అని సింపుల్‌గా సమాధానమిచ్చి సిబ్బంది చేతులు దులుపుకొంటున్నారు. సురక్షిత ప్రయాణంలో ఆర్టీసీతోనే సాధ్యమన్న అభిప్రాయం సాధారణ ప్రయాణికుల్లో ఉంది. అందుకే చాలామంది ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించేందుకు మొగ్గు చూపుతారు. కానీ, స్లీపర్ బస్సుల్లేక తప్పని పరిస్థితిలో ప్రైవేటు బస్సుల్లో ప్రయాణిస్తున్నారు.

### సీఎం భేటీలో ప్రస్తావన వచ్చినా..

ఇటీవల సమ్మె ముగిసేవేళ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్వహించిన సమావేశంలో స్లీపర్ బస్సుల అంశం ప్రస్తావనకు వచ్చింది. దీంతో ఇప్పటికిప్పుడు భారీ ఖర్చు చేసి కొత్త బస్సులు కొనడం కంటే, అందుబాటులో ఉన్న గరుడ బస్సుల్లో కొన్నింటిని స్లీపర్ సర్వీసులుగా మార్చాలని నిర్ణయించారు. సమ్మె అనంతరం రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కూడా ఇదే విషయాన్ని వెల్లడించారు. తొలుత 25 బస్సులను స్లీపర్ సర్వీసులుగా మార్చాలని యోచిస్తున్నామని పేర్కొన్నారు. కానీ అధికారులు మాత్రం ఇప్పటివరకు అలాంటి కసరత్తే చేయలేదు. సరుకు రవాణా కోసం పాత ఆర్టీసీ బస్సులను బస్‌బాడీ వర్క్‌షాపులో కార్గో సర్వీసులుగా మారుస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే 50 వరకు బస్సులను కార్గో వాహనాలుగా మార్చేశారు.

### వెన్నెల సర్వీసులు.. తుక్కుగా మారి..

వెన్నెల పేరుతో ఆర్టీసీ స్లీపర్ బస్సులు నిర్వహించింది. ఇటీవలి వరకు రెండు బస్సులుండేవి. అవి పాతబడి మరమ్మతులు చేస్తే కాని నడిచే పరిస్థితి లేకపోవడంతో వాటిని తుక్కుగా మార్చేశారు. దీంతో ఇప్పుడు ఒక్క స్లీపర్ బస్సు కూడా లేకుండా పోయింది. వృద్ధులు, నడుము నొప్పి, వెన్నుపూస సమస్యలున్న వారు కూర్చుని దూర ప్రాంతాలకు ప్రయాణించలేకపోతున్నారు. వీరు స్లీపర్ బస్సులనే ఎంచుకుంటున్నారు. దీంతో ప్రైవేటు ట్రావెల్స్ అలాంటి వారిని ఆకర్షించేందుకు స్లీపర్ సర్వీసుల సంఖ్యను పెంచుకుంటున్నాయి. ఇప్పటివరకు హైదరాబాద్ నుంచి మాత్రమే ఆ సర్వీసులు అందుబాటులో ఉండగా.. తాజాగా వరంగల్, కరీంనగర్ లాంటి పట్టణాల నుంచి ప్రారంభిస్తున్నారు. ఇటీవల వరంగల్ నుంచి ఓ ప్రైవేటు సంస్థ బెంగళూరుకు సర్వీసు ప్రారంభించింది. ఇది నిబంధనలకు విరుద్ధం కావడంతో ఆర్టీసీ అధికారులు అడ్డుకున్నారు. కానీ చర్యలు తీసుకోవాల్సిన రవాణా శాఖ చేతులెత్తేయడంతో ఆ బస్సు నిండుగా ప్రయాణికులతో దర్జాగా పరుగులు తీస్తోంది. మరికొద్ది రోజుల్లో ప్రైవేటు సంస్థలు స్లీపర్ సర్వీసుల సంఖ్యను 1,500కు పెంచుకునేందుకు కసరత్తు చేస్తున్నాయి.

# సేఫ్టీ క్లబ్‌లు దేశవ్యాప్తంగా విస్తరించాలి

### బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ డా. ఆండ్రూ ఫ్లెమింగ్

**సాక్షి, హైదరాబాద్:** మహిళలు, చిన్నారుల భద్రతకోసం ఏర్పాటు చేసిన సేఫ్టీ క్లబ్‌లను దేశవ్యాప్తంగా విస్తరింపజేయాలని బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ డా.ఆండ్రూ ఫ్లెమింగ్ అన్నారు. మహిళలు, చిన్నారుల భద్రత కోసం చేపడుతున్న చర్యలతో వారిలో భరోసా ఏర్పడిందన్నారు. మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని ఐదు కళాశాలల్లో పైలెట్ ప్రాజెక్టుగా ఏర్పాటు చేసిన సేఫ్టీ క్లబ్‌లను విమెన్ సేఫ్టీ వింగ్ ఐజీ స్వాతిలక్రా, ఎస్పీ సుమతితో కలసి ఆయన ప్రారంభించారు. ఇందులో భాగంగా సికింద్రాబాద్ ఎస్వీఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆండ్రూ ఫ్లెమింగ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణాలో మహిళలు, యువతుల భద్రతకు చేపట్టిన చర్యలు వినూత్నంగా ఉన్నాయని, హాక్–ఐ, డయల్100, షీటీమ్స్, సేఫ్టీ క్లబ్‌లపై విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. స్వాతీ లక్రా మాట్లాడుతూ.. సమాజంలో కేవలం 10 నుంచి 15% యువకుల ప్రవర్తనలోనే మార్పు తేవాల్సిన అవసరం ఉందని, దాదాపు 80% పైన యువకులు సత్ప్రవర్తనతో వున్నారని అభిప్రాయపడ్డారు. ప్రతీ కళాశాలలో 45 మంది విద్యార్థినులు సభ్యులుగా వుండే ఈ సేఫ్టీ క్లబ్‌లు విద్యార్థినుల భద్రతతో పాటు, తమ చుట్టూ ఉన్న మహిళల రక్షణ కోసం పనిచేస్తాయని అన్నారు. ఈ సేఫ్టీ క్లబ్‌లను త్వరలోనే రాష్ట్రం అంతటికీ విస్తరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.సి.ఈ.ఆర్.టీ. డైరెక్టర్ టి.శేషకుమారి, కళాశాల విద్య జాయింట్ డైరెక్టర్ మంగళ, పలు స్వచ్ఛంద సంస్థలకు చెందిన అజయ్ సింగ్, వికార్ ఘావ, మధుసూదన్ రావు, సబ్రియా తదితరులు హాజరయ్యారు. అనంతరం మహిళల భద్రత, రక్షణ కోసం రూపొందించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ ఆండ్రూ ఫ్లెమింగ్‌కు షీ టీమ్ మెమెంటోను అందజేస్తున్న విమెన్ సేఫ్టీ వింగ్ ఐజీ స్వాతి లక్రా

## అనాథలకు ఆధార్ ఇవ్వాలని హెచ్చార్సీలో పిటిషన్

**సాక్షి, హైదరాబాద్:** అనాథ పిల్లలకు ఆధార్ ఇవ్వాలంటూ బాలల హక్కుల సంఘం డిమాండ్ చేసింది. రాష్ట్రంలోని అనేక ప్రైవేటు అనాథాశ్రమాల్లో, కొన్ని ప్రభుత్వ గృహాల్లో ఆశ్రయం పొందుతున్న వారికి ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేవని, వెంటనే వీరికి ఆధార్, ఇతర ధ్రువీకరణలు జారీ చేసేలా ఆదేశాలివ్వాలంటూ బాలల హక్కుల సంఘం మంగళవారం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (హెచ్చార్సీ)లో పిటిషన్ దాఖలు చేసింది. అనాథ శరణాలయాల్లో ఉన్నవారు కేవలం 27 శాతం మాత్రమే అనాథలని, మిగిలిన వారు పాక్షిక అనాథలని పేర్కొంది. రాష్ట్రంలోని అన్ని అనాథ శరణాలయాలను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొని, పిల్లల్లేని దంపతులకు దత్తత ఇచ్చే ప్రక్రియను వేగవంతం చేయాలని పిటిషన్‌లో కోరింది. ఈ కేసును మరింత సమాచారం కోసం మానవ హక్కుల కమిషన్ మార్చి 3కి వాయిదా వేసింది.

# నేరగాళ్ల 'ట్రాకింగ్'

- 'సీసీటీఎన్‌ఎస్'తో పోలీసుల చేతిలో నేరస్తుల గుట్టు
- గత చరిత్ర ఆధారంగా కేసుల దర్యాప్తునకు వీలు
- నేరస్తులకు సత్వర శిక్ష విధింపే లక్ష్యంగా కొత్త విధానం
- రెండు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా అమలుకు డీజీపీ ఆదేశాలు
- విమెన్ సేఫ్టీవింగ్, రోడ్‌సేఫ్టీ అథారిటీలో పైలట్ ప్రాజెక్టుగా అమలు




**సాక్షి, హైదరాబాద్:** హత్యలు, దొంగతనాల కేసుల్లో అరెస్టవుతోన్న పలువురు నిందితులు.. పోలీసుల విచారణలో అమాయకుల్లా నటిస్తుంటారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వారిలో ఈ పోకడ మరీ అధికం. విచారణ క్రమంలో అతని గత చరిత్ర తెలుసుకున్న కొద్దీ పోలీసులు కేసు దర్యాప్తు విధానాన్ని మారుస్తుంటారు. దీనివల్ల సమయం వృథా అవుతుంది. ఈలోపు నిందితుడికి బెయిల్ రావడం, విచారణకు సహకరించకపోవడం వంటివి షరా మామూలే. ఇకపై నిందితులకు అలాంటి అవకాశం లేకుండా పదేపదే నేరాలకు పాల్పడే వారికి క్యాపిటల్ పనిష్మెంట్ పడేలా దర్యాప్తు విధానాన్ని మార్చాలని డీజీపీ మహేందర్‌రెడ్డి నిర్ణయించారు. దర్యాప్తుకు ముందే నిందితుడి నేరచరిత్రను తెలిపే.. క్రైం అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టం (సీసీటీఎన్‌ఎస్)ను రెండు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని ఆయన ఆదేశించారు. తొలుత ఈ వినూత్న విధానాన్ని విమెన్‌సేఫ్టీ వింగ్, రోడ్‌సేఫ్టీ అథారిటీలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నారు.

**ఎవరూ తప్పించుకోలేరు**

ముఖ్యంగా ఇళ్లలో చోరీలు చేసేవారు, రోడ్లపై తరచూ యాక్సిడెంట్లు చేసేవారు, మహిళలు, చిన్నారులపై పదేపదే అఘాయిత్యాలకు పాల్పడేవారికి సత్వర శిక్ష విధింపే లక్ష్యంగా ఈ విధానానికి శ్రీకారం చుట్టారు. రిపీటెడ్ అఫెండర్స్ పదేపదే నేరాలకు పాల్పడే వీల్లేకుండా న్యాయస్థానాలు త్వరగా శిక్ష ఖరారు చేసేందుకు కొత్త విధానం దోహదపడుతుందని పోలీసులు చెబుతున్నారు. ఈ విధానంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారే కాకుండా.. దేశవ్యాప్తంగా చోరీలు, హత్యలకు పాల్పడే బందిపోటు, సుపారీ ముఠాల సమాచారం తెలుసుకునే వీలుంది. ఇతర రాష్ట్రాల నేరస్తుల జాబితానూ సీసీటీఎన్‌ఎస్ ద్వారా తెలుసుకోవచ్చనీ, ఇక్కడ నేరం చేసినా ఎవరూ తప్పించుకోలేరని ఉన్నతాధికారులు అంటున్నారు. ఇప్పటివరకు తెలంగాణలో 9,20,000 మంది వేలిముద్రల డేటాబేస్ అందుబాటులో ఉంది. వీరిలో నిరపరాధులుగా విడుదలైనవారు, పాత నేరస్తులు, కిరాయి హంతకులు, పదేపదే నేరాలకు పాల్పడేవారు ఉన్నారు. ఈ విధానం అమల్లోకి వస్తే కేసుల దర్యాప్తు వేగం, కన్విక్షన్ రేటు పెరుగుతాయని పోలీసు శాఖ భావిస్తోంది.

### నేరచరిత్ర ఇలా తవ్వితీస్తారు..

- హత్యలు, రేప్, యాక్సిడెంట్ల కేసుల్లో నిందితుడు చిక్కగానే దర్యాప్తు కన్నా ముందే.. అతని నేరచరిత్రను పరిశీలిస్తారు.
- దర్యాప్తు అధికారి (ఐఓ) నిందితుడి వేలిముద్రలను సేకరించి డీజీపీ కార్యాలయంలోని సీసీటీఎన్‌ఎస్‌కు పంపిస్తారు. నిందితుడు పాత నేరస్తుడైతే.. వేలిముద్రల ఆధారంగా అతని చరిత్ర మొత్తం చేతికందుతుంది.
- ఫలితంగా నేరస్తుని స్వభావం, నేర విధానం, సాక్ష్యాల మాయానికి చేసిన పనులు, వ్యక్తిగత జీవితం వంటి వాటిపై దర్యాప్తు అధికారికి అవగాహన వస్తుంది. దీంతో దర్యాప్తు తొందరగా కొలిక్కి వస్తుంది.
- ఎఫ్ఐఆర్, చార్జిషీటుతోపాటు పాత నేరచరిత్రను జోడించడం వల్ల నేరస్తుని నేర స్వభావాన్ని కోర్టులోనూ వేగంగా నిరూపించినట్టవుతుంది.

# రవాణా కమిషనర్ కార్యాలయంలో దాడులు

- అడ్మినిస్ట్రేటివ్ అధికారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు
- రూ.36 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన నరేందర్
- ట్రేలర్ అండ్ ట్యాంకర్ ప్రొసీడింగ్స్ కోసం లంచం
- ఏసీబీకి పట్టుబడటం ఇది రెండోసారి

**సాక్షి, హైదరాబాద్:** స్వయంగా రవాణా మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కొలువుదీరి ఉండే రవాణా కమిషనర్ కార్యాలయంలోనే లంచావతారం పడగవిప్పింది. కొత్త వాహనాల్లో మార్పుచేర్పులు, అక్షర దోషాలను సవరించడం వంటి విధులు నిర్వహించే పరిపాలనాధికారి జె.నరేందర్ మంగళవారం రూ.36 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఇలా అవినీతికి పాల్పడుతూ నరేందర్ ఏసీబీకి చిక్కడం ఇది రెండోసారి. ఖైరతాబాద్‌లోని రవాణా కమిషనర్ కార్యాలయంలో ఈ ఉదంతం చోటుచేసుకుంది. సంగారెడ్డికి చెందిన సీహెచ్ సందీప్ ట్రేలర్ అండ్ ట్యాంకర్‌గా వాహనాన్ని మార్పు చేసుకోవడం కోసం రవాణాశాఖ నుంచి ప్రొసీడింగ్స్‌ను పొందేందుకు గత నెల 13న అడ్మినిస్ట్రేటివ్ అధికారి నరేందర్‌ను సంప్రదించాడు. సదరు అనుమతుల కోసం రూ.36 వేలు లంచం ఇవ్వాల్సిందిగా నరేందర్ డిమాండ్ చేశాడు. చివరకు రూ.30 వేలు తీసుకొని ప్రొసీడింగ్స్ ఇచ్చేందుకు అంగీకరించాడు. ఈ క్రమంలో సందీప్ ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. అధికారుల సూచన మేరకు రూ.36 వేల నగదును నరేందర్‌కు అందజేశాడు. అప్పటికే అక్కడ నిఘా వేసి ఉంచిన ఏసీబీ అధికారులు నరేందర్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. 2016 జనవరి 4న ఒక కేసులో రూ.8,000 లంచం తీసుకుంటూ పట్టుబడిన నరేందర్ తిరిగి మరోసారి పట్టుబడటం గమనార్హం. అతన్ని ఏసీబీ అధికారులు అరెస్టు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు.

**లంచం అడిగితే ఫిర్యాదు చేయండి..**

రవాణా శాఖలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది లంచాలు డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్–1064కు ఫిర్యాదు చేయవచ్చని ఏసీబీ డైరెక్టర్ జనరల్ పూర్ణచందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, రవాణా కమిషనర్ ప్రధాన కార్యాలయంలో ఏసీబీ దాడులతో హైదరాబాద్‌లోని అన్ని ఆర్టీఏ కార్యాలయాల్లో అధికారులు ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు. దళారులను కార్యాలయాల్లోకి రాకుండా అడ్డుకున్నారు. ఎక్కడికక్కడ జాగ్రత్తలు పాటించారు.



## భారతీయ వ్యోమగాములకు శిక్షణ ప్రారంభం

**బెంగళూరు:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మానవసహిత అంతరిక్ష ప్రయోగం గగన్‌యాన్‌లో మరో ముందడుగు పడింది. రష్యా రాజధాని మాస్కోలోని గగరీన్ రీసెర్చ్ అండ్ టెస్ట్ కాస్మోనాట్ ట్రైనింగ్ సెంటర్‌లో భారతీయ వ్యోమగాములు నలుగురికి శిక్షణ మొదలైంది. గగన్‌యాన్‌లో భాగంగా అంతరిక్షంలోకి వెళ్లేందుకు ఇస్రో నలుగురు ఎయిర్‌ఫోర్స్ పైలెట్లను ఎంపిక చేయగా వీరందరికీ సోమవారం శిక్షణ మొదలైందని రష్యాకు చెందిన శిక్షణ సంస్థ గ్లావ్‌కాస్మోస్ తెలిపింది. ఏడాదిపాటు వీరికి భౌతిక శిక్షణతోపాటు బయోమెడికల్ రంగంలోనూ శిక్షణ ఉంటుందని ఆ ప్రకటనలో పేర్కొంది. రష్యా అంతరిక్ష నౌక సోయుజ్‌లోని వ్యవస్థలను కూడా వ్యోమగాములు క్షుణ్ణంగా అర్థం చేసుకుంటారని వివరించింది. భారతీయ వ్యోమగాములకు శిక్షణ ఇచ్చేందుకు గ్లావ్‌కాస్మోస్, ఇస్రోకు చెందిన హ్యూమన్ స్పేస్‌ఫ్లయిట్ సెంటర్‌ల మధ్య గత ఏడాది ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే.

# భారత్‌కు ట్రంప్

- ఈనెల 24, 25 తేదీల్లో భారత్‌లో అమెరికా అధ్యక్షుడి పర్యటన
- వ్యూహాత్మక సంబంధాలు బలోపేతమవుతాయన్న ఇరుదేశాలు



**వాషింగ్టన్/న్యూఢిల్లీ:** భారత్‌లో అమెరికా అధ్యక్షుడి పర్యటన తేదీలు ఖరారయ్యాయి. ఈ నెల 24, 25వ తేదీల్లో భారత్ రానున్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ న్యూఢిల్లీ, అహ్మదాబాద్‌ల్లో పర్యటించనున్నారు. భారత్‌లో ట్రంప్ మొదటిసారిగా జరిపే ఈ పర్యటన ద్వారా రెండు దేశాల మధ్య వ్యూహాత్మక సంబంధాలను, ప్రజల మధ్య స్నేహాన్ని మరింత పెంచుతాయని అమెరికా తెలిపింది. ఈ పర్యటనలో ట్రంప్ వెంట ఆయన భార్య మెలానియా ట్రంప్ కూడా ఉంటారని అధ్యక్షభవనం శ్వేతసౌధం ప్రెస్ సెక్రటరీ స్టెఫానీ గ్రిషమ్ తెలిపారు. గత వారం ట్రంప్, భారత ప్రధాని మోదీ మధ్య జరిగిన ఫోన్ సంభాషణ సందర్భంగా ఈ మేరకు ఖరారైనట్లు వెల్లడించారు. పరస్పర విశ్వాసం, ఒకే విధమైన విలువలు, గౌరవం, అవగాహనల ప్రాతిపదికగా భారత్, అమెరికాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం సుహృద్భావ వాతావరణంలో కొనసాగుతోంది’ అని శ్వేతసౌధం వివరించింది. ‘ఈ పర్యటన సందర్భంగా ఇద్దరు నేతలు ద్వైపాక్షిక సంబంధాల ప్రగతిని సమీక్షించడంతోపాటు వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని విస్తృతం చేసుకునేందుకు కృషి చేస్తారు’ అని భారత్ తెలిపింది. ప్రధాని మోదీ ఆహ్వానంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఆయన భార్య ఈనెల 24, 25వ తేదీల్లో పర్యటించనున్నారని భారత విదేశాంగ శాఖ పేర్కొంది. న్యూఢిల్లీ, అహ్మదాబాద్ పర్యటనల సమయంలో ట్రంప్ దంపతులు వివిధ రంగాల వారితో ముచ్చటిస్తారని తెలిపింది. రూ.13,500 కోట్ల విలువైన సమగ్ర గగనతల రక్షణ ఆయుధ వ్యవస్థ(ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్ వెపన్ సిస్టం)ను భారత్‌కు విక్రయించేందుకు విదేశాంగ శాఖ అంగీకరించిన కొద్దిగంటల్లోనే ట్రంప్ పర్యటన ఖరారైనట్లు శ్వేతసౌధం ప్రకటించింది. ట్రంప్ కంటే ముందు 2010–2015 సంవత్సరాల మధ్య అధ్యక్షుడిగా ఉన్న ఒబామా భారత్‌లో పర్యటించారు. గత ఏడాది మేలో రెండోసారి ప్రధాని అయిన మోదీ ట్రంప్‌తో 4 పర్యాయాలు భేటీ అయ్యారు.

# విప్‌లతో సభకు నిండుదనం

- రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు వ్యాఖ్య
- మార్చి 2 వరకు పార్లమెంట్ సమావేశాలు వాయిదా



**న్యూఢిల్లీ:** రాజ్యసభ సమావేశాల్లో చివరి రోజున సాధారణంగా సభ్యుల హాజరు శాతం తక్కువగా ఉంటున్నందున రాజకీయ పార్టీలు విప్‌లు జారీ చేయడం మంచిదేనని రాజ్యసభ చైర్మన్ ఎం.వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. సమావేశాలు జరిగినన్ని రోజులు కూడా రాజకీయ పక్షాలు ఇలాగే విప్‌లు జారీ చేస్తే సభ సభ్యులతో కళకళలాడుతుందన్నారు. అధికార బీజేపీ సహా, ఇతర పార్టీలు తమ సభ్యులకు మంగళవారం విప్‌లు జారీ చేయడంపై సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బడ్జెట్‌పై చర్చ జరిగే సమయంలో సభలో సభ్యులు తక్కువగా ఉంటే ప్రజల్లో తప్పుడు సంకేతాలు వెళతాయన్నారు. ఎంతో కీలకమైన బడ్జెట్‌పై పార్లమెంట్ సభ్యులకు ఆసక్తి లేదని భావించే ప్రమాదముందన్నారు. ఆఖరి రోజున రాజ్యసభలో బడ్జెట్‌పై చర్చ జరిగింది. జనవరి 31వ తేదీన ప్రారంభమైన పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు మంగళవారంతో మొదటి విడత ముగిశాయి. తిరిగి మార్చి 2వ తేదీన మొదలై ఏప్రిల్ 2వ తేదీ వరకు జరగనున్నాయి. మంగళవారం సమావేశానికి సభ్యులంతా హాజరుకావాలంటూ అధికార బీజేపీ విప్ జారీ చేయడంతో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనుందంటూ ఊహాగానాలు వెలువడ్డాయి.

# ముజఫర్‌పూర్ కేసు దోషులకు జీవిత ఖైదు

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా సంచలనం రేపిన ముజఫర్‌పూర్ కేసులో ఢిల్లీ కోర్టు మంగళవారం తీర్పు వెలువరించింది. ఈ కేసులో దోషులుగా తేలిన బ్రజేష్ ఠాకూర్ సహా 11 మందికి జీవిత ఖైదు విధించింది. బ్రజేష్ మరణించేంత వరకూ జీవిత ఖైదు విధిస్తున్నట్లు తెలిపింది. బిహార్‌లోని ముజఫర్‌పూర్ జిల్లాలో ఉన్న వసతి గృహంలో బాలికలపై అత్యాచారం చేసిన కేసులో బ్రజేష్ సహా 11 మందిని జనవరి 20న కోర్టు దోషులుగా తేల్చింది. మైనర్లపై అత్యాచారం చేసినందుకు గానూ బ్రజేష్‌పై పోక్సో, జువనైల్ జస్టిస్ సహా పలు చట్టాల కింద అభియోగాలు నమోదు చేసింది. బిహార్ పీపుల్స్ పార్టీకి (బీపీపీ) చెందిన బ్రజేష్ ఈ వసతి గృహాన్ని నిర్వహిస్తున్నాడు. అందులో ఉంటున్న బాలికలపై లైంగిక దాడి, అత్యాచారాలు జరుగుతున్న విషయాన్ని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ 2018 మే 26న వెలుగులోకి తెచ్చింది. దీనిపై ముజఫర్‌పూర్ స్థానిక కోర్టులో కేసు నమోదైంది. అనంతరం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ కేసును 2019 ఫిబ్రవరి 7న ఢిల్లీలోని పోక్సో కోర్టుకు బదిలీ చేశారు. మైనర్లపై దారుణాలకు ఒడిగట్టిన దోషులకు జీవిత ఖైదు విధించాలని సీబీఐ కోరింది. ఈ కేసుకు సంబంధించి అప్పటి బిహార్ మంత్రి మంజు వర్మపైనా తీవ్ర ఆరోపణలు వచ్చాయి. ఆమె భర్తకు బ్రజేష్‌తో సన్నిహిత సంబంధాలున్నాయని విమర్శలు రావడంతో ఆమె పదవికి రాజీనామా చేశారు.



మంటల్లో చిక్కుకున్న ఈ హెలికాప్టర్ సిరియా ప్రభుత్వానిది. దీనిని ఇడ్లిబ్ ప్రావిన్స్‌లో మంగళవారం ఉగ్రవాదులు క్షిపణులతో కూల్చివేశారు.

# నిర్భయ దోషులకు ‘సుప్రీం’ నోటీసులు

- కొత్త డెత్ వారెంట్‌కి ఢిల్లీ ప్రభుత్వం, కేంద్రం పిటిషన్ అడ్డుకాదని స్పష్టం
- దిశ ఎన్‌కౌంటర్‌ని ప్రజలు సెలబ్రేట్ చేసుకున్నారన్న సొలిసిటర్ జనరల్

**న్యూఢిల్లీ:** నిర్భయ దోషుల ఉరిశిక్ష అమలుపై స్టే ఎత్తివేయాలంటూ కేంద్ర ం దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రతిస్పందించాల్సిందిగా సుప్రీంకోర్టు నిర్భయ దోషులకు నోటీసులు జారీచేసింది. అలాగే దోషులకు కొత్తగా డెత్ వారెంట్ జారీచేసేందుకు ట్రయల్ కోర్టుకి వెళ్ళేందుకు పూర్తి అధికారాలను ఇచ్చింది. నిర్భయ దోషుల మరణశిక్ష అమలుకు తేదీలు ఖరారు చేస్తూ ట్రయల్ కోర్టు కొత్తగా డెత్‌వారెంట్ జారీచేయడానికి కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ అడ్డంకి కాదని జస్టిస్ ఆర్.భానుమతి, జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ ఎ.ఎస్.బోపన్నల ధర్మాసనం తేల్చి చెప్పింది. కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వం తరపున వాదించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా దోషులకు ఉరిశిక్ష అమలు చేయడం ‘సంతోషం’ కోసం కాదనీ, అధికారులు కేవలం చట్టపరమైన బాధ్యతలను నిర్వర్తిస్తున్నారనీ అన్నారు. ఈ కేసులో వినయ్ శర్మ అనే దోషి రాష్ట్రపతి తన క్షమాభిక్ష పిటిషన్ తిరస్కరించడాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశాడు.

### అమలుకు ఇబ్బందులు..

2017లో దోషుల అప్పీళ్ళను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసినప్పటికీ ఇంకా అధికారులు ఇప్పటికింకా వాటిని అమలు చేయడానికి ఇబ్బంది పడుతున్నారని తుషార్ మెహతా వ్యాఖ్యానించారు. దిశ కేసులో నిందితులను ఎన్‌కౌంటర్ చేయడంపై ప్రజలు ఉత్సవంలా జరుపుకున్నారని తుషార్ అన్నారు. తొలుత దోషులకు నోటీసులు జారీచేయడం వల్ల శిక్ష అమలులో జాప్యం జరుగుతుందని సుప్రీం కోర్టు భావించింది. అయితే ఢిల్లీ ప్రభుత్వం, కేంద్రం కోరడంతో నోటీసులు జారీచేసింది.

# కరోనా మృతులు @ 1000

**బీజింగ్/లండన్/జెనీవా:** చైనాలో కల్లోలం సృష్టిస్తున్న కరోనా వైరస్‌ను కట్టడి చేసేందుకు ఒకవైపు ప్రపంచ ఆరోగ్య సంస్థ రంగంలోకి దిగగా.. వ్యాధి బారిన పడి మరణిస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. చైనా ఆరోగ్య శాఖ అధికారుల సమాచారం మేరకు కరోనా మహమ్మారికి 1,016 మంది మృత్యువాత పడ్డారు. వ్యాధి సోకినట్లు నిర్ధారణ అయిన వారి సంఖ్య 42,638కి చేరింది. మరోవైపు ప్రపంచ ఆరోగ్య సంస్థకు చెందిన నిపుణుల బృందం ఒకటి మంగళవారం బీజింగ్‌ను చేరుకుని వైరస్ నిరోధక చర్యల్లో సాయం అందించడం మొదలుపెట్టిందని చైనా ఆరోగ్య కమిషన్ ఒక ప్రకటనలో తెలిపింది. వైరస్ కారణంగా ఒక్కరోజే 108 మంది మరణించారని, 2,478 కొత్త కేసులు నమోదయ్యాయని తెలిపింది.

**సంయుక్త బృందం ఏర్పాటు..**

కరోనా వైరస్‌ను కట్టడి చేసే లక్ష్యంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ నియమించిన అంతర్జాతీయ నిపుణుల బృందానికి చైనా అధికారులు తోడయ్యారు. ఇరువురూ సంయుక్తంగా వ్యాధిని ఎదుర్కొనేందుకు సిద్ధమవుతున్నట్లు జాతీయ ఆరోగ్య కమిషన్ తెలిపింది. ఇలా ఉండగా ఇతర దేశాల్లో కరోనా వైరస్ బారిన పడ్డ వారి సంఖ్య సోమవారానికి 350కు చేరుకోగా, కనీసం ఇద్దరు మరణించినట్లు తెలుస్తోంది. యూఏఈలోని దుబాయిలో మరో భారతీయుడు కరోనా బారినపడ్డారు. దీంతో ఇప్పటివరకూ ఆ దేశంలో కరోనా బాధితుల సంఖ్య 8కి చేరుకుంది.

**వ్యాక్సిన్ ప్రయోగాలు షురూ?**

కరోనా వైరస్ చికిత్సకు ఒక టీకాతో జంతు పరీక్షలు మొదలుపెట్టినట్లు లండన్‌లోని ఇంపీరియల్ కాలేజ్ శాస్త్రవేత్తలు ప్రకటించారు. కొన్ని నెలల్లో తొలిదశ ప్రయోగాలు పూర్తి చేసి, మానవుల్లో టీకా సామర్థ్యంపై పరీక్షలు చేపడతామన్నారు. ఈ ఏడాది చివరికి ఇది వినియోగంలోకి రానుందన్నారు.



చైనాలోని బీజింగ్ రైల్వేస్టేషన్‌లో మాస్కులు ధరించిన ప్రయాణికులు

**కరోనాతో ప్రపంచానికి ముప్పు!**

చైనాను వణికిస్తున్న కరోనా వైరస్‌ను తగువిధంగా కట్టడి చేయని పక్షంలో అది ప్రపంచం మొత్తానికి ముప్పుగా పరిణమిస్తుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యక్షుడు టెడ్రోస్ అధనోమ్ హెచ్చరించారు. ఈ వైరస్‌ను కట్టడి చేసే లక్ష్యంతో జెనీవాలోని ప్రపంచ ఆరోగ్య సంస్థ కార్యాలయంలో మంగళవారం జరిగిన శాస్త్రవేత్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

**ఇకపై కోవిడ్–19**

ప్రపంచాన్ని వణికిస్తోన్న కరోనా వైరస్‌కు ప్రపంచ ఆరోగ్య సంస్థ కొత్త పేరు పెట్టింది. ఇకపై కరోనాను అధికారికంగా ‘కోవిడ్–19’గా పిలవనున్నారు. ఇందులో సీ అక్షరం కరోనాను, వీ అక్షరం వైరస్‌ను, డీ అక్షరం డిసీజ్ (జబ్బు)ను, 19ని.. వ్యాధిని కనుగొన్న 2019కి సూచనగా పెట్టారు.

### తల్లికి వైరస్.. బిడ్డ క్షేమం!

కరోనా వైరస్ బారిన పడ్డ ఓ మహిళ ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనిచ్చినట్లు చైనా అధికారులు మంగళవారం తెలిపారు. షాన్‌క్సీలో 33 ఏళ్ల మహిళ 2.73 కిలోల బరువున్న బిడ్డకు జన్మనిచ్చిందని తెలిపారు. పుట్టిన బిడ్డకు పరీక్షలు జరిపి కరోనా వైరస్ సోకలేదని నిర్ధారణ చేశామన్నారు. కరోనా కారణంగా తల్లి నుమోనియాతో బాధపడుతోందన్నారు.

## రాష్ట్రీయం

● ‘సాక్షి’ సెలబ్రేషన్ ఆఫర్..

# అరకిలో గోల్డ్ విజేత శ్రీనివాస్‌రెడ్డి

- ఇద్దరికి స్విఫ్ట్ కార్లు.. పదిమందికి యాక్టివా స్కూటీలు
- సెలబ్రేషన్ ఆఫర్ విజేతలుగా 20,083 మంది పాఠకులు
- విజేతలను ప్రకటించిన రిటైర్డ్ జస్టిస్ రవీందర్‌రెడ్డి




**సాక్షి, హైదరాబాద్:** సాక్షి సెలబ్రేషన్స్ ఆఫర్ అరకిలో బంగారం విజేతగా కాశిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి (ప్రకాశం జిల్లా) నిలిచారు. సాక్షి పాఠకులను ప్రోత్సహించే క్రమంలో యాజమాన్యం ఈ ఆఫర్‌ను ప్రవేశపెట్టింది. ‘చదవండి.. గెలవండి’అనే నినాదంతో ‘సాక్షి’ నిర్వహించిన ఈ సెలబ్రేషన్ ఆఫర్‌కు పాఠకుల నుంచి విశేష స్పందన లభించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన సాక్షి పాఠకులు పెద్దసంఖ్యలో పోటీల్లో పాల్గొన్నారు. వారిలో 20,083 మంది విజేతలుగా నిలిచారు. వారందరికీ బహుమతులను అందజేసేందుకు యాజమాన్యం ఏర్పాట్లు చేపట్టింది. విజేతల పేర్లను https://www.sakshi.com వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. విజేతలుగా నిలిచిన పాఠకులకు ఎస్ఎంఎస్‌ల ద్వారా సమాచారాన్ని అందిస్తారు. మంగళవారం సాక్షి ప్రధాన కార్యాలయంలో ఈ ఆఫర్ లక్కీడీప్ డ్రా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన విశ్రాంత న్యాయమూర్తి కె.రవీందర్‌రెడ్డి విజేతలను ప్రకటించారు. గోల్డ్ విన్నర్ శ్రీనివాస్‌రెడ్డికి ఆయన ఫోన్‌చేసి అభినందనలు తెలిపారు. ఆయనతో పాటు సాక్షి దినపత్రిక ఏజెంట్లు వినోద్ (సరూర్‌నగర్), సురేష్ (రామంతాపూర్), నాగిరెడ్డి (ఈసీఐఎల్), శ్రీనివాసరెడ్డి (నేరేడ్‌మెట్), కిషోర్‌కుమార్ (అబిడ్స్), రషీద్ (తార్నాక) కూడా వివిధ కేటగిరీల్లోని విజేతలను ప్రకటించారు. కార్యక్రమంలో సాక్షి సర్క్యులేషన్ విభాగానికి చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

**తొలి 3 కేటగిరీల్లో విజేతలు వీరే..**

**మొదటి కేటగిరీ:** అర కిలో బంగారాన్ని ప్రకాశం జిల్లాకు చెందిన కాశిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి సొంతం చేసుకున్నారు. ఎలక్ట్రికల్ సబ్ కాంట్రాక్టర్‌గా పని చేస్తున్న ఈయన.. ‘నాకు గోల్డ్‌ప్రైజ్ రావడం ఆనందంగా ఉంది. దీనిని నేను ఊహించలేదు. కారు వస్తే బాగుంటుందని ఆశించా. ఏకంగా అర కిలో బంగారం దక్కింది’ అని సంతోషాన్ని వ్యక్తం చేశారు.

**రెండవ కేటగిరీ:** పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన కోటి వరప్రసాద్, రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌కు చెందిన కె.రాజేందర్ మారుతి స్విఫ్ట్ కార్లను సొంతం చేసుకున్నారు.

**మూడవ కేటగిరీ:** ఎస్.రవీంద్రనాథ్ (కొవ్వూరు), మహమ్మద్ పాషా (హైదరాబాద్), పి.జాకరయ్య (కడప), స్వర్ణలత (గన్నవరం), ఎస్.ఎ. రహమాన్ (గుంతకల్), ఎం.అంకిత, ఎం.జగన్నాథన్ (కర్నూలు), ఆర్.సంయుక్త (హైదరాబాద్), ఉద్దారగుడి చిరంజీవి), కుప్పలి శశిభూషణరావు (పార్వతిపురం).. యాక్టివా స్కూటర్లను గెలుచుకున్నారు.

### ప్రజా సమస్యల పరిష్కారానికి సాక్షి కృషి

వివిధ కోణాల్లో ప్రజా సమస్యలపై కథనాలు రాస్తూ వాటి పరిష్కారానికి ‘సాక్షి’కృషి చేయడం ఆనందంగా ఉంది. మారుమూల గ్రామాలకు సైతం ‘సాక్షి’ చేరుకోవడం స్ఫూర్తిదాయకం. ఈ విషయంలో గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న విలేకర్లను అభినందించాలి. అక్కడి సమస్యలను వెలుగులోకి తెచ్చేందుకు చాలా కష్టపడుతున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇంత పెద్ద ఎత్తున పాఠకుల ఆదరణను సంపాదించుకున్న ‘సాక్షి’యాజమాన్యం అభినందనీయులు. ఇదే స్ఫూర్తితో ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చేందుకు ప్రయత్నించాలి. పాఠకులను ప్రోత్సహించే క్రమంలో సెలబ్రేషన్ ఆఫర్‌ను ‘సాక్షి’పారదర్శకంగా నిర్వహించినందుకు కృతజ్ఞతలు. విజేతలకు అభినందనలు.

– కె.రవీందర్‌రెడ్డి, విశ్రాంత న్యాయమూర్తి



మంగళవారం తిరుమలలో ధ్వజస్తంభానికి మొక్కుతున్న శ్రీలంక ప్రధాని రాజపక్సే. చిత్రంలో మంత్రి పెద్దిరెడ్డి, ఈవో సింఘాల్ తదితరులు

# శ్రీవారిని దర్శించుకున్న శ్రీలంక ప్రధాని

**తిరుమల:** శ్రీలంక ప్రధాన మంత్రి మహింద రాజపక్సే మంగళవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తన కుమారుడు యోషిత రాజపక్సే, శ్రీలంక మంత్రి ఆర్ముగన్ తొండమాన్‌తో కలసి ఆలయ వద్దకు చేరుకున్న శ్రీలంక ప్రధానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో ఏవీ ధర్మారెడ్డి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం శ్రీలంక ప్రధాని బృందం అష్టదళపాదపద్మారాధన సేవలో పాల్గొని, వీఐపీ బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకున్నారు. తర్వాత ఆయనకు రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా, టీటీడీ ఈవో, ఏఈవో, మంత్రి పెద్దిరెడ్డి శ్రీవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీలంక ప్రధాన మంత్రి మహింద రాజపక్సేకు తిరుమలలోని పద్మావతి విశ్రాంతి గృహం వద్ద అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు.

# మొక్కల పెంపకంలో తెలంగాణ టాప్

▶ మొదటి పేజీ తరువాయి

లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో కేంద్ర అటవీ శాఖ స్పష్టం చేసింది.

**ప్రభుత్వ చర్యలతో సత్ఫలితాలు..**

మొక్కల పెంపకంలో తెలంగాణ తొలి స్థానంలో నిలిచిందని కేంద్ర అటవీ శాఖ గణాంకాలను వెల్లడించిన నేపథ్యంలో రాష్ట్ర అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అటవీ శాఖ అధికారులు, సిబ్బందిని అభినందించారు. మొక్కల పంపకం, అటవీ పునరుజ్జీవనం, అటవీ రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్లే ఇది సాధ్యమైందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అటవీ రక్షణ చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని, ఆకుపచ్చ తెలంగాణ సాధన లక్ష్యానికి చేరువలో ఉన్నామని, అధికారులు, సిబ్బంది మరింత కష్టపడి ఆ దిశగా పని చేయాలని సూచించారు. రాబోయే రోజుల్లో అటవీ పునరుజ్జీవనంపై మరింత దృష్టి పెట్టనున్నట్లు ఈ సందర్భంగా మంత్రి వెల్లడించారు. సీఎం కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా ప్రతి ఒక్కరూ ఒక్కో మొక్కను నాటి సంరక్షించాలని మంత్రి కోరారు. సీఎం ఆశయాలకు అనుగుణంగా ఆయన పుట్టిన రోజున మొక్కను నాటి కానుకగా ఇద్దామని అన్నారు. సీఎం పుట్టిన రోజు సందర్భంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునివ్వడం ఆదర్శనీయమన్నారు.

# 50 రోజుల్లో గజ్వేల్‌కు రైలు!

▶ మొదటి పేజీ తరువాయి

అనుసంధానించే కీలక ప్రాజెక్టు తొలిదశ అందుబాటులోకి వచ్చినట్టవుతుంది. తనిఖీ చేసిన వారం రోజుల్లో రైల్వే సేఫ్టీ కమిషనర్ నివేదిక ఇచ్చే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

**పట్టాల తరలింపు సమస్య పరిష్కారం..**

మనోహరాబాద్ నుంచి ఈ మార్గం మొదలవుతుంది. అక్కడికి 32 కి.మీ. దూరంలో ఉన్న గజ్వేల్ వరకు మొదటిదశ కొనసాగుతుంది. గజ్వేల్‌కు 21 కి.మీ. ముందు నిజామాబాద్ హైవే వరకు గతంలోనే అన్ని పనులు పూర్తి చేశారు. కానీ జాతీయ రహదారి దాటి గజ్వేల్ వైపు పట్టాల తరలింపు సాధ్యం కాక అటువైపు పనులు చేయలేదు. ఈ పట్టాలు ప్రత్యేకంగా భిలాయ్‌లో తయారు చేస్తారు. ఒక్కొకటి 65 మీటర్ల పొడవుండే నాలుగు పట్టాలను వెల్డింగ్‌తో ఒకటి చేస్తారు. వెరసి ఒక్కో పట్టా 260 మీటర్ల పొడవు ఉంటుంది. వీటిని తరలించాలంటే గూడ్సు రైలే రావాల్సి ఉంటుంది. జాతీయ రహదారి అడ్డుగా ఉండటంతో గూడ్సు రైలు రావటానికి వీల్లేకుండా పోయింది. ఇటీవలే వాహనాలను మళ్లించి ఆ రోడ్డును కట్ చేశారు. అంతకుముందే గూడ్సు రైలు వచ్చేందుకు వీలుగా గజ్వేల్ వైపు చిన్న పట్టాలతో తాత్కాలిక ట్రాక్ సిద్ధం చేశారు. జాతీయ రహదారిని కట్ చేయటంతో తాజాగా గూడ్సు రైలు పట్టాల లోడు తెచ్చింది. ఆ రైలు వచ్చేందుకు తాత్కాలిక పట్టాలు అనుకూలంగా ఉన్నాయో లేదో పరిశీలించేందుకు తొలుత ఐదు రోజుల క్రితం ఓ ఇంజన్‌తో ట్రయల్ రన్ నిర్వహించారు. 21 కిలోమీటర్లకు గాను 16 కిలోమీటర్లకు సరిపోయేలా మూడు లోడులతో పట్టాలను తెచ్చి డంప్ చేశారు. ఇందులో ఇప్పటికే కొన్ని కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయి. మరో 25 రోజుల్లో ఈ పనులు పూర్తి కానున్నాయి. ఆ తర్వాత స్లీపర్ ప్యాకింగ్ యంత్రంతో వాటిని జోడించటంతో ఈ పనులు మొత్తం పూర్తవుతాయి. ఇక ఈ మార్గంలో ఉండే మూడు స్టేషన్లకు సంబంధించి భవనాలు దాదాపు సిద్ధమయ్యాయి. మనోహరాబాద్ భవనం సిద్ధమైంది. ఆ తర్వాత నాచారం, అప్పాయిపల్లి, గజ్వేల్‌లలో స్టేషన్లు ఉంటాయి. వీటిల్లో నాచారం, గజ్వేల్ భవనాలు పూర్తయ్యాయి. చిన్న చిన్న పనులు మాత్రమే మిగిలిఉన్నాయి. అప్పాయిపల్లిలో భవనం పూర్తికావొచ్చింది. ప్లాట్‌ఫారంల పనులు పూర్తి కావాల్సి ఉంది.

**పూర్తయిన బ్రిడ్జీల నిర్మాణం..**

ఇక ఈ 32 కిలోమీటర్ల మార్గంలో ఆరు రోడ్ ఓవర్ బ్రిడ్జీలు మూడు రోడ్ అండర్ బ్రిడ్జీలున్నాయి. అవన్నీ పూర్తయ్యాయి. నాచారం వద్ద హల్దీ నదిపై, గన్‌పూర్, అప్పాయిపల్లిల్లో మధ్యస్థ వంతెనల పనులు పూర్తయ్యాయి. నిజామాబాద్ మీదుగా సాగే 44వ నంబర్ జాతీయ రహదారిని రైల్వే లైన్ క్రాస్ చేసే చోట దాదాపు 100 మీటర్ల మేర పెద్ద వంతెన నిర్మించాల్సి ఉంది. ఆ పనిని జాతీయ రహదారుల విభాగం చేపడుతోంది. ఇప్పటికే రెండు అండర్‌పాస్‌లు నిర్మించారు. జాతీయ రహదారి మీదుగా వెళ్లే వాహనాలను వాటి గుండా మళ్లించారు. ఆ రోడ్డును రైలు దాటేందుకు వీలుగా పూర్తిస్థాయిలో సిద్ధం చేశారు.

# 31 ప్రశ్నల ‘జన గణన’

▶ మొదటి పేజీ తరువాయి

సెన్సస్ అధికారులు ప్రతి కుటుంబం నుంచి అడిగి తెలుసుకోవాలని రాష్ట్ర గెజిట్‌లో చేర్చారు.

**అడిగే ప్రశ్నలివే..**

స్థానిక సంస్థల ఇంటి నంబర్, సెన్సస్ ఇంటి నంబర్, ఇంటిపైకప్పు–గోడల స్వభావం, ఇంటి వినియోగం ఎందుకు, ఇంటి సామర్థ్యం, ఇంటి క్రమసంఖ్య, ఇంటి సభ్యుల సంఖ్య, ఇంటి యజమాని పేరు, యజమాని పురుషుడు లేదా స్త్రీ లేదా ఇతరులు, ఇంటి యజమాని ఏ సామాజిక వర్గానికి చెందిన వారు (ఎస్సీలు, ఎస్టీలున్నారా)?, ఇల్లు సొంతమా కాదా? ఇంట్లో ఉన్న గదుల సంఖ్య, ఇంట్లో ఉన్న వివాహిత జంటల సంఖ్య, తాగునీటి ప్రధాన వనరు ఏంటి? అందుబాటులో ఉన్న తాగునీటి వనరులేంటి? విద్యుత్ సౌకర్యం వివరాలు, మరుగుదొడ్డి ఉందా లేదా? ఉంటే ఏ రకమైన మరుగుదొడ్డి, వృథా జలాన్ని ఎలా పంపిస్తున్నారు, స్నాన సౌకర్య లభ్యత, వంటగది/ఎల్‌పీజీ/పీఎన్‌జీ సౌకర్యం, వంటకు ఉపయోగించే ప్రధాన ఇంధనం ఏంటి? రేడియో/ట్రాన్స్‌లేటర్ ఉన్నాయా? టీవీ ఉందా? ఇంటర్నెట్ సౌకర్యం ఉందా? ల్యాప్‌టాప్/కంప్యూటర్ ఉన్నాయా? టెలిఫోన్/మొబైల్‌ఫోన్, స్మార్ట్‌ఫోన్ ఉన్నాయా?, సైకిల్/స్కూటర్/మోటార్‌సైకిల్/మోపెడ్, కారు/జీపు/వ్యాను, సదరు ఇంటి సభ్యులు ఆహార నిమిత్తం ఉపయోగిస్తున్న ధాన్యం రకం? మొబైల్ నంబర్ (సెన్సస్ అవసరాల నిమిత్తం మాత్రమే).

epaper.sakshi.com

సాక్షి
బుధవారం, ఫిబ్రవరి, 12

# ఆప్ హ్యాట్రిక్!

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో వరసగా మూడోసారి ఘన విజయం సాధించి ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) 'హ్యాట్రిక్' కొట్టింది. మంగళవారం వెలువడిన ఫలితాల్లో ఆప్‌కు 62 స్థానాలు రాగా, బీజేపీ 8 స్థానాలకు పరిమితమైంది. ఈ ఫలితాలపై సామాజిక మాధ్యమాల్లో వచ్చిన ఒక కార్టూన్ వర్తమాన స్థితికి అద్దం పడుతుంది. చెల్లాచెదురుగా వున్న బుల్లెట్లను చీపురు ఊడ్చేయడాన్ని ఆ కార్టూన్‌లో చూపారు. చీపురు గుర్తు ఆప్ దని చెప్పనవసరం లేదు. కానీ ఆ కార్టూనిస్టు బుల్లెట్లను దేనికి ప్రతీకగా వాడాడో అక్కడ జరిగిన ప్రచార పర్వం తీరుతెన్నుల్ని గమనించినవారికి సులభంగానే బోధపడుతుంది. ఎన్నికలన్నాక గెలుపోటములు తప్పవు. అధికారంలో వున్నవారైతే మంచి పనులతో జనాన్ని మెప్పించడానికి ప్రయత్నించాలి. అధికారంలోకి రావాలనుకున్నవారు తాము వస్తే ఏమేం చేస్తామో చెప్పాలి. కానీ ఈసారి ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ నేతల ప్రచారం హద్దు మీరింది. ఈ విషయంలో ఆప్ నుంచి కొత్తగా వచ్చి చేరిన కపిల్ మిశ్రా గురించి చెప్పుకోవాలి. బీజేపీలో ఆదినుంచీ వుంటున్న నేతల్ని మించి ఆయన రెచ్చిపోయారు. ఈ ఎన్నికల్లో పోటీ భారత్, పాకిస్తాన్‌ల మధ్యేనంటూ శ్రుతి మించారు. ఇప్పటికే షహీన్‌బాగ్‌లోకి పాకిస్తాన్ ప్రవేశించిందని, మరికొన్ని చోట్ల అది వేళ్లూనుకోవడానికి ప్రయత్నిస్తోందని భయపెట్టే యత్నం చేశారు. కొందరు నేతలు కేజ్రీవాల్‌ను ఉగ్రవాది అన్నారు. దేశద్రోహుల్ని కాల్చిచంపాలంటూ కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ సభికులతో నినాదాలు చేయించారు. తుది దశలో బీజేపీ విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టో స్థానిక అంశాలతో నిండి వుండొచ్చుగానీ, ఆ పార్టీ ప్రచారం మొత్తం జాతీయ భద్రత చుట్టూ, షహీన్‌బాగ్ చుట్టూ తిరిగింది. మీరెటువైపో తేల్చుకోవాలని ఢిల్లీ ప్రజలకు పిలుపునిచ్చింది. జాతీయ భద్రత గురించి పౌరులను చైతన్యవంతం చేయాలనుకోవడాన్ని తప్పుబట్టలేంగానీ, తెల్లారితే కాలుష్యం మొదలుకొని అనేక స్థానిక సమస్యలతో సతమతమవుతున్న ఢిల్లీ పౌరులకు కేవలం జాతీయ భద్రత పాఠాలు చెబితే చాలనుకోవడం, ప్రత్యర్థులందరినీ జాతి వ్యతిరేకులుగా చిత్రిస్తే సరిపోతుందనుకోవడం బీజేపీ చేసిన తప్పిదం. అయిదేళ్ల పాలనలో తొలి మూడున్నరేళ్లు తమను బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేసిందని, సుప్రీంకోర్టు ఎవరి విధులేమిటో తేటతెల్లం చేసేవరకూ మెరుగైన పాలన అందించకుండా అడ్డు తగిలిందని కేజ్రీవాల్ ఆరోపించినా బీజేపీ సమర్థవంతంగా తిప్పికొట్టలేకపోయింది. తాము ఢిల్లీకి ఏంచేశామో చెప్పడంలోగానీ, తొలి మూడున్నరేళ్లకూ సంబంధించి తమ వాదనేమిటో వివరించడంలోగానీ ఆ పార్టీ విఫలమైంది.

గత ఎన్నికలతో పోలిస్తే రాజకీయ నాయకుడిగా కేజ్రీవాల్ ఎంతో పరిణతి సాధించారు. ఎన్నికల సమయంలో బీజేపీ అనుసరిస్తున్న నమూనాను నిశితంగా పరిశీలించి, దాంతో సాధ్యమైనంతవరకూ ఘర్షణ వైఖరికి దిగకుండా సంయమనం పాటించారు. తనను ఉగ్రవాది అన్నా, దేశద్రోహులతో సమానం చేసినా ఆయన మాట తూలలేదు. పైగా రాముడిపైనా, హనుమంతుడిపైనా బీజేపీకే పేటెంట్ ఉంటుందన్న అభిప్రాయాన్ని పటాపంచలు చేశారు. గతంలోవలె ప్రధాని నరేంద్ర మోదీపై విమర్శనాస్త్రాలు సంధించే పనికి పూనుకోలేదు. షహీన్‌బాగ్ ఆందోళనపై మీ అభిప్రాయమేమిటో చెప్పాలని బీజేపీ సవాలు విసిరినా కేజ్రీవాల్ జవాబివ్వలేదు. అక్కడ సాగుతున్న ఉద్యమానికి మీ నిర్వాకమే కారణమని ఆరోపించారు. వారితో చర్చించి, ఒప్పించి దాన్ని విరమింపజేసే బాధ్యత మీదేనని, అందులో ఎందుకు విఫలమయ్యారో చెప్పాలని నిలదీశారు. ఆ అంశాలకు బదులు తాము మెరుగైన పనితీరు కనబర్చిన ఉన్న విద్య, వైద్య రంగాలకు ప్రచారంలో ప్రాధాన్యమిచ్చారు. 20,000 లీటర్ల వరకూ ఉచితంగా నీరు అందజేయడం, మహిళలకు ఉచితంగా బస్సులో ప్రయాణించడానికి వీలు కల్పించడం, 200 యూనిట్ల వరకూ ఉచిత కరెంటు, కాలనీల్లో సీసీ టీవీ కెమెరాల ఏర్పాటు తదితరాలను తన విజయాలుగా ఆప్ బాగా ప్రచారం చేయగలిగింది. ఈ ఎన్నికల్లో బీజేపీ ఓటమికి మరో కారణం శాంతిభద్రతలు గాలికి కొట్టుకుపోయాయన్న అభిప్రాయం అందరిలో కలగడం. దేశ రాజధాని నగరంలో పట్టపగలు వేలాదిమంది మహిళలు గుమిగూడినచోట ఒక దుండగుడు పోలీసుల సమక్షంలోనే నాటు తుపాకి పేల్చడం, ఒకరిని గాయపర్చడం అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. అటువంటి ఘటనలే మరో రెండు చోటుచేసుకోవడం మరింత ఆశ్చర్యపరిచింది. ప్రతిష్టాత్మకమైన జేఎన్‌యూలో పదుల సంఖ్యలో ముసుగులు ధరించిన గూండాలు మూడుగంటలపాటు చెలరేగినా, ఆడపిల్లల హాస్టల్‌పై దాడిచేసి కొందరి తలలు పగలగొట్టినా దోషులను పట్టుకోవడంలో ఢిల్లీ పోలీసులు విఫలం కావడం అక్కడి ప్రజలు జీర్ణించుకోలేకపోయారు. కనుకనే బీజేపీకి బాగా పట్టువుండే సంపన్నుల కాలనీల్లో సైతం ఆ పార్టీకి ఓట్ల శాతం తగ్గింది. బహుశా స్థానిక ఓటరు నాడి పట్టగలిగిన మదన్‌లాల్ ఖురానా వంటి నేతలు ఉండివుంటే ఢిల్లీ బీజేపీ ఇంత అధ్వాన్నమైన ప్రచారం నడిపేది కాదు.

ఢిల్లీలో విజయం కోసం బీజేపీ 22 ఏళ్లుగా నిరీక్షిస్తోంది. ఈసారి అది దక్కుతుందని దృఢంగా విశ్వసించడానికి తొమ్మిదినెలలక్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికలు కారణం. ఆ ఎన్నికల్లో బీజేపీకి 56.58 శాతం ఓట్లు లభించాయి. దాని ప్రకారం 65 అసెంబ్లీ సెగ్మెంట్లలో ఆ పార్టీదే ఆధిక్యత. దీనిలో ఎంతచెడ్డా 40 అయినా రాకపోతాయా అని బీజేపీ ఆశించింది. ఓట్ల లెక్కింపు తొలి దశలో ఆ ఆశ నెరవేరవచ్చునన్న అభిప్రాయం కూడా కలిగింది. అటు తర్వాత అంతా తిరగబడింది. పవర్ బ్రోకర్లతో నిండిన కాంగ్రెస్‌ను ఓటర్లు మరోసారి పరాభవించారు. 2013 వరకూ మూడు దఫాలు వరసగా పాలించిన ఆ పార్టీకి అంతకంతకు ఓట్ల శాతం పడిపోతోంది. ఈసారి 67 చోట్ల ఆ పార్టీ డిపాజిట్లు కోల్పోవడమంటే మాటలు కాదు. మొత్తానికి దేశ రాజధాని నగరంలో విజేతలెవరో, పరాజితులెవరో తేలిపోయింది. కానీ ఈ ఎన్నికలు మోసుకొచ్చిన విద్వేషభావనలు చల్లారడానికి, సాధారణ పరిస్థితులు నెలకొనడానికి చాన్నాళ్లు పడుతుంది.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, తిథి బ.తదియ ఉ.7.13 వరకు, తదుపరి చవితి తె.4.50 వరకు (తెల్లవారితే గురువారం), నక్షత్రం ఉత్తర సా.4.24 వరకు, తదుపరి హస్త, వర్జ్యం రా.12.13 నుంచి 1.44 వరకు, దుర్ముహూర్తం ప.11.50 నుంచి 12.37 వరకు అమృతఘడియలు... ఉ.9.43 నుంచి 11.10 వరకు.

**సూర్యోదయం :** 6.32
**సూర్యాస్తమయం:** 5.57
**రాహుకాలం :** ప. 12.00 నుంచి 1.30 వరకు
**యమగండం :** ఉ.7.30 నుంచి 9.00 వరకు

# అభివృద్ధికే ఢిల్లీ ఓటరు పట్టం

విశ్లేషణ



దానీ

**మతభావోద్వేగాలను రెచ్చగొడుతూ బీజేపీ అధినాయకత్వం ఎన్నికల్లో సాగించిన ప్రచారాన్ని ఢిల్లీ ఓటర్లు తిప్పికొట్టారు. మోదీ, అమిత్ షాలతో సహా బీజేపీ ప్రచారంలో ఆర్థిక సంక్షోభం నివారణ, ఉపాధికల్పన, విద్యా, వైద్యం వగైరాల ఊసేలేదు. మరోవైపు అందివచ్చిన విజయాన్ని స్వీయ తప్పిదాలతో చేజార్చుకోకుండా కేజ్రీవాల్ అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. అభివృద్ధి మంత్రాన్నే ఎంచుకున్నారు. మోదీ, అమిత్ షాలు తనను ఎంత రెచ్చగొట్టినా స్పందించలేదు. సీఏఏను వ్యతిరేకిస్తున్నప్పటికీ షహీన్ బాగ్ శిబిరానికి వెళ్ళలేదు. ఉచిత నీరు, ఉచిత విద్యుత్తు, ఉచిత వైద్యం పథకాలు, విద్యా రంగంలో సంస్కరణలు కేజ్రీవాల్‌కు 'అనుకూల వాతావరణం' కల్పించాయి. బీజేపీ చీలిక విధానాలను పక్కకు తోసి అభివృద్ధిని దేశ రాజకీయ ఎజెండాగా మార్చడానికి ఢిల్లీ ఎన్నికలు నాంది పలికాయి. అందుకు దోహదపడిన ఆప్ అధినేత కేజ్రీవాల్‌కు అభినందనలు.**

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు లౌకిక రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమకారులకు, గొప్ప ఊరట నిచ్చాయి. దేశాన్ని మతోన్మాద కారు మేఘాలు కమ్ముకుంటున్న ఒక చారిత్రక దశలో ఒక తొలకరి జల్లులా వచ్చిన ఫలితాలివి. మతోన్మాదంపై అభివృద్ధి మంత్రం సాధించిన విజయం ఇది. 1992 డిసెంబరులో బాబ్రీ మసీదు కూల్చివేత తరువాత చెలరేగిన మత భావోద్వేగాలు సానుకూలంగా మారడంతో 1993 నాటి ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అధికారాన్ని చేపట్టింది. ఎన్నికల నినాదాలు రూపొందించడంలో గొప్ప నైపుణ్యం వున్న కమలనాథులు ''ఇప్పుడు మినీ భారత్ (ఢిల్లీ) గెలిచాం, రేపు బిగ్ – భారత్ గెలుస్తాం'' అంటూ అప్పట్లో దేశవ్యాప్తంగా ప్రచారం చేసేవారు.

2014 లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ మిత్రపక్షాలు బిగ్–భారత్‌ను గెలిచాయి కానీ మినీ భారత్‌కు 2015లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అరవింద్ కేజ్రీవాల్ నాయకత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధికారాన్ని చేపట్టింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో భారీ మెజారిటీతో అధికారాన్ని నిలబెట్టుకున్నప్పటికీ వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ వరుస పరాజయాలను ఎదుర్కొంటోంది. కేంద్రంలోని అధికార పక్షం ఈసారి మినీ భారత్ అసెంబ్లీ ఎన్నికల్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ''దేశ్ బద్లా– అబ్ ఢిల్లీ బద్లో'' (దేశం మారింది; ఇప్పుడు ఢిల్లీ నువ్వు మారు)! అనే నినాదంతో రంగంలో దిగింది. అయితే ఈ నినాదంలో ఒక తిరకాసు వుంది. లోక్‌సభ ఎన్నికల్లో మారిన దేశంలో ఢిల్లీ లేదా? అనే సందేహం వస్తుంది. నిజానికి దేశంలోని పది రాష్ట్రాల్లో, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రస్తుతం బీజేపీయేతర ప్రభుత్వాలున్నాయి. దేశమంతా మారలేదనడానికి ఇంతకన్నా సాక్ష్యం కావాలా?

బీజేపీ ప్రచారం మొత్తం చీలిక విధానాలు, మతోన్మాద రాజకీయాలతోనే సాగింది. ఈ ఎన్నికల్ని 'షహీన్ బాగ్‌పై భారత్ యుద్ధం'గా ఒకరు చిత్రిస్తే 'పాకిస్తాన్‌తో భారత్ యుద్ధం'గా మరొకరు చిత్రించారు. బీజేపీ ఢిల్లీ రాష్ట్ర శాఖకు మనోజ్ తివారి అధ్యక్షులుగా ఉన్నారు. అలాగే బీజేపీకి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జేపీ నడ్డా ఉన్నారు. అయినప్పటికీ ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ జాతీయ అధ్యక్షులు అమిత్ షా, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీలే స్వయంగా పార్టీ ప్రచారాన్ని, వ్యూహాలు ఎత్తుగడల్ని దగ్గరుండి నడిపించారు. మతభావోద్వేగాలు, లౌకిక విలువల మధ్య ఎటూ తేల్చుకోలేని సందిగ్ధ స్థితిలో కాంగ్రెస్ వుంది. కాంగ్రెస్ అస్త్ర సన్యాసం చేసి యుద్ధరంగాన్ని వదిలివేయడంవల్ల ఆప్‌కు లాభించిన మాట నిజమేగానీ బీజేపీ ఓటమికి కాంగ్రెస్ తోడ్పడిన మాట అంతకన్నా వాస్తవం. ఇప్పటి పరిస్థితిలో కాంగ్రెస్ చురుగ్గా పనిచేసి వుంటే అది బీజేపీకి లాభించివుండేది. బీజేపీ ప్రచారంలో ఆర్థిక సంక్షోభం నివారణ, ఉపాధికల్పన, విద్యా, వైద్యం వగైరాల ఊసేలేదు. మోదీ పాల్గొన్న సభలు సహితం ఆ బాటలోనే నడిచాయి. అభివృద్ధి గురించి ఒక్క మాటైనా ప్రస్తావించలేదు.

షహీన్ బాగ్ ఉత్తేజంతో దేశంలో ఇప్పుడు దాదాపు 150 సీఏఏ, ఎన్‌పీఆర్, ఎన్‌ఆర్‌సీ వ్యతిరేక శిబిరాలు నడుస్తున్నాయి. ఒక చేతితో మువ్వన్నెల జాతీయ జెండాను, ఇంకో చేతితో రాజ్యాంగాన్ని పట్టుకుని, ఒళ్ళో మహాత్మా గాంధీజీ, బాబాసాహెబ్ అంబేడ్కర్‌ల ఫొటోలు



పెట్టుకుని, రాజ్యాంగ ప్రవేశికలోని ''న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం'' ఆదర్శాలను నినదిస్తూ సాగుతున్న మహత్తర లౌకిక రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమం ఇది. భావోద్వేగాలను రెచ్చగొట్టి మినీ భారత్ ఎన్నికల్లో వ్యూహాత్మకంగా లబ్ధి పొందడానికే బీజేపీ ముహూర్తం చూసి సరిగ్గా డిసెంబరులోనే పౌరసత్వ సవరణ చట్టాన్ని తెచ్చింది. కేవలం ముస్లింలు మాత్రమే సీఏఏను వ్యతిరేకిస్తున్నారనే సంకేతాలు ఇచ్చి హిందూ ఓటు బ్యాంకును సమీకరించాలని స్వయంగా ప్రధాన మంత్రి కూడా ప్రయత్నించారు. అయితే, అప్పటికే ఆలస్యం అయిపోయింది. సిక్కులు మొదటి నుండీ షహీన్ బాగ్ నిరసనకారులకు అండగా వున్నారు. ఆ పిదప క్రైస్తవులేగాక, హిందూ సమాజానికి చెందిన అనేక సమూహాలు ఆ శిబిరానికి చేరుకున్నాయి. రోజూ షహీన్ బాగ్ శిబిరంలో సర్వమత ప్రార్థనలు జరుగుతున్నాయి. ఈ మతసామరస్య పరిణామాల్ని మోదీజీ–అమిత్ జీ ద్వయం ఊహించలేదు. అది వారికి జీర్ణం కావడంలేదు.

మతోన్మాదాన్ని రెచ్చగొట్టే పనిని ముందుగా బీజేపీ ఎంపీ ప్రవేశ్ వర్మ మొదలెట్టారు. ''షహీన్ బాగ్ నిరసనకారులు మీ ఇళ్ళలోనికి దూరి మీ మహిళల్ని చెరుస్తారు, మీ సోదరుల్ని హత్యలు చేస్తారు'' అని జనాన్ని రెచ్చగొట్టారు. ప్రవేశ్ వర్మ మీద ఎన్నికల కమిషన్ నాలుగు రోజుల నిషేధాన్ని విధించింది. నిషేధం నుండి తిరిగి వచ్చిన వర్మ మరీ రెచ్చిపోయారు. ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను ఏకంగా టెర్రరిస్టు అన్నారు. మళ్ళీ ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకుంది. ఒక్క వారంలో రెండుసార్లు ఎన్నికల కమిషన్ నిషేధించడంతో పార్టీలో వర్మ స్థాయి పెరిగిపోయింది. రాష్ట్రపతి ఉపన్యాసానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై లోక్‌సభలో చర్చను ప్రవేశపెట్టే కీలక బాధ్యతను ప్రవేశ్ వర్మకు అప్పగించారు. ప్రజల్ని ఎంతగా రెచ్చగొడితే పార్టీలో అంత పెద్ద పీట వేస్తాం అని సంకేతాలిచ్చారు మోదీజీ–అమిత్ జీ.

ప్రవేశ్ వర్మ ప్రేరణతో ఆర్థికశాఖ సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్ ఇంకా రెచ్చిపోయారు. ''దేశ్ కే గద్దారో కో; గోలీ మారో సాలో కో'' (సాలేగాళ్ళు దేశద్రోహులు; కాల్చిచంపండి వాళ్ళని) అని రెచ్చగొట్టారు. గాంధీజీని హత్య చేసిన రోజైన జనవరి 30న జామియా మిలియా శిబిరం వద్ద ఒక ఆగంతకుడు నిరసనకారుల మీద కాల్పులు జరిపాడు. ఆ తరువాత మరో మూడు రోజుల్లో షహీన్ బాగ్ దగ్గర రెండుసార్లు ఆగంతకులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల వీరుళ్ళు ముగ్గురూ 'దేశ్ కే గద్దారో కో; గోలీ మారో సాలో కో' నినాదాలే ఇవ్వడం విశేషం. ప్రచారంలో పాల్గొన్న ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ తన సహజశైలిలో బుల్లెట్ల భాష మాట్లాడారు. షహీన్ బాగ్ నిరసనకారులు ''మాటల భాషతో వినకపోతే తూటాల భాష దారికి తెస్తుంది'' అన్నారాయన. కేంద్రమంత్రులు ప్రకాశ్ జవదేకర్ తదితరులు తమ వంతు ఆజ్యం పోశారు. ప్రచారసారథి అమిత్ షా చెలరేగిపోయారు. ''మీరంతా ఈవీఎం బటన్‌ను ఎంత గట్టిగా నొక్కాలంటే ఆ షాక్ షహీన్ బాగ్‌కు కొట్టాలి'' అని పిలుపిచ్చారాయన. ''11వ తారీఖున ఎన్నికల్లో మనం గెలిచిన వార్త రాగానే సాయంత్రం ఆరు గంటల లోగా విద్యార్థి నాయకులు షర్జీల్ ఇమామ్, కన్హయ్య కుమార్‌ల మీద చార్జిషీట్ తయారయిపోతుంది. ఢిల్లీలో ప్రభుత్వం ఏర్పడిన గంటలోపులోనే వాళ్ళు జైల్లో వుంటారు'' అన్నారాయన. ఇంతటి ద్వేషపూరిత ప్రచారం గతంలో ఎన్నడూ చూడలేదు.

మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో ఘన విజయం చేజిక్కగానే బీజేపీ అధ్యక్షునిగా అమిత్ షా చేసిన మొదటి ప్రకటన ''ఒక్క పార్టీ కూడా తమ ప్రణాళికల్లో లౌకికవాదం ఊసే ఎత్తలేదు'' అని. లౌకికవాదాన్ని భారత ప్రజలు తిరస్కరించారు అని చెప్పడం వారి అభిమతం. అలాగే, ఢిల్లీ ఎన్నికల్లో గెలవగానే ప్రజలు అభివృద్ధిని కోరుకోవడం లేదు; వాళ్ళకు మత భావోద్వేగాలే ముఖ్యం అని ప్రకటించి వుండేవారు. అదృష్టవశాత్తు వారికి ఆ అవకాశం రాలేదు. మరోవైపు, ఈ ఎన్నికల్లో నోటిఫికేషన్ వెలువడిన రోజే ఆప్ గెలుపు ఖాయం అయిపోయింది. అందివచ్చిన విజయాన్ని స్వీయ తప్పిదాలతో చేజార్చుకోకుండా కేజ్రీవాల్ అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. మోదీ, అమిత్ షాలు తనను ఎంత రెచ్చగొట్టినా స్పందించలేదు. సీఏఏను వ్యతిరేకిస్తున్నప్పటికీ షహీన్ బాగ్ శిబిరానికి వెళ్ళలేదు. కేవలం అభివృద్ధి మంత్రాన్నే ఎంచుకున్నారు. సీబీఎస్ఈ పరీక్షల్లో ఢిల్లీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు జాతీయ సగటుకన్నా, ప్రైవేటు విద్యా సంస్థల కన్నా మెరుగైన ఫలితాలను సాధించారు. ఉచిత నీరు, ఉచిత విద్యుత్తు, ఉచిత వైద్యం పథకాలు, విద్యా రంగంలో సంస్కరణలు కేజ్రీవాల్‌కు ''అనుకూల వాతావరణం' కల్పించాయి.

కమలనాథులకు రాజకీయ ప్రాణవాయువుగా పని చేస్తున్న మతోన్మాదాన్ని, చీలిక విధానాలని పక్కకు తోసి అభివృద్ధిని దేశ రాజకీయ ఎజెండాగా మార్చడానికి ఈ ఎన్నికలు నాంది పలికాయని ఆశించవచ్చు. అందుకు దోహదపడిన ఆప్ అధినేత కేజ్రీవాల్‌కు అభినందనలు.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయుడు, రచయిత, సమాజ విశ్లేషకులు । మొబైల్: 90107 57776

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా ప్రత్యేకం



"తీవ్రమైన విభజనవాదం ఓడిపోయింది. ఇది ఆమ్ ఆద్మీ పార్టీకి సమస్యేకాదని వామపక్షవాదులు భావించడం తప్పు. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నిరసనలు పెల్లుబుకుతున్న షహీన్ బాగ్ విషయంలో వేరే నిర్ణయం తీసుకోవడం, నిరసనలను ముగింపజేసి, రోడ్లను తెరుచుకోవడానికి తోడ్పడాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కోరడం, దేవాలయాల్లో పూజలు చేయడం, 370 అధికరణం రద్దుకు మద్దతు ఇవ్వడం, మోదీని ఒక సమస్యగా చిత్రించకపోవడం వంటి అంశాలతో ఆప్ ఒక ప్రత్యేకమైన వ్యూహం అవలంబించింది"

– బర్ఖాదత్, జర్నలిస్ట్

### సెల్యూట్



"ఆప్ గెలిచింది. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఢిల్లీ ప్రజలు విభజన, చీలికలతో కూడిన ప్రమాదకరమైన బీజేపీ ఎజెండాను ఓడించారు. 2021, 2022ల్లో ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాలకు దిశానిర్దేశం చేసేలా నిలిచిన ఢిల్లీ ప్రజలకు సెల్యూట్ చేస్తున్నా"

– పి. చిదంబరం, కాంగ్రెస్ నేత

### పిల్లలు



"ఒక్క విషయంలో నేను ఇవాళ చాలా, చాలా సంతోషంగా ఉన్నా. అందుకు కారణం భారత రాజ్యాంగం ఇచ్చిన స్ఫూర్తి మేరకు ఢిల్లీలోని స్కూలు పిల్లలు తమ చదువును కొనసాగించగలుగుతారు. తమ నిత్య జీవితంలో ఆ విలువలను ఎలా పాటించాలో నేర్చుకుంటారు"

– మేఘనాథ్, కాలమిస్ట్

### నమ్మకం



"నాయకుడి వ్యక్తిగత నమ్మకాలు లౌకికవాదులకు ఎప్పుడూ సమస్య కాదు. గాంధీ రాముడిని, కేజ్రీవాల్ హనుమంతుడిని ప్రార్థించడం వారి లౌకికత్వాన్ని ఏ మాత్రం తగ్గించదు. ఇతర మతస్తులను వ్యతిరేకించినప్పుడు, ఖండించినప్పుడే సమస్య"

– షాహిద్ సిద్దిఖీ, జర్నలిస్ట్

### డిపాజిట్



"దేశ రాజధాని ఢిల్లీలో పోటీ చేసిన 70 స్థానాల్లో 67 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ డిపాజిట్లు కోల్పోవడం నిజంగా షాక్"

– ప్రశాంత్ కుమార్, జర్నలిస్ట్

### మరో రంగు



"అరవింద్ కేజ్రీవాల్ కుటుంబ పెద్దగా కనిపిస్తారు. హనుమాన్‌ను ప్రార్థిస్తారు. భక్తికీ, నిబద్ధతకీ చిహ్నంగా నిలుస్తారు. తన ప్రసంగాల్లో భారతమాతను కొనియాడతారు. ఆయన కాషాయానికి మరో రంగు మాత్రమే. కానీ దాంతో తమకు సమస్య లేదని చాలామంది భావించారు"

– వసుధ వేణుగోపాల్, జర్నలిస్ట్

### సాధ్యం



"వారితో నాకెటువంటి సమస్యా లేదు. ఆయన హనుమంతుడిని ప్రార్థించవచ్చు, భారతమాతను కీర్తించవచ్చు.. అయితే, ఇతర మతస్తులను ద్వేషించనక్కర్లేదు. అది సాధ్యమేనని కేజ్రీవాల్ చూపించారు"

– సీమా గోస్వామి, జర్నలిస్ట్

ఇన్‌బాక్స్

## విద్యాసెస్ వసూళ్ల దారెటు?

పాఠశాల విద్యాభివృద్ధి కోసం 2004 నుండి 2% చొప్పున, ఉన్నత విద్యాభివృద్ధి కోసం 2008 నుండి 1% చొప్పున విద్యాసెస్ వసూలు చేస్తున్న విషయం తెలిసిందే. కార్పొరేట్ ట్యాక్స్, ఇన్‌కమ్ ట్యాక్స్, సర్వీస్ ట్యాక్స్‌తోపాటు కస్టమ్స్ పైన మొత్తం 3% చొప్పున వసూలు చేస్తున్న ఆ సొమ్మును దేనికి ఎంత ఖర్చు చేస్తున్నారో తెలియడం లేదు. మరోవైపు కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగం వాటా ఆ యేటికాయేడు తగ్గిపోతూ వస్తోంది. ఇది 2014–15 లో 6.15% నుండి 2020–21 సం.కి 3.26 శాతానికి పడిపోయింది.

బడ్జెట్ పత్రాల్లోని వివరాలను పరిశీలిస్తే 2018–19లో రూ.43,422 కోట్లు వసూలు కాగా, 2019–20లో సవరించిన అంచనాల మేరకు రూ. 44,523 కోట్లు అంటే మొత్తం రూ. 87,945 కోట్లు విద్యాసెస్సు పేరిట వసూలైనట్లు తెలుస్తోంది. ఈ మొత్తం 2019–20 బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించిన (రూ. 94,853 కోట్లు) మొత్తానికి దాదాపు సమానంగా వుంది. విద్యాసెస్సుతో వసూలు చేసిన మేరకే కేటాయిస్తుంటే మరి బడ్జెట్‌లో విద్యారంగానికి అదనంగా ఏమి యిస్తున్నట్లు? ఇక 2020–21 బడ్జెట్‌లో విద్యాసెస్ ద్వారా రూ. 50,230 కోట్లు వసూలు చేయనున్నట్లు అంచనా వేశారు. విద్యారంగానికి ప్రతిపాదించింది రూ. 99,312 కోట్లు. అంటే సగానికి పైగా సెస్ ద్వారానే రాబడతారు. అది పోగా బడ్జెట్‌లో విద్యారంగానికి యిచ్చేది రూ. 49 వేల కోట్లు మాత్రమే. ఇది మొత్తం బడ్జెట్‌లో 1.63 శాతమే వుంటుంది. ఇలా సగం చాలని బడ్జెట్ యివ్వడం వలనే మన విద్యారంగం వెనుకబడిపోతోంది. విద్యాసెస్ ద్వారా వసూలు చేస్తున్న మొత్తాన్ని ఖర్చు చేసినా ఈపాటికి విద్యాహక్కు చట్టం అమలు జరిగి వుండేది. మరి కేంద్రప్రభుత్వం ఆ సొమ్మును ఏమి చేస్తున్నదో వివరాలతో సహా బహిరంగంగా ప్రకటించాలని 'సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ స్టడీస్ (సీఈఎస్)' ద్వారా కేంద్ర ఆర్థికమంత్రికి విజ్ఞప్తి చేస్తున్నాము.

నాగటి నారాయణ, చైర్మన్, సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ స్టడీస్ హైదరాబాద్ । 94903 00577

# మూడు రాజధానులు ముమ్మాటికీ అవసరమే

సందర్భం



ఆచార్య కాడా రామకృష్ణారెడ్డి

కేంద్రీకృత రాజధాని సిద్ధాంతం నుండి వికేంద్రీకరణతో కూడిన మూడు రాజధానుల ఏర్పాటు నిర్ణయం అభివృద్ధి వైపు, మార్పుదిశగా ప్రస్తుత ప్రభుత్వం తొలి అడుగని భావించవచ్చు. కానీ ఈ మార్పు మంచిది కాదని, అవసరం లేదని, ప్రతిబంధకమని ప్రతిపక్ష రాజకీయ నాయకుల వాదన. ఈ మార్పు ఆర్థిక, రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక, సామాజిక ప్రాంతీయ అవసరాలకు అనుగుణంగా ఉపయుక్తంగా ఉంటుందన్నది ప్రభుత్వ వాదనగా కనిపిస్తోంది. మూడు రాజధానుల ఏర్పాటు పాలనా వికేంద్రీకరణ ప్రక్రియ ఆధారంగా అన్ని ప్రాంతాలకు సమన్యాయం, అభివృద్ధి పరంగా ముందుకు వెళ్ళేందుకు ఉపకరిస్తాయని మేధావి వర్గం అభిప్రాయంగా చెప్పవచ్చును. ముఖ్యంగా వికేంద్రీకరణ వల్ల పర్యావరణ పరిరక్షణ అంశాన్ని కాపాడుకోవచ్చన్నది శాస్త్రవేత్తల అభిప్రాయం. ప్రస్తుతం మన రాష్ట్రంలో భౌగోళిక పరంగా, సహజంగానే మూడు ప్రాంతాలుగా కనిపిస్తున్న కళింగాంధ్ర, కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాలలో విభిన్న సాంఘిక, సాంస్కృతిక, ప్రత్యేకతలు కలిగి ఉన్నాయి. దీని దృష్ట్యా, వికేంద్రీకరణ పాలన అనుకూలమైన నిర్ణయంగా భావించాలి.

కళింగాంధ్ర వెనుకబాటుతనం నిర్మూలన, కోస్తాంధ్ర ప్రాంతంలో వరద నివారణ, వ్యవసాయాభివృద్ధి, మత్స్య పరిశ్రమాభివృద్ధి, రాయలసీమ ప్రాంతంలో కరువు నివారణకై సాగునీటి సమగ్రాభివృద్ధి ముఖ్యాంశాలుగా గుర్తించి పరిపాలన పరంగా అభివృద్ధి చేస్తే వేగవంతమైన అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుంది. అంతేకాకుండా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్‌లో జరిగిన కేంద్రీకృత అభివృద్ధి వల్ల మిగిలిన ప్రాంతాల్లో వెనుకబాటుతనం వల్ల జరిగిన నష్టాల నుంచి గుణపాఠం నేర్చుకోవాల్సి ఉంది. కొన్ని దశాబ్దాలుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని పట్టణాలు, మరియు కొన్ని జిల్లాలు మాత్రమే ఆర్థికాభివృద్ధి మిగతా ప్రాంతాలకంటే ఎక్కువ ఆర్థికాభివృద్ధి సాధించాయి.

ప్రస్తుత ప్రభుత్వం మూడు రాజధానుల ఏర్పాటు నిర్ణయం అధికార వికేంద్రీకరణ దిశగా ఉంటుంది. అధికార వికేంద్రీకరణ ద్వారా అభివృద్ధి వికేంద్రీకరణ, తద్వారా సమతుల్య అభివృద్ధి జరుగుతుందని మేధావుల అభిప్రాయం. అమరావతి ఒక్కచోటే అభివృద్ధి జరగడం వలన అధికార కేంద్రీకరణ, అభివృద్ధి కేంద్రీకరణ తద్వారా ఒక ప్రాంతానికి కొంతమందికే ప్రయోజనంగా ఉంటుందని చెప్పక తప్పదు. తక్కువ ప్రయత్నం వలన ఎక్కువ ప్రయోజనం పొందటం ఆర్థికశాస్త్రం యొక్క ఒక ముఖ్య సిద్ధాంతం. అంతేకాకుండా స్వల్ప కాలంలోనే ఆర్థికాభివృద్ధి సాధించాల్సిన అవసరముందని, దీర్ఘకాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి ప్రణాళికల రచన అంత ప్రయోజనం కాదని కీన్స్ అనే ఆర్థిక శాస్త్రవేత్త చెప్పారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రస్తుత ప్రభుత్వం మూడు రాజధానుల ఏర్పాటు, అధికార వికేంద్రీకరణ ద్వారా అందరికీ అభివృద్ధి ఫలాలు అందేలా ముందుకు వెళ్ళాలని ప్రయత్నం చేస్తోంది. అమరావతి అభివృద్ధి సాధించడానికి కనీసం 40 లేదా యాభైఏళ్లు పడుతుందని మేధావుల అంచనా. ఆ కాల వ్యవధిలో రాజకీయం, ఆర్థిక, సాంకేతిక మార్పులు విపరీతంగా జరిగే అవకాశం ఉంది. ఆర్థిక శాస్త్రం యొక్క ఛాయిస్ ఆఫ్ సైన్స్ అనే సిద్ధాంతానికి కేంద్రబిందువుగా ఉన్న అభిప్రాయానికి ప్రతిరూపంగా ప్రస్తుత ప్రభుత్వం స్వల్ప కాలంలో అధిక ప్రయోజనం కలిగించే విధానాలను ఎంచుకొని, మూడు రాజధానుల సిద్ధాంతం అధిక ప్రజల అభివృద్ధికి దోహదం చేస్తుందని గట్టి నమ్మకం. మూడు రాజధానుల వలన అన్ని ప్రాంతాలను అభివృద్ధిలో భాగస్వామ్యం చేయవచ్చు. రాజధాని వికేంద్రీకరణ వలన అన్ని వర్గాల ప్రజలకు ప్రాతినిధ్యం లభిస్తుంది. వాణిజ్యాభివృద్ధిలో వేగం పెరుగుతుంది. ఆర్థిక శాస్త్రం ప్రకారం కొనుగోలు శక్తి పెరగాలంటే ఆర్థికాభివృద్ధి పెరగాలి. అభివృద్ధి వికేంద్రీకరణ జరిగితేనే ఆర్థికాభివృద్ధి జరుగుతుంది. అన్నిప్రాంతాల ఆర్థికాభివృద్ధి వలన అన్ని వర్గాల ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది. దాని వలన వాణిజ్యం పెరిగి, రాష్ట్ర ఆదాయం పెరుగుతుంది. కొత్తగా ఏర్పడిన రాష్ట్రానికి సత్వర ఆదాయ వనరుల అభివృద్ధి ఎంతైనా అవసరం. మూడు రాజధాని నగరాలను సాంస్కృతిక పరంగా, చారిత్రక పరంగా, వాణిజ్య పరంగా, ఆర్థిక పరంగా అనుకూలం ఉంటేనే భవిష్యత్తులో అభివృద్ధి సాధిస్తాయి. మూడు రాజధాని నగరాలకు సమాన నిధులిచ్చి, సాంస్కృతిక, సామాజిక అంశాలకు అనుగుణంగా వివిధ ప్రణాళికలను రచించి, వాటిని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వ్యాసకర్త పూర్వ ఉపకులపతి, ఎస్కేయూ, అనంతపురం । 94408 88066

# కౌస్తుభం

లౌకిక ప్రపంచంలో అన్నిటికంటే విలువైన రత్నం ఇప్పటికీ 'మన' (అంటే మన తెలుగుసీమలో దొరికిన) కోహినూర్ రత్నమే. ఇప్పుడది బ్రిటిష్ రాజ కుటుంబం ఆస్తిలో భాగం. రాజ కిరీటంలో ఉన్న 2,800 అమూల్య రత్నాలలో మధ్యమణి. 106 క్యారట్ల ఈ వజ్రం విలువ లెక్కకు అందదు. ఇతర వజ్రాలతో పోల్చి ఏదో ఉజ్జాయింపు చేయాలంటే, 22 గ్రాముల బరువుండే ఈ అంగుళన్నర వజ్రం విలువ కనీసం రూ. 8 వేల కోట్లు ఉంటుందని నిపుణుల అంచనా.

అలౌకికమైన పౌరాణిక ప్రపంచంలో అంతకంటే ఎన్నోరెట్ల విలువైన మరో రత్నం ఉంది. దాని పేరు 'కౌస్తుభం. అది పద్మరాగమణి. తామర కెంపు. దేవతలూ, రాక్షసులూ కలిసి క్షీర సాగర మథనం చేసినప్పుడు సాగరం నుంచి పుట్టిన అమూల్యమైన వస్తువులలో కౌస్తుభం



జ్యోతిర్మయం

నాలుగోది. మొదట కామధేనువు. రెండు ఉచ్చైశ్రవమనే తెల్ల గుర్రం. మూడు ఐరావతం. నాలుగు కౌస్తుభం. అది ఉద్భవించగానే దాన్ని తన వక్షస్థల అలంకారంగా ఉంచుకోవాలని శ్రీహరి ఆసక్తి చూపించాడు. సముద్రుడు ఆయనకే ఆ కౌస్తుభాన్ని కానుక చేశాడు. ఆయన దాన్ని తన వక్షస్థలంమీద అలంకరించుకున్నాడు. ఇక ఆనాటి నుంచి అది శ్రీమన్నారాయణుడి ముఖ్య చిహ్నాలలో ఒకటైపోయింది. 'కస్తూరీ తిలకం లలాట ఫలకే, వక్షఃస్థలే కౌస్తుభం'.

హరిహరులు కలిసిన హరిహరనాథుడనే తత్వాన్ని సేవించిన తిక్కన 'నీకు శివుడిగా ధరించే బొమికెల దండమీద ఎక్కువ మక్కువా, కేశవుడిగా అలంకరించుకునే కౌస్తుభ రత్నం మీదనా?' అని అడిగితే, హరిహరనాథుడు పొంగి పులకించాడట. అస్థి మాల శివుడికీ, కౌస్తుభం కేశవుడికీ అంత అవిభాజ్యమైన లాంఛనాలు. మన ప్రాచీన కవులందరూ కమలనాథుడి కౌస్తుభ మణిని ఉత్ప్రేక్షిస్తూ పద్యాలు రాసినవాళ్లే. కౌస్తుభమణి 'సజ్జనుల మనసులు అనే సరోజాలను వికసింపజేసే ఉదయసూర్యుడు' అని పింగళి సూరన భావించాడు. హరి మెడలో వేలాడే వైజయంతి అనే పూలమాల మధ్యలో మెరిసే కౌస్తుభ మణి, హరి వక్షస్థల నిత్య నివాసిని అయిన లక్ష్మీదేవి వేడుక కోసం అమర్చిన ఉయ్యాలలా ఉందని ముక్కుతిమ్మన ఉత్ప్రేక్ష.

– ఎం. మారుతి శాస్త్రి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
బుధవారం ॥ 12-2-2020

# వాడల్లోకి వచ్చింది



విశాఖపట్నంలోని క్వీన్ మేరీ స్కూల్ విద్యార్థినులతో సంచయిత

# రాజుగారి అమ్మాయి

**విజయనగరం, పూసపాటి రాజవంశం అమ్మాయి సంచయిత. గ్రామగ్రామం తిరుగుతోంది. "ఆడపిల్లల్ని బడికి పంపించండి" అని తల్లుల్ని కోరుతోంది. ఆడపిల్లల బాల్యాన్ని, చదువును నీళ్లు మోయడం కోసం బలి చేయవద్దని వేడుకుంటోంది. "నీళ్లు లేకపోవడం వల్లనే.. కేవలం నీళ్లు మోయడానికే ఆడపిల్లల్ని బడి మాన్పిస్తున్నట్లయితే... ఆ నీళ్లేదో నేనే ఇస్తాను" అంటోంది.. అనడమే కాదు స్కూళ్లలో సోలార్ పలకలు అమర్చి, నీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ వేసవిలో మరికొన్నింటిని చేయబోతోంది. ఇదంతా ఆడపిల్లల్ని చదివించడానికే.**

''బడికి వచ్చి చదువుకోండి. ఇంటికి వెళ్లేటప్పుడు ఈ క్యాన్ నిండా మంచినీటిని మీ ఇంటికి పట్టుకు వెళ్లండి'' అని ఐదు లీటర్ల నీటి క్యాన్‌లను అమ్మాయిల చేతికి ఇస్తున్నారు సంచయిత. రాజు గారమ్మాయి తమ వాడల్లోకి వచ్చి ఇంత ఆపేక్షగా చెబుతుంటే ఏ తల్లిదండ్రులు మాత్రం అమ్మాయిల్ని బడికి పంపించకుండా ఉండగలరు? ఆమె చూపించిన ఆత్మీయతే ఆడపిల్లల్లో అక్షరాస్యత పెంచాలన్న ఆమె పనిని సులువుగా మార్చేస్తోంది.

### ప్యాలెస్‌లో పుట్టినా..!

''నేను ప్యాలెస్‌లో పెరగలేదు, ప్రజల మధ్య పెరిగాను. మా తాత విజయ రామ గజపతి రాజుగారు అభ్యుదయవాది. ఆడపిల్లలు చదువుకోవాలని, ప్రజాజీవితంలో క్రియాశీలకంగా ఉండాలని చెప్పేవారు. నా చదువంతా ఢిల్లీలోనే సాగింది. మా అమ్మ లోక్‌సభ సభ్యురాలిగా (రాణి ఉమాగజపతిరాజు) ఉన్నప్పుడు నేను చాలా చిన్నదాన్ని. ఓ సారి నా స్కూల్‌కి నెల రోజులు సెలవు పెట్టించి మరీ తన తోపాటు గ్రామాలన్నీ తిప్పి చూపించింది. ప్యాలెస్‌కి పరిమితం కాకుండా ప్రజా జీవితంలోకి వచ్చి పని చేయాలని అమ్మ చెప్పేది'' అని చిన్ననాటి రోజుల్ని గుర్తు చేసుకున్నారు సంచయిత.

ఢిల్లీ యూనివర్సిటీ నుంచి పొలిటికల్ సైన్స్ ఆనర్స్, తర్వాత లా కోర్సు చేసి ఢిల్లీ బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ అయ్యారు సంచయిత. లాయర్‌గా ప్రాక్టీస్ చేయడం ఆమెకంటూ ఒక ఉపాధి కోసం మాత్రమే. చుట్టుపక్కల గ్రామాల్లో బాలికల విద్య కోసం పని చేయడం ఆమెకో సంతృప్తి. 'ఆస్తులు వస్తుంటాయి, పోతుంటాయి. మనం చదువుకున్న చదువు మనతోపాటే ఉంటుంది. చదువుతోపాటు వచ్చిన జ్ఞానం మనల్ని నడిపిస్తుంది' అనేవారు అమ్మ. ఆ మాటలనే నేను పని చేస్తున్న విశాఖ జిల్లాలో అమ్మాయిలకు చెప్తున్నాను'' అన్నారు సంచయిత.

### చురుకైన కొత్త తరం

నేను దత్తత తీసుకున్న స్కూళ్లలో అమ్మాయిలతో మాట్లాడుతూ 'పెద్దయిన తర్వాత నువ్వు ఏమవుతావు' అని అడుగుతుంటాను. ఒకమ్మాయి 'సోలార్ ఇంజనీర్ అవుతా' అని చెప్పింది. అది విని నాకు చాలా ముచ్చటేసింది. ఇంజనీరింగ్ అంటే అది అబ్బాయిల కోర్సు అనే అపోహ తొలగిపోయినందుకు రిలీఫ్ కలిగింది. అమ్మతో పాటు పాతిక–ముప్పయ్ ఏళ్ల కిందట చూసిన పరిస్థితులు గ్రామాల్లో ఇప్పుడు లేవు. ఎనిమిదేళ్ల కిందట నేను సన (సోషల్ అవేర్‌నెస్ న్యూయర్ ఆల్టర్‌నేటివ్స్) సంస్థ నిర్వహాకురాలిగా గ్రామాల్లో అడుగుపెట్టినప్పుడు కూడా మహిళల్లో ఈ మాత్రపు చొరవను చూడలేదు.

– సంచయితా గజపతి రాజు



సోలార్ ప్లాంట్ దగ్గర సంచయిత

### విశాఖ అమ్మాయినే

''విజయనగరంలో పుట్టాను. అమ్మమ్మ గారిల్లు మద్రాసు (చెన్నై)తో అనుబంధం పెంచుకున్నాను. అమ్మ సొంతూరు కేరళలోని పాల్ఘాట్. కానీ వాళ్ల కుటుంబం మద్రాసులో సెటిల్ అయింది. అమ్మ చదువు కూడా మద్రాసులోనే, స్టెల్లా మారిస్ స్టూడెంట్ ఆమె. ఢిల్లీలో ఉంటున్నాం. ఇన్ని ప్రాంతాలు, ఇన్ని రాష్ట్రాలతో మమేకమై సాగుతున్న నా జీవితంలో ప్రథమ స్థానం మాత్రం విశాఖదే'' అన్నారు సంచయిత.

### మహిళల సహకారం

''ఇంట్లో ఇల్లాలు సౌకర్యంగా ఉంటే ఆ ఇల్లు సంతోషంగా ఉంటుంది. సామాన్య కుటుంబాల్లో అమ్మాయిల చదువు కోసం ఏం చేయాలి? ఎలా మొదలు పెట్టాలి? అనే ప్రశ్న నాలో మొదలైంది. విశాఖ జిల్లా కలెక్టర్ దగ్గరకు వెళ్లి నా ఆలోచనను చెప్పాను. జిల్లా విద్యాధికారి, మండల అభివృద్ధి అధికారుల ద్వారా స్కూళ్ల వివరాలు, గ్రామాలలో మౌలిక వసతుల లేమి పట్ల స్పష్టత వచ్చింది. మహిళలు సర్పంచ్‌గా ఉన్న గ్రామాలను ఎంపిక చేసుకుని వాళ్లను స్వయంగా కలిశాను. వాళ్ల మాటల్లో కూడా మంచి నీళ్లే మొదటి ప్రాధాన్యంలో ఉన్నాయి. మంచినీటి కోసం నేను ఏర్పాటు చేయాలనుకున్న పనులకు వాళ్ల సహకారం తీసుకున్నాను. వాటర్ ప్లాంట్‌లు, సోలార్ ప్యానల్స్, ఎనర్జీ జనరేషన్ ఎక్విప్‌మెంట్ వంటి వాటిని ఏర్పాటు చేయగలిగాను. ఆ గ్రామాల్లోనే ఉన్న మహిళలకు యంత్రాల నిర్వహణ పనులు నేర్పిస్తే నేర్చుకోగలిగిన వాళ్లకు శిక్షణనిచ్చి సోలార్ ప్లాంట్, వాటర్ ప్లాంట్ నిర్వహణ బాధ్యత అప్పగించాం. 'ఒక పనిని బాధ్యతగా చేయడానికి ఆడ–మగ అనే తేడా ఉండదు. అవకాశం వస్తే ప్రతి ఒక్కరూ చేయగలరు' అని నిరూపించాలనేదే నా ఆశయం. పైగా ఆడవాళ్లయితేనే ప్లాంటును తమ ఇంటిని ఉంచుకున్నంత శుభ్రంగా ఉంచుతారు. అందుకే ఆడవాళ్లనే నియమించమని చెబుతుంటాను'' అని తెలిపారు ఆమె.

ఒక న్యాయవాది దృష్టి సామాజిక స్థితిగతుల మీదకు మళ్లితే సమాజానికి న్యాయం జరుగుతుంది. అదే సామాజిక న్యాయం. స్త్రీ–పురుషుల మధ్య వివక్షను రూపుమాపడానికి ఉద్యమించి విజయం సాధిస్తే అదే సమన్యాయం. సంచయిత శ్రమ... సామాజిక న్యాయం, సమన్యాయ సాధన కోసమే.

– వాకా మంజులారెడ్డి



తల్లి ఉమతో సంచయిత

### ఇప్పటికి ఇరవై గ్రామాలు

**సంచయిత..** 2013లో గూగుల్ గ్లోబల్ ఇంపాక్ట్ చాలెంజ్ అవార్డు అందుకున్నారు. తాగునీరు, పారిశుధ్యం రంగాల్లో విశిష్ట సేవలందించిన సంస్థకు ఇచ్చే అవార్డు ఇది. ఆ అవార్డుతో వచ్చిన మూడు కోట్ల నగదు తన కార్యాచరణకు ఉపయోగపడుతోందని చెప్పారామె. మంచినీరు, పారిశుధ్య నిర్వహణ, రెన్యూవబుల్ ఎనర్జీ, వ్యవసాయ రంగాల మీద ప్రత్యేక దృష్టి పెట్టిన సంచయిత ఇప్పటివరకు ఇరవై గ్రామాలు, మరో ఇరవైకి పైగా స్కూళ్లలో మంచినీరు, పారిశుధ్య వసతులు కల్పించారు. 'సన సూర్య సుజల ధార, హరిత బయో టాయిలెట్స్' కార్యక్రమంలో భాగంగా విశాఖపట్టణం జిల్లాలోని చినగందిల మండలం, పరదేశిపాలెంలో ఉన్న సోషల్ వెల్ఫేర్ గర్ల్స్ హాస్టల్, గాజువాక మండలం నెలిముక్కులో ఉన్న సోషల్ వెల్ఫేర్ గర్ల్స్ హాస్టల్‌లో నిర్మించిన ప్లాంట్‌లను మార్చి మొదటి వారంలో విద్యార్థినులకు అంకితం చేస్తున్నారు.

సమానత్వం కోసం

## వేచి ఉండే పనే లేదు



భర్త బిల్ గేట్స్‌తో మిలిందా

''నువ్వు ఎక్కడ పుట్టావనేది కాదు, ప్రపంచంలో ఎక్కడైనా పుట్టు, ఆడపిల్లగా పుట్టావంటే చాలు, జీవితాన్ని నెట్టుకురావడానికి చాలా దుర్భరమైన, దయనీయమైన పరిస్థితులను ఎదుర్కోక తప్పదు''.

ఈ మాట అన్నది మామూలు మహిళ కాదు. మిలిందా గేట్స్. బిల్ గేట్స్ సతీమణి. 'బిల్ అండ్ మిలిందా గేట్స్ ఫౌండేషన్' సహ వ్యవస్థాపకురాలు. ప్రపంచ దేశాల్లో పర్యటించి ఆడవాళ్లు, పిల్లల జీవన స్థితిగతులను పరిశీలించిన మహిళ. తాను చూసిన ఘటనలతో 'ద మోమెంట్ ఆఫ్ లిఫ్ట్' అనే ప్రసిద్ధ పుస్తకం రాసిన మహిళ.

గేట్స్ ఫౌండేషన్ స్థాపించి ఇరవై ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా గేట్స్ దంపతులు సోమవారం సంయుక్తంగా ఒక వార్షిక లేఖను విడుదల చేశారు. ప్రపంచ ఆరోగ్యం, విద్య, స్త్రీ పురుష సమానత్వాలకు మున్ముందు మరింత ప్రాముఖ్యం ఇవ్వబోతునట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. అందులో స్త్రీ–పురుష సమానత్వం గురించి మిలిందా పంచుకున్న విషయాలు ఆలోచన రేకెత్తించేవిలా ఉన్నాయి. అదే సమయంలో స్త్రీ పురుష సమానత్వం సాధ్యమే అనే ఆశనూ చిగురింపజేస్తున్నాయి. గేట్స్ ఫౌండేషన్ ఇరవయ్యవ వార్షికోత్సవంతోపాటు, చరిత్రాత్మకమైన బీజింగ్ వరల్డ్ కాన్ఫరెన్స్‌కూ ఈ ఏడాది పాతికేళ్లు నిండబోతున్నాయి. ఆనాటి బీజింగ్ సదస్సు మహిళల స్థితిగతుల మీద చర్చించడానికి ప్రత్యేక దృష్టి పెట్టిన విషయాన్ని మిలిందా తన లేఖలో గుర్తు చేశారు. 1995లో బీజింగ్‌లో జరిగిన ఉమెన్ వరల్డ్ కాన్ఫరెన్స్‌లో హిల్లరీ క్లింటన్ ప్రసంగిస్తూ 'మానవ హక్కులే మహిళల హక్కులు.. మహిళల హక్కులే మానవ హక్కులు' అన్నారు. ఆ మాట తనను ఎంత ఇన్‌స్పైర్ చేసిందీ చెప్పారు. 'ఆ తర్వాత నేను ప్రపంచంలోని అత్యంత పేద దేశాల్లో పర్యటించాను. అక్కడి మహిళలను చూసిన తర్వాత స్త్రీ– పురుష సమానత్వ సాధన కోసం స్త్రీలకు అవసరమైన శక్తినివ్వడానికి సిద్ధపడ్డాను. ఇప్పుడు నేను చెప్పదలచినది ఏమంటే.. మన శక్తిని కార్యరూపంలోకి తీసుకురావడానికి మహిళలమందరం ముందుకు రావాలి. అప్పుడు సమానత్వం కోసం వేచి చూడాల్సిన పనే ఉండదు' అని లేఖలో రాశారు మిలిందా గేట్స్.

**బిల్–మిలిందా గేట్స్ ఫౌండేషన్ నిర్వహణతోపాటు మిలిందా గేట్స్ సొంతంగా ప్రపంచవ్యాప్తంగా భారీ విరాళాలతో సమాజహిత కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మహిళాభివృద్ధి ద్వారా కుటుంబాల అభివృద్ధి జరుగుతుందని, తద్వారా సమాజాభివృద్ధి సిద్ధిస్తుందని చెబుతారామె.**

**మిలిందా గేట్స్ యూఎస్‌లోని డ్యూక్స్ యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ సైన్స్, ఎంబీఏ చేశారు. ఒక దశాబ్దం పాటు తన కెరీర్ మీద మాత్రమే దృష్టి పెట్టారామె. ఇప్పుడు తన పూర్తి సమయాన్ని కుటుంబం, సమాజ సేవ కోసం కేటాయించారు.**

### బ్యూటిప్

● నిమ్మకాయ రసంతో తయారుచేసిన ఫేస్ ప్యాక్ వల్ల బోలెడు ప్రయోజనాలు ఉంటాయి. నిమ్మకాయలో సి విటమిన్ పుష్కలంగా ఉంటుంది. ఒక స్పూను నిమ్మకాయ రసంతో ఒక స్పూను ముల్తానా మట్టి పౌడర్‌ని కలిపి ముఖానికి ప్యాక్ వేసుకుని ఓ 20 నిమిషాల తర్వాత కడిగేస్తే చర్మంలోని మట్టి తొలగి, చర్మం ముడతలు పడకుండా ఉంటుంది. అలాగే నిమ్మకాయ రసంలో పెరుగు, తేనె కలిపి పెట్టుకుంటే కూడా చక్కని ఫలితం ఉంటుంది.



కడుపు చల్లగా

## అన్నమ్మ

**అవ్వ కావాలా.. బువ్వ కావాలా అంటుంటారు.. ఏదో ఒకటే.. అనే అర్థంలో. కర్నూలు పాతబస్తీలోని ఓ హోటల్‌లో మాత్రం అవ్వే స్వయంగా బువ్వ వడ్డిస్తుంది. నాణ్యమైన బియ్యంతో చేసిన అన్నం, పప్పు, సాంబారు, కూర, పచ్చడి, మజ్జిగ మధ్యాహ్న భోజనంగా అందిస్తోన్న ఆ అవ్వ పేరు లక్ష్మీదేవి. కడుపు మాడ్చుకునే నిరుపేదల ఆకలి తీర్చేందుకు ఈమె పదిహేనేళ్లుగా చవగ్గా అన్నం పెడుతోంది. అలాగని ధనవంతురాలేమీ కాదు.. ఆస్తిపాస్తులు అసలే లేవు. ఆమె అనుభవాలే ఆమెను 'అన్న'మ్మగా మార్చాయి.**



అవ్వ లక్ష్మీదేవి



వడ్డనలో అవ్వ కోడలు సుభద్ర

అవ్వ భర్త తిప్పన్న. రైతుల పొలాలకు పేడను సరఫరా చేసేవారు. యాభై ఐదు ఏళ్ల క్రితం వీళ్ల వివాహం అయింది. ఐదేళ్లకు కొడుకు పుట్టాడు. పెళ్లయ్యాక పదేళ్ల ఆ కుటుంబం సుఖంగానే ఉంది. అప్పటివరకు ఆకలి బాధేంటో అవ్వకు తెలీదు. ఆ సమయంలో భర్త హఠాత్తుగా మరణించడంతో అవ్వ జీవితం అంధకారం అయింది. అవ్వ ఓ గచ్చు గానుగలో పనికి కుదిరింది. రాత్రింబవళ్లు కష్టపడినా కూలీడబ్బులు వారానికి యాభై రూపాయలు మాత్రమే. పెద్ద పడఖానాలో వాళ్లుండే ఆ ఇరుకింటిలోనే జీవనం. వర్షానికి కారుతున్నా మరమ్మతులకు డబ్బులుండేవి కావు. కనీసం టీ తాగడానికి డబ్బులు ఉండేవి కావు. ఇంతటి ఆర్థిక కష్టాన్ని సైతం ఆమె ఎదురీదుతూ కుమారుడిని ఏడో తరగతి దాకా చదివించుకుంది. కొన్నాళ్లకు గానుగలకు డిమాండ్ పడిపోయింది. అవ్వ ఉపాధి కోల్పోయింది. జైన మందిరంలో నెలకు తొమ్మిది వందల రూపాయలకు పనిలో చేరింది. అక్కడ పదిహేనేళ్ల పనిచేస్తే జీతం ఐదొందలు పెరిగింది. 1994లో తన కొడుకు మద్దయ్యకు కర్నూలుకే చెందిన సుభద్రతో పెళ్లి చేసింది.

### ఆకలిని చూడలేక

ఇద్దరికి ముగ్గురయ్యారు కాబట్టి సొంతంగా ఏదైనా చెయ్యాలనుకుంది అవ్వ. మండీబజార్‌లో ఆరొందల రూపాయలకు ఓ చిన్నగదిని అద్దెకు తీసుకుంది. కొడుకు సాయంతో మొదట ఉగ్గాణి, బజ్జి వంటి టిఫిన్ పదార్థాలను చేసి అమ్మింది. మండీబజార్‌కు దూర ప్రాంతాల నుంచి సరుకుల లారీలు వస్తుంటాయి. నగరంతో పాటు పరిసర గ్రామాలకు చెందిన హమాలీలు లారీల్లోంచి సరుకుల బస్తాలు దింపుతుంటారు. మధ్యాహ్న సమయంలో భోంచేయడానికి ఇళ్ల వద్ద నుంచి చద్దిమూట తెచ్చుకునే వారు. తెల్లవారు జామునే వారు తెచ్చుకున్న అన్నం పాచిపోయేది. పప్పు వాసన కొట్టేది. చేతిలో డబ్బులేక వారు బజ్జీ తిని కాలం వెళ్లబోసుకునే వారు. అలా వారి ఆకలి నకనకలను అవ్వ అతి సమీపం నుంచి చూసింది.



కుమారుడు మద్దయ్య

ఏదో ఒక రీతిలో వారికి సాయం చేయాలనే సంకల్పానికి వచ్చింది. తను బజ్జీలమ్మే గదిలోనే నాణ్యమైన బియ్యంతో అన్నం తయారు చేసి పది రూపాయలకే విక్రయించింది. ధర చౌకగా ఉండటం వల్ల హమాలీలు రావడం మొదలు పెట్టారు. ఆ పది రూపాయలకే అన్నంతో పాటు పప్పు, సాంబారు, పచ్చడి, మజ్జిగలను వడ్డించేది.

### వరదల్లో నష్టం

2009లో కర్నూలుకు వరదలు వచ్చాయి. నిల్వ ఉంచుకున్న కొన్ని బియ్యం బస్తాలు, ఇతర ఆహార దినుసులు పాడైపోయాయి. పుంజుకోవడానికి సమయం పట్టింది. అయినా అవ్వ అధైర్య పడలేదు. అన్నం వడ్డింపునకు అంతరాయం కలిగించలేదు. భోజన ధరను పదిహేను రూపాయలు చేసింది. స్థలం చాలడం లేదని 2014లో ఎదురుగా ఉండే షాపులోకి తన హోటల్‌ను మార్చింది. కొడుకు, కోడలు అవ్వకు తోడుగా నిలిచారు. హమాలీలతో పాటు షాపుల్లో పనిచేసే గుమస్తాలు, పనిమీద నగరానికి వచ్చిన వారు, రైతు బజార్ రైతులు, నిరుపేదలు వస్తుండటంతో అవ్వ అన్నానికి క్రమేపీ గిరాకీ పెరిగింది. భోజనం పెట్టే వేళలను కూడా మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పొడిగించింది. బియ్యం ధర కేజీ యాభై రూపాయలు ఉన్న ప్రస్తుత రోజుల్లోనూ అవ్వ ఇరవై ఐదు రూపాయలకే భోజనం వడ్డిస్తుండటం విశేషం

### సేవతో సంతృప్తి

హోటల్‌ని మేమే స్వయంగా నిర్వహించుకుంటాం కాబట్టి మాకు పనివాళ్ల అవసరం ఉండదు. వేతనాల చెల్లింపుల ఖర్చు అసలే ఉండదు. బియ్యం లూజుగా కొంటే ధర ఎక్కువ. మేం ఒకేసారి ఐదారు బస్తాలు కొనేస్తాం. చౌకధరకు లభిస్తాయి. లాభం కోసం హోటల్‌ని నడపడం లేదు. పేదలకు సైతం కడుపు నింపుకునే అవకాశం కల్పించడం నాకు, మా కుటుంబానికి ఎంతగానో సంతృప్తినిస్తోంది. ఇటీవలే కంటి ఆపరేషన్ చేసుకున్నా. అయినా ఇంట్లో ఉండలేకపోయా. నా పేరుతోనే హోటల్ నడుస్తుంది కాబట్టి పనిలోకి వెంటనే వచ్చేశా.

– అవ్వ (కురువ లక్ష్మీదేవి)

– ఎస్. సర్దార్‌బాషా ఖాద్రి, సాక్షి, కర్నూలు
ఫొటోలు : డి.హుసేన్

రెండు విషయాలు

## చిన్నారి చేతన

**మే**ఘాలయ రాజధాని షిల్లాంగ్‌లో 9 ఏళ్ల మీదైబహున్ వార్తల్లోకి వచ్చింది. ఆ చిన్నారి ఒక అద్భుతమైన యాంటీ–బుల్లీయింగ్ యాప్ కనిపెట్టడమే అందుకు కారణం! క్లాస్‌రూమ్‌లో ఎవరైనా అమ్మాయిల్ని వేధిస్తుంటే ఈ యాప్ లోంచి నేరుగా స్కూల్ యాజమాన్యానికి క్షణాల్లో సమాచారం ఇవ్వొచ్చు. మీదైబహున్ నాలుగో తరగతి చదువుతోంది. ఇంత చిన్న వయసులో ఎలా సాధ్యమైంది ఇలాంటి ఒక ఆవిష్కరణ! అంటే ''నేను కూడా క్లాస్ రూములో వేధింపులకు గురైన అమ్మాయినే. ఇంట్లో చెప్పుకోలేకపోయేదాన్ని. స్కూల్‌లో చెప్పడానికి భయపడేదాన్ని. చివరికి నాకీ మార్గం తోచింది'' అంటోంది మీదైబహున్. ఈ యాప్ త్వరలోనే గూగుల్ ప్లే స్టోర్‌లో అందుబాటులోకి రాబోతోంది.



మీదైబహున్

## ఐపీఎస్ ధర్నా



అత్తింటి ముందు 'ధర్నా' చేస్తున్న ఐపీఎస్ అధికారి అరుణ్ రంగరాజన్

ఎంత ఐపీఎస్ అధికారులైనా ముందు భార్యాభర్తలు. ఆయన్ని వదిలి ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. వెళుతూ పిల్లల్ని తీసుకెళ్లింది. ఒక్కసారి వాళ్లను చూడాలని ఉంది అన్నాడు ఆయన. ''కుదరదు, నువ్వు నా భర్తగానే కాదు, నా పిల్లలకు తండ్రిగా ఉండటానికి కూడా అనర్హుడివి'' అంది ఆమె. ''పిల్లల్ని కలవనిచ్చేవరకు ఇక్కణ్నుంచి కదిలేది లేదు'' అని భార్య పుట్టింటి ముందే దీక్షకు కూర్చున్నాడు ఆయన. న్యూసెన్స్ చేస్తున్నాడని భార్య కంప్లయింట్ చేసింది. పోలీసులొచ్చి ''సార్.. మీరిలా కూర్చోవడం బాగోలేదు. లేవండి సర్'' రిక్వెస్ట్ చేశారు. కలబురగి ఇంటర్నల్ సెక్యూరిటీ డివిజన్ ఎస్పీ మరి ఆయన. అందుకే రిక్వెస్ట్ చేశారు. అయినా కదిలేది లేదు అన్నారు ఆయన. భార్య డీసీపీ. ఆమే దిగిరావడం లేదు. ఇద్దరిదీ బెంగళూరు. ఒకరికి చెప్పవలసివారు. ఒకరి చేత చెప్పించుకునే పరిస్థితిలో ఉన్నారు.

epaper.sakshi.com

సాక్షి ఫ్యామిలీ
సినిమా
నల్లగొండ
బుధవారం ॥ 12-2-2020


విజయ్ దేవరకొండ

“నేను ప్రేమకథా చిత్రాలు చేయనంటే కేవలం వాణిజ్య అంశాలతో కూడుకున్న సినిమాలే చేస్తానని కాదు. ‘టాక్సీవాలా’ (2018) లాంటి ప్రేమకథ చిత్రం వస్తే చేస్తానేమో. ప్రేమే ప్రధానాంశంగా ఉన్న ‘అర్జున్‌రెడ్డి’ (2017), ‘డియర్ కామ్రేడ్’ (2019) వంటివి చేయకూడదనుకుంటున్నాను. ప్రస్తుతం కెరీర్‌లో ఓ మార్పు కోరుకుంటున్నాను. పూరీగారితో సినిమా చేస్తున్నాను కాబట్టి నాలో కాన్ఫిడెన్స్ పెరిగి ఇలాంటి నిర్ణయం తీసుకున్నానని కాదు. చిన్నతనం నుంచే నాది ఓవర్ కాన్ఫిడెన్స్” అన్నారు విజయ్ దేవరకొండ. క్రాంతిమాధవ్ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ హీరోగా కేయస్ రామారావు సమర్పణలో కె.ఎ. వల్లభ నిర్మించిన ‘వరల్డ్ ఫేమస్ లవర్’ ఈ నెల 14న రిలీజవుతోంది. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ చెప్పిన విశేషాలు.

# నాది ఓవర్ కాన్ఫిడెన్స్

- స్క్రిప్ట్ పరంగా ఈ సినిమాలో మూడు ప్రేమకథలు ఉన్నాయి. వీటిలో సీనయ్య, సువర్ణల ప్రేమకథ ఒకటి. ఒక చిన్న ఊర్లో పెద్దగా చదువు లేని భార్యాభర్తల మధ్య సాగే కథ. ఇందులో సీనయ్య పాత్రకు బాధ్యతలు ఎక్కువ. ఈ పాత్రకు రిఫరెన్స్‌గా మా నాన్నగారిని తీసుకున్నాను. మరోవైపు బాధ్యత అనేదే తెలియకుండా సౌకర్యంగా ప్యారిస్‌లో జీవితాన్ని గడిపే ఓ యువకుడి లవ్‌స్టోరీ. ఇంకోటి కొత్తగూడెంలోని ఓ కాలేజీ ప్రేమకథ. ఈ లవ్‌స్టోరీకి కాస్త ‘అర్జున్ రెడ్డి’ టచ్ ఉండొచ్చు. మూడు ప్రేమకథలకు సినిమాలో రిలేషన్ ఉంది. అదేంటో ప్రేక్షకులు వెండితెరపై చూడాలి.
- ఈ సినిమా కోసం మెంటల్‌గా, ఫిజికల్‌గా చాలా కష్టపడ్డాను. కొత్తగూడెం లవ్‌స్టోరీకి మీసాలు పెట్టి, చిన్న జుట్టు ఉన్న హెయిర్ స్టైల్‌తో కనిపించాలి. ప్యారిస్ కథకు కొంచెం ఫ్యాషన్‌గా కనిపించాలి. కాలేజ్ కథకు ఆ స్పెషల్ టచ్ ఉండాలి. ఇలా క్యారెక్టర్స్ కోసం శ్రమించాల్సి వచ్చింది. క్రాంతి (చిత్రదర్శకుడు క్రాంతి మాధవ్) బలం రైటింగ్. నా నటనను పక్కనపెడితే మిగతా క్రెడిట్ ఆయనకు, కెమెరామేన్ జయకృష్ణ గుమ్మడి, నిర్మాత కేఎస్ రామారావుగారికి దక్కుతుంది.
- నేను యాక్షన్ సినిమాకి గెడ్డం పెంచినా, ఓ సైన్స్‌ఫిక్షన్ సినిమాకి గెడ్డం పెంచినా ‘అర్జున్ రెడ్డి’యే అంటారు. అది నాకు తప్పదు. ఒక ఫ్లాప్ సినిమాతో కంపేర్ చేస్తే అది నన్ను బాధ పెడుతుంది. కానీ ‘అర్జున్‌రెడ్డి’ లాంటి క్రేజీ హిట్ మూవీతో పోల్చడం బాగానే ఉంది.
- ‘వరల్డ్ ఫేమస్...’ ప్రీ రిలీజ్ వేడుకకు వచ్చిన వారిని (ఫ్యాన్స్) చూసి ఆశ్చర్యపోయాను. వారితో నాకు ఏ అనుబంధం లేకపోయినా ఇంతమంది ఎందుకు వస్తున్నారు అనుకున్నా! టికెట్ బుకింగ్స్ చూసి షాకయ్యాను. వారి ప్రేమ, అభిమానం గొప్పవి. అందుకే మా ఆడియన్స్‌కు నా బెస్ట్ వెర్షన్ సినిమాలను ఇవ్వాలనుకుంటున్నాను. సాధ్యమైనంత వరకు శక్తివంచన లేకుండా కష్టపడాలనుకుంటున్నాను.

> నేను సినిమాల్లోకి వద్దామనుకుంటున్నప్పుడు... ‘మీ నాన్నగారికి కుదర్లేదు కదా. సక్సెస్ ఉండదు. డబ్బులు రావు’ అన్నారు. సో.. మెంటల్‌గా భయంగానే ఉంటుంది. ఇప్పటికీ నాకు ఆ భయం ఉంటుంది. కానీ వాటిని ధైర్యంగా ఎదుర్కొని మనల్ని మనం నిరూపించుకోవాలి. లేకపోతే భయంలోనే కొట్టుకుంటూ పోతాం. కొత్త తరం మారాలి. అందుకు నా వంతు డ్యూటీ చేస్తాను.

- ‘వరల్డ్ ఫేమస్ లవర్’ నా తొమ్మిదో సినిమా. వీటిలో ఆరు సినిమాలు కొత్త దర్శకులతో తెరకెక్కినవే. మొదట్లో సర్వైవల్ కోసం సినిమాలు చేశాను. ఇప్పుడు నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. రాబోయే రెండేళ్లు యాక్టర్‌గా నా కెరీర్‌లో న్యూ ఫేజ్ అనుకుంటున్నాను. కొత్త రకం కథలను ప్రయత్నించాలనుకుంటున్నాను.
- నిజానికి ప్రేమ కాన్సెప్ట్ నాకు ఒకప్పుడు నాన్సెన్స్‌లా తోచింది. ప్రేమలో కూడా చాలా దశలు ఉంటాయి. ఒక అబ్బాయి ముందు ఒక అమ్మాయిని ప్రేమిస్తాడు. నాది ట్రూ లవ్ అంటాడు. అనుకోని కారణాల వల్ల అది బ్రేకప్ అయినప్పుడు వేరే అమ్మాయితో ప్రేమలో పడతాడు. అది కూడా ట్రూ లవ్ అంటాడు. అసలు ఎవరితోనూ ప్రేమలో లేనప్పుడు... మొదట ప్రేమించిన అమ్మాయి, రెండోసారి ప్రేమించిన అమ్మాయి ఒకేసారి కనిపిస్తే, ఎవరితో ముందుగా ప్రేమలో పడతాడు? అనే అయోమయంలో ఉండేవాడిని. ఇప్పుడు అలా లేదు. జీవితంలో లవ్ అనే స్ట్రాంగ్ ఎమోషన్ ఉండాలనే ఆలోచన ఉన్న ఫేజ్‌లో ఉన్నాను. ట్రూ లవ్ ఉంటుందనే అనుకుంటున్నాను.
- పెళ్లి చేసుకుంటాను. పెళ్లి అనేది బాధ్యతతో కూడుకున్నది. ఆ బాధ్యత తీసుకోవడానికి ప్రస్తుతం నేను మానసికంగా సిద్ధంగా లేను. నాకు 30 ఏళ్లు వచ్చాయి. కొన్ని విషయాల్లో పెద్దవాణ్ని అయిపోయాననిపిస్తుంది. కానీ పెళ్లి అనగానే నేను ఇంకా పిల్లోణ్నే అనిపిస్తుంది.
- నా గురించి వ్యతిరేక వ్యాఖ్యలు, పోస్ట్‌లు చేసేవారు ఉంటారు. వారు నా గురించి అంతగా ఆలోచిస్తున్నారు అంటే వారికి నేనంటే ఎంతో ప్రేమ ఉండి ఉంటుంది. వారు నిద్రపోయేప్పుడు కూడా నేనే గుర్తుకు వస్తానేమో. విమర్శలను ఇష్టపడతాను. కానీ విలువైన విమర్శలనే తీసుకుంటాను.

# జోడీ కుదిరిందా?

నాగచైతన్య హీరోగా ‘గీతగోవిందం’ ఫేమ్ పరశురామ్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. 14 రీల్స్ ప్లస్ ఈ సినిమాను నిర్మిస్తోంది. ఈ సినిమాకు ‘నాగేశ్వరరావు’ అనే టైటిల్ అనుకుంటున్నారని, ఆ టైటిల్ రోల్‌నే నాగచైతన్య చేస్తారని వార్తలు వస్తున్నాయి. తాజాగా ఈ సినిమాలో కథానాయికగా రష్మికా మందన్నా నటించబోతున్నారనే వార్త షికారు చేస్తోంది. పరశురామ్ దర్శకత్వంలో వచ్చిన ‘గీతగోవిందం’ చిత్రంలో గీతగా రష్మిక నటించిన సంగతి గుర్తుండే ఉంటుంది. ‘గీతగోవిందం’ చిత్రం రష్మికా కెరీర్‌కు మంచి మైలేజ్‌ని ఇచ్చింది. మరి.. స్క్రీన్‌పై నాగచైతన్యతో రష్మికా జోడీగా కనిపిస్తుందా? వెయిట్ అండ్ సీ.


నాగ చైతన్య


రష్మికా మందన్నా

# అది నిజం కాదు బ్రదర్

ఓ నెటిజన్ వ్యంగ్య వ్యాఖ్యకు హీరో రానా అదిరిపోయే సమాధానం ఇచ్చారు. అసలేం జరిగిందంటే... ‘‘నేను పదో తరగతిలో ఫెయిల్ అయ్యాను. అయినా ఆ ఫలితం నా కలలను నేరవేర్చుకునే ప్రక్రియను నిరుత్సాహపరచలేదు’’ అని రానా ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూ హెడ్‌లైన్‌ను ట్వీటర్‌లో పోస్ట్ చేశాడు ఓ నెటిజన్. ‘ఎందుకంటే మా కుటుంబానికి ఓ పెద్ద నిర్మాణ సంస్థ ఉంది’ (రానాను ఉద్దేశిస్తూ) అంటూ వ్యంగ్య ధోరణిలో ఓ కామెంట్‌ని ఆ పోస్ట్‌కు జోడించాడు నెటిజన్. ఈ కామెంట్‌కు హీరో రానా తనదైన శైలిలో బదులు చెప్పారు. ‘‘నువ్వు చెప్పింది నిజం కాదు బ్రదర్. నువ్వు నటన అనే కళను నేర్చుకోకపోతే నిర్మాణ సంస్థ ఉన్నా ఏ ఉపయోగం ఉండదు. మంచి కథలను ప్రేక్షకుల ముందుకు తీసుకువెళ్లడానికి చాలా నిర్మాణ సంస్థలు పని చేస్తున్నాయి’’ అంటూ, ‘నువ్వు ఒక ఫెయిల్యూర్‌వి అని ప్రపంచం అంతా అంటున్నా నీ కలలను వెంటాడు’ అని కూడా సూచించారు రానా.


‘అరణ్య’లో రానా

**ఏప్రిల్ 2న అరణ్య:** రానా హీరోగా ప్రభు సాల్మన్ దర్శకత్వంలో తెరకెక్కిన త్రిభాషా చిత్రం ‘అరణ్య’. తమిళంలో ‘కాడన్’, హిందీలో ‘హాథీ మేరే సాథీ’ అనే టైటిల్స్‌ను పెట్టారు. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 2న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు చిత్రబృందం.

# పదేళ్ల తర్వాత

కరిష్మా కపూర్, హ్యూమా ఖురేషి, కియారా అద్వానీ.. ఇలా మరికొందరు బాలీవుడ్ హీరోయిన్లు డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్ రంగంవైపు కూడా దృష్టి సారించారు. తాజాగా ఈ జాబితాలోకి తన పేరు రాసుకున్నారు మాజీ విశ్వసుందరి సుస్మితా సేన్. రామ్ మాధ్వనీ దర్శకత్వం వహించిన ‘ఆర్య’ అనే వెబ్ సిరీస్‌లో సుస్మితా టైటిల్ రోల్ చేశారు. గత డిసెంబర్‌లో ఈ వెబ్ సిరీస్ షూటింగ్ జరిగింది. రాజస్థాన్ నేపథ్యంలో ఈ వెబ్ సిరీస్ ఉంటుంది. దాదాపు పదేళ్ల తర్వాత మళ్లీ సుస్మితా కెమెరా ముందుకు వచ్చారు. 2010లో వచ్చిన ‘నో ప్రాబ్లమ్’ సినిమా తర్వాత లీడ్ రోల్‌కి నటిగా మేకప్ వేసుకోలేదామె. ఇప్పుడు వెబ్ సిరీస్ ద్వారా కనిపించబోతున్నారు. ‘‘ఇన్నేళ్ల తర్వాత మళ్లీ ప్రేక్షకులను పలకరించబోతున్నందుకు ఆనందంగా ఉంది’’ అన్నారు సుస్మితా సేన్.


సుస్మితా

# అంతకుమించి!

రెండేళ్ల క్రితం ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో వచ్చిన ‘అ!’ చిత్రం ప్రేక్షకులను, విమర్శకులను మెప్పించింది. వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై హీరో నాని ఈ సినిమా నిర్మించారు. ఈ సినిమా సీక్వెల్‌ను ఆశించారు కొందరు ప్రేక్షకులు. ఇప్పుడు ‘అ!’ సీక్వెల్ స్క్రిప్ట్‌ను పూర్తి చేసినట్లు వెల్లడించారు ప్రశాంత్ వర్మ. ‘‘అ! 2’ కోసం నన్ను అడుగుతూ, ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నవారందరికీ ధన్యవాదాలు. దాదాపు ఏడాది క్రితమే ‘అ! 2’ స్క్రిప్ట్‌ను పూర్తి చేశాను. ఇది ‘అ!’ కన్నా క్రేజీగా ఉంటుంది. కథ అంతకు మించి ఉంటుంది. కానీ సెట్స్‌పైకి తీసుకువెళ్లలేకపోతున్నాను. ఎందుకుంటే స్క్రిప్ట్‌లోని క్రేజ్‌నెస్‌కి తగ్గ క్రేజీ ప్రొడ్యూసర్ కుదరడం లేదు. నన్ను నమ్మండి. ప్రయత్నించి చాలా అలసిపోయాను. కాబట్టి జరగాల్సినప్పుడే అది (‘అ!2’ షూటింగ్‌ను ఉద్దేశించి) జరుగుతుంది’’ అని సోషల్ మీడియాలో పేర్కొన్నారు ప్రశాంత్‌వర్మ.


ప్రశాంత్ వర్మ

# సీనియర్ జర్నలిస్ట్ రామారావు మృతి

సీనియర్ జర్నలిస్ట్, సినీ పీఆర్‌ఓ పసుపులేటి రామారావు (70) ఇక లేరు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో మంగళవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. పసుపులేటి రామారావు స్వస్థలం పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు. డిగ్రీ వరకు చదువుకున్న ఆయన ప్రజానాట్యమండలి, కమ్యూనిస్టు పార్టీలో చురుగ్గా పని చేశారు. పాత్రికేయుడిగా దాదాపు నాలుగు దశాబ్దాల అనుభవం ఆయనది. తొలుత విశాలాంధ్ర విలేకరిగా పనిచేసిన ఆయన ఆ తర్వాత జ్యోతిచిత్ర పత్రికలో జర్నలిస్ట్‌గా పనిచేశారు. నంబర్ వన్, సంతోషం వంటి పలు వారపత్రికల్లోనూ చేశారు. సినిమాలకు పీఆర్వోగానూ వ్యవహరించారు. దాసరి నారాయణరావు, టి.కృష్ణ, యస్వీఆర్, చిరంజీవి, సావిత్రి, శ్రీదేవి.. వంటి సినీ దిగ్గజాలపై పుస్తకాలు రచించారు. సీనియర్ ఎన్టీఆర్, ఏయన్నార్, జగ్గయ్య, కృష్ణ, కృష్ణంరాజు, శోభన్ బాబు, చంద్రమోహన్, మురళీ మోహన్, మోహన్ బాబు, చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేశ్‌లతో పాటు ఎంతో మంది నటీనటులను, సాంకేతిక నిపుణులను ఇంటర్వ్యూలు చేశారు. వాటిలో కొన్నింటిని ‘నాటి మేటి సినీ ఆణిముత్యాలు’ పేరుతో పుస్తకరూపంలో తీసుకువచ్చారు. ఆయనకు భార్య వెంకటలక్ష్మి, కుమారుడు కల్యాణ్ నాగ చిరంజీవి ఉన్నారు. రామారావు మృతికి సినీ ప్రముఖులు, సినీ జర్నలిస్టులు సంతాపం తెలిపారు. నటుడు చిరంజీవి, దర్శకులు రేలంగి నరసింహారావు, ఎస్వీ కృష్ణారెడ్డి, నిర్మాతలు బీవీఎస్ఎన్ ప్రసాద్, సీవీ రెడ్డి, పోకూరి బాబూరావు, అచ్చిరెడ్డి, నటుడు మాదాల రవి తదితరులు పసుపులేటి రామారావు భౌతికకాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు. నటులు పవన్ కల్యాణ్, నాని, కల్యాణ్ రామ్, వరుణ్ తేజ్, శర్వానంద్, నితిన్, దర్శకులు హరీష్ శంకర్, కొరటాల శివ తదితరులు సంతాపం తెలిపారు. రామారావు అంత్యక్రియలు నేడు హైదరాబాద్‌లోని మహాప్రస్థానంలో జరగనున్నాయి.


పసుపులేటి రామారావు

రామారావుగారి వ్యక్తిత్వం నాకెంతో ఇష్టం. నేనంటే ఆయనకు ఎంతో అభిమానం.. ఆయనన్నా నాకూ అంతే అభిమానం. లేకలేక పుట్టిన ఆయన కుమారుడికి మా ముగ్గురు అన్నదమ్ముల పేర్లు (చిరంజీవి, నాగబాబు, పవన్ కల్యాణ్) కలిసి వచ్చేలా కల్యాణ్ నాగ చిరంజీవి అని పేరు పెట్టారు. ఆయన మోకాలికి ఆపరేషన్ చేయించడం కోసం డాక్టర్‌ని కూడా సంప్రదించాం. అయితే తన అక్కయ్యకు ఆరోగ్యం బాగాలేదని, తర్వాత చేయించుకుంటానని అన్నారు. ఆయన్ను నీతికి, నిజాయతీకి, నిబద్ధతకు మరో రూపంలా చూస్తా. రామారావుగారి కుటుంబానికి అండగా ఉంటాను.
**- నటుడు చిరంజీవి**

నాకు సన్నిహితుడైన రామారావుగారి మరణం నన్ను దిగ్భ్రాంతికి గురిచేసింది. నేను నటుడిగా పరిచయమైనప్పట్నుంచి ఆయనతో స్నేహం ఉంది. మద్రాసులో ఎంత సన్నిహితంగా ఉన్నామో, హైదరాబాద్‌కి వచ్చాక కూడా అంతే సాన్నిహిత్యం మా మధ్య కొనసాగింది. అప్పుడూ, ఇప్పుడూ తెల్లటి దుస్తులు, భుజాన కాటన్ సంచి.. ఇదే ఆయన ఆహార్యం. నిజాయతీకి నిలువెత్తు నిదర్శనంగా ఆయన పేరు తెచ్చుకున్నారు. ఎన్నోసార్లు నన్ను ఇంటర్వ్యూ చేశారు. ఒక తరం సినీ జర్నలిస్టులకు మార్గదర్శిగా నిలిచిన ఆయన మరణం తీరని లోటు.
**- నటుడు మోహన్‌బాబు**

# సల్మాన్‌తో సై

తెలుగులో సూపర్ సక్సెస్‌తో దూసుకెళ్తోన్న హీరోయిన్ పూజాహెగ్డే బాలీవుడ్‌లో ఓ బంపర్ చాన్స్ కొట్టేశారు. బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్‌కు జోడీగా నటించబోతున్నారు. సల్మాన్ హీరోగా ఫర్హాద్–సామ్‌జీ దర్శకత్వంలో ‘కబీ ఈద్ కబీ దివాలీ’ అనే చిత్రం తెరకెక్కనుంది. ఈ చిత్రాన్ని సాజిద్ నడియాద్‌వాలా నిర్మించనున్నారు. ఇందులో కథానాయికగా పూజా హెగ్డేను తీసుకున్నారు. ‘‘సల్మాన్, పూజా తొలిసారి జంటగా నటించబోతున్నారు. కొత్త జంటగా వీరిద్దరు కథకు ఓ ఫ్రెష్ లుక్‌ను తీసుకొస్తారు. స్క్రీన్‌పై వీరిద్దరి కెమిస్ట్రీ బాగా కుదురుతుందన్న నమ్మకం ఉంది. తొలి షెడ్యూల్ స్టార్ట్ చేయడానికి ముందు కొన్ని వర్క్‌షాప్స్ ప్లాన్ చేశాం’’ అన్నారు సాజిద్. హృతిక్ రోషన్‌తో ‘మొహంజోదారో’, అక్షయ్ కుమార్‌తో చేసిన ‘హౌస్‌ఫుల్ 4’ చిత్రాల తర్వాత పూజా హిందీలో నటించబోతున్న మూడో చిత్రం ఇది. ప్రస్తుతం తెలుగులో ప్రభాస్‌తో ‘రాధే శ్యామ్’ (ప్రచారంలో ఉన్న టైటిల్), అఖిల్‌తో ‘మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్’ సినిమాతో పూజా బిజీ.


పూజా హెగ్డే

# వ్యతిరేకించినవాళ్లే సపోర్ట్ చేస్తున్నారు


నరసింహ నంది, దివ్యారావు, వరుణ్

‘‘డిగ్రీ కాలేజ్’ విడుదలకు ముందు పోస్టర్స్ చూసి సినిమాని ప్రదర్శించకుండా అడ్డుకుంటామన్న విద్యార్థి సంఘాలు, మహిళా సంఘాల నాయకులే చిత్రాన్ని చూశాక మనసుకు హత్తుకునే మంచి కథ ఉందని ప్రశంసిస్తున్నారు. అప్పుడు వ్యతిరేకించినవాళ్లే ఇప్పుడు సపోర్ట్ చేస్తున్నారు’’ అన్నారు దర్శకుడు నరసింహ నంది. వరుణ్, దివ్యారావు జంటగా స్వీయ దర్శకత్వంలో నరసింహ నంది నిర్మించిన ‘డిగ్రీ కాలేజ్’ ఈ నెల 7న విడుదలైంది. ఈ చిత్రం సక్సెస్ మీట్‌లో నరసింహ నంది మాట్లాడుతూ– ‘‘కొన్ని రొమాంటిక్ సీన్స్ చూసి సినిమా మీద నెగటివ్ అభిప్రాయం ఏర్పరచుకోవద్దని మా మనవి. సినిమా చూశాక మాట్లాడమని కోరుతున్నాం. బలమైన కథ ఉంది. క్లైమ్యాక్స్ సీన్స్ ప్రేక్షకులను భావోద్వేగానికి గురి చేస్తున్నాయి. కుల వ్యవస్థ మీద తీసిన సినిమా ఇది. ‘1940 లో ఒక గ్రామం’ సినిమాని కుల వ్యవస్థపైనే తీశాను.. జాతీయ అవార్డు వచ్చింది కానీ డబ్బులు రాలేదు. ‘డిగ్రీ కాలేజ్’కి డబ్బులు కూడా రావడం ఆనందంగా ఉంది’’ అన్నారు.






మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com


జాబ్ ట్రెండ్స్



ఈ-కామర్స్... ఆన్‌లైన్ షాపింగ్.. నేడు మన దైనందిన జీవితంలో భాగం! బిర్యానీ నుంచి యాపిల్ ఫోన్ వరకూ.. ఇప్పుడు ప్రతి ఒక్కరూ ఈ-కామర్స్ సైట్లను.. ఆశ్రయిస్తున్న వైనం! ఇంటి దగ్గరికే తమకు నచ్చిన వస్తువులను ఈ-కామర్స్ సంస్థలు అందిస్తుండటమే ఇందుకు కారణం! దాంతో గత కొంతకాలంగా ఈ-కామర్స్ రంగం కళకళలాడుతోంది! ముఖ్యంగా ఫుడ్, రిటైల్, ఎలక్ట్రానిక్స్, స్మార్ట్‌ఫోన్స్, హోమ్ అప్లయన్సెస్ వంటి విభాగాల్లో.. ఈ-కామర్స్ దూసుకుపోతోంది!! ఇదే ఇప్పుడు యువతకు కొలువుల కల్పతరువుగా మారింది. పలు సంస్థల అంచనాల ప్రకారం- ఈ కామర్స్‌లో రానున్న మూడేళ్లలో అందుబాటులోకి వచ్చే ఉద్యోగాల సంఖ్య దాదాపు పది లక్షలు. ఈ నేపథ్యంలో.. ఈ-కామర్స్ రంగంలో లభించే కొలువులు.. సరికొత్త జాబ్ ప్రొఫైల్స్.. అవసరమైన అర్హతలు, నైపుణ్యాల గురించి తెలుసుకుందాం...

» రానున్న మూడేళ్లలో పది లక్షలకు పైగా ఉద్యోగాలు లభిస్తాయని అంచనా
» డెలివరీ బాయ్స్ నుంచి ఏఐ నిపుణుల వరకూ అనేక విభాగాల్లో కొలువులు
» పదో తరగతి నుంచి ప్రొఫెషనల్ డిగ్రీల దాకా అందరికీ అవకాశాలు.

# ఈ కామర్స్.. కొలువుల కామధేనువు!

'రానున్న అయిదేళ్లలో భారత్‌లో మిలియన్ ఉద్యోగాలను కల్పిస్తాం'-ఈ-కామర్స్ దిగ్గజ సంస్థ అమెజాన్ సీఈవో జెఫ్ బెజోస్ చేసిన తాజా ప్రకటన. ఇది ఒక్క అమెజాన్ సంస్థకు సంబంధించి భవిష్యత్తు నియామకాల ప్రణాళిక మాత్రమే. దేశంలోని ప్రముఖ ఈ-కామర్స్ సంస్థలు ఫ్లిప్‌కార్ట్, పేటీఎం వంటి వాటి నియామక ప్రణాళికలను కూడా పరిగణనలోకి తీసుకుంటే.. ఈ సంఖ్య రానున్న అయిదేళ్లలో దాదాపు 20 లక్షలకు చేరే అవకాశం ఉందని నిపుణుల అంచనా. నియామకాల పరంగా ఇండియన్ స్టాఫింగ్ ఫెడరేషన్ అంచనాలు, డెలాయిట్ సంస్థ నివేదికలు, ఇతర సంస్థల నివేదికలను పరిగణనలోకి తీసుకుంటే.. 2022 నాటికి ఈకామర్స్ రంగం పది లక్షలకు పైగా కొలువులకు వేదికగా నిలవనుంది. ఈ-కామర్స్ కార్యకలాపాలపై నియంత్రణ విధించాలనే విజ్ఞప్తులు వినిపిస్తున్నప్పటికీ.. ఈ- కామర్స్ సంస్థలకు పెరుగుతున్న ఆదరణే ఇందుకు కారణంగా చెప్పొచ్చు. మరోవైపు 2021 చివరి నాటికి ఈ-కామర్స్ మార్కెట్ విలువ 84 బిలియన్ డాలర్లకు చేరుకోనుందని అంచనా.

## ముఖ్యంగా ఆ అయిదు

ఈ-కామర్స్, ఆన్‌లైన్ సేల్స్ కార్యకలాపాల పరంగా అయిదు విభాగాలు పురోగమన బాటలో నడుస్తూ.. యువత ఉపాధికి ఊతమివ్వనున్నాయి. రిటైల్, ఆన్‌లైన్ ఎడ్యుకేషన్, టికెటింగ్ అండ్ ట్రావెలింగ్, క్లాసిఫైడ్ జాబ్ పోర్టల్స్, హైపర్ లోకల్స్ విభాగాల్లో నియామకాల సంఖ్య ఊపందుకోనుంది. ఇప్పుడు ఆన్‌లైన్ ఎడ్యుకేషన్‌కు సంబంధించి అనేక ఈ-లెర్నింగ్ ప్లాట్‌ఫామ్స్ అందుబాటులోకి వచ్చాయి. అలాగే ఉద్యోగ అన్వేషణలో ఉన్న అభ్యర్థుల కోసం కొత్త జాబ్ పోర్టల్స్ ఏర్పాటవుతున్నాయి. వీటి నిర్వహణకు సమర్థవంతమైన నిపుణుల అవసరం ఉంటుంది. దాంతో ఆయా విభాగాల్లో ఎంట్రీ లెవల్ నుంచి ఉన్నత స్థాయి వరకూ.. కొత్త ఉద్యోగాలు లభించనున్నాయి.

## లాజిస్టిక్స్ విభాగం

ఉద్యోగాల కల్పన విషయంలో ముందంజలో నిలుస్తున్న మరో ఈ కామర్స్ విభాగం.. లాజిస్టిక్స్. ముఖ్యంగా రిటైల్ ఈ-కామర్స్ సెగ్మెంట్‌లో లాజిస్టిక్స్ పాత్ర ఎంతో కీలకం. ఒక వస్తువును వినియోగదారుడు ఆర్డర్ చేసినప్పటి నుంచి అతని చేతికి చేరే వరకూ.. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సజావుగా డెలివరీ చేయడమే లాజిస్టిక్స్ నిపుణుల ప్రధాన బాధ్యత. కాబట్టి లాజిస్టిక్స్‌లో భారీ సంఖ్యలో సిబ్బంది నియామకానికి ఈ-కామర్స్ సంస్థలు ప్రాధాన్యం ఇస్తున్నాయి.

## ప్రొడక్ట్ డిజైన్ టు మార్కెటింగ్

ఈ-కామర్స్ సంస్థల్లో ప్రస్తుతం ప్రొడక్ట్ డిజైన్ మొదలు బ్రాండింగ్, మార్కెటింగ్, హెచ్‌ఆర్, ఫైనాన్స్.. ఇలా పలు విభాగాల్లో ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి. ముఖ్యంగా సంస్థలు బ్రాండింగ్, మార్కెటింగ్‌కు ప్రాధాన్యమిస్తూ.. ఇందుకు సంబంధించి ఎస్ఈఓ, ఎస్ఈఎం, సీఆర్ఎం, మార్కెటింగ్ విభాగాల్లో ప్రత్యేక నైపుణ్యాలున్న అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఫిన్‌టెక్ సంస్థల్లో ఫైనాన్స్ నిపుణుల అవసరం పెరుగుతోంది. అలాగే ప్రస్తుతం ఈ-కామర్స్ రంగంలో అందుబాటులో ఉన్న జాబ్ ప్రొఫైల్స్‌ను చూస్తే.. సంప్రదాయ డిగ్రీ కోర్సులు మొదలు టెక్ గ్రాడ్యుయేట్ల వరకూ.. అన్ని రకాల అర్హతలున్న వారికి ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి. పదో తరగతి నుంచి ప్రొఫెషనల్ డిగ్రీ వరకూ.. ప్రతి ఒక్కరికీ అవకాశాలకు వేదికగా ఈ-కామర్స్ రంగం నిలుస్తోంది. ఎంబీఏ చేసిన వారికి ఉన్నత స్థాయి ఉద్యోగాలు లభిస్తున్నాయి.

## ఏఐ నిపుణులకు డిమాండ్

ఈ-కామర్స్ రంగంలో ఏఐ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) టెక్నాలజీ ఆధారిత కార్యకలాపాలు ఊపందుకుంటున్నాయి. దాంతో ఏఐ, మెషీన్ లెర్నింగ్ నైపుణ్యాలున్న వారి కోసం సంస్థలు అన్వేషిస్తున్నాయి. ప్రముఖ ఈ-కామర్స్ సంస్థలు.. ఐఐటీలు వంటి టాప్ ఇన్‌స్టిట్యూట్స్‌లో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ నిర్వహించి ఏఐ నిపుణుల నియామకాలు చేపడుతున్నాయి. రోబోటిక్ స్కిల్స్ ఉన్న వారికి ప్రాధాన్యం లభిస్తోంది.

## డేటా అనలిటిక్స్

ఈ-కామర్స్ రంగంలో వినియోగదారుల డేటాను క్రోడీకరించి వారికి అవసరమైన పర్సనలైజ్డ్ ప్రొడక్ట్స్‌ను గుర్తించడం కీలకంగా మారింది. అందుకే వినియోగదారులకు ఎప్పటికప్పుడు కొత్త ప్రొడక్ట్‌ల గురించి తెలియజేసి.. వారిని ఆకట్టుకోవడం ద్వారా వ్యాపార కార్యకలాపాలు విస్తరించేలా సంస్థలు ప్రణాళికలు రూపొందిస్తున్నాయి. ఈకామర్స్ విభాగాల్లో కొలువుల పరంగా డేటా అనలిటిక్స్ నిపుణులకు ఇటీవల కాలంలో ప్రాధాన్యం పెరుగుతోంది. ముఖ్యంగా డేటాఅనలిటిక్స్, డేటాసైన్స్ విభాగాల్లో ప్రత్యేక కోర్సులు, సర్టిఫికేషన్లు చేసిన వారికి ఈ-కామర్స్ సంస్థలు పెద్ద పీట వేస్తున్నాయి. ఎంట్రీ లెవల్‌లోనే డేటా అనలిస్ట్‌లకు రూ.మూడు లక్షల నుంచి రూ.నాలుగు లక్షల వార్షిక వేతనం లభిస్తోంది.

## పదో తరగతి అర్హతతోనే

ఈ-కామర్స్ సంస్థల్లో ఆన్‌లైన్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్; ఎస్ఈఓ, ఎస్ఈఎం; డెలివరీ అసోసియేట్స్; ప్యాకర్స్; లాజిస్టిక్స్ ఎగ్జిక్యూటివ్స్, మేనేజర్స్; ఫోన్ బ్యాంకింగ్ ఎగ్జిక్యూటివ్స్; కస్టమర్ రిలేషన్ ఎగ్జిక్యూటివ్స్; వేర్‌హౌస్ సూపర్‌వైజర్స్/మేనేజర్స్, డెలివరీ హబ్ మేనేజర్స్ వంటి ఉద్యోగాలు లభిస్తున్నాయి. సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, ప్యాకర్స్,ఫోన్ బ్యాంకింగ్ ఎగ్జిక్యూటివ్స్, కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజర్/కస్టమర్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్ వంటి ఉద్యోగాలకు పదోతరగతి మొదలు సంప్రదాయ బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణుల వరకూ అందరూ అర్హులే. కోర్ సెక్టార్‌లోని లాజిస్టిక్స్, డేటా అనలిస్ట్స్ వంటి విభాగాల్లో ఉద్యోగాలకు సంబంధిత అర్హతలున్న వారికి సంస్థలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. ప్రారంభంలో 15వేల వేతనం దక్కుతోంది. నైపుణ్యాలుంటే కోర్ విభాగాల్లో నెలకు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు వేతనం అందుకోవచ్చు.

## సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామర్స్, డెవలపర్స్

కంప్యూటర్ ప్రోగ్రామింగ్ ఆధారంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఈ-కామర్స్ సంస్థల్లో ఇప్పుడు సాఫ్ట్‌వేర్ డెవలపర్స్, ప్రోగ్రామర్స్‌కు డిమాండ్ పెరుగుతోంది. కోడింగ్, ప్రోగ్రామింగ్, కంప్యూటర్ లాంగ్వేజ్ నైపుణ్యాలు ఉన్న వ్యక్తులకు సాఫ్ట్‌వేర్ డెవలపర్స్‌గా, ఎగ్జిక్యూటివ్స్‌గా సంస్థలు నియమించుకుంటున్నాయి. ఎంట్రీ లెవల్‌లోనే సగటున రూ. నాలుగు లక్షల వార్షిక వేతనం అందుతోంది.

## వెబ్ డెవలపర్స్

ఈ-కామర్స్ సంస్థల్లో ఉద్యోగాలు లభిస్తున్న మరో విభాగం.. వెబ్ డెవలప్‌మెంట్. ఏ సంస్థ అయినా వినియోగదారులను ఆకట్టుకోవాలంటే.. ముందుగా సదరు సంస్థ వెబ్‌సైట్ ఆకర్షణీయంగా ఉండాలి. ఇందుకోసం వెబ్ డిజైనర్స్, డెవలపర్స్, వెబ్ పేజ్ అడ్మినిస్ట్రేటర్స్‌కు డిమాండ్ నెలకొంది. వీరికి ప్రారంభంలో రూ.మూడు లక్షల వరకు వార్షిక వేతనం లభిస్తోంది.

## కోర్సులు

- ఈ-కామర్స్ రంగంలో లభిస్తున్న కొలువులు, వాటికి అవసరమైన అర్హతలను పరిగణనలోకి తీసుకుంటున్న ఇన్‌స్టిట్యూట్‌లు ప్రత్యేక కోర్సులను అందిస్తున్నాయి.
- ప్రముఖ బీ-స్కూల్స్ తాము అందిస్తున్న పీజీ ప్రోగ్రామ్‌లలో ఈ-కామర్స్‌ను ఒక సబ్జెక్ట్‌గా బోధిస్తున్నాయి.
- కోర్ టెక్నాలజీస్ పరంగా బీటెక్ స్థాయిలో పలు ఇన్‌స్టిట్యూట్‌లు ఏఐఎంఎల్‌కు సంబంధించి కోర్సును అందిస్తున్నాయి.
- ఐఐఎంలు, ఐఐటీల్లో సైతం ఏఐఎంఎల్, డేటా సైన్స్, డేటా మేనేజ్‌మెంట్, డేటా అనలిటిక్స్‌కు సంబంధించి ప్రత్యేక కోర్సులు అందుబాటులోకి వచ్చాయి.
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఈ-కామర్స్ సంస్థ.. ఏడాది వ్యవధిలో పీజీ డిప్లొమా ఇన్ ఈ-కామర్స్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌ను ఆన్‌లైన్ విధానంలో అందిస్తోంది.
- వీటితోపాటు పలు ప్రముఖ ఆన్‌లైన్ సర్టిఫికేషన్ సంస్థలు సైతం ఈ విభాగాల్లో ఆన్‌లైన్ కోర్సులను అందిస్తున్నాయి.

## స్టార్టప్‌లకు ప్రోత్సాహం

స్టార్టప్ సంస్థలకు ప్రోత్సాహకాలు అందిస్తామని తాజాగా కేంద్ర బడ్జెట్‌లో పేర్కొనడంతో ఈ-కామర్స్ రంగానికి మరింత ఊతం లభించనట్లు అయింది. స్టార్టప్ కంపెనీల్లో దాదాపు సగం సంస్థలు ఈ-కామర్స్ లేదా బీటుబీ, బీటుసీ విధానంలో ఆన్‌లైన్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఇదే ఈ-కామర్స్ రంగంలో లక్షల ఉద్యోగాల కల్పనకు కారణమవుతోంది. మొత్తంగా చూస్తే రానున్న మూడేళ్లలో ఈ-కామర్స్ రంగం యువతకు కొలువుల కామధేనువుగా మారుతుందనడంలో ఎలాంటి సందేహం లేదని ఈ రంగంలోని నిపుణులు భరోసా వ్యక్తం చేస్తున్నారు. కాబట్టి అభ్యర్థులు ఈ రంగంలో కొలువులు దక్కించుకోవడానికి అవసరమైన కోర్సులు, కొత్త నైపుణ్యాలు సొంతం చేసుకోవాలని సూచిస్తున్నారు.



### ఈ-కామర్స్ నియామకాలు.. ముఖ్యాంశాలు

- రానున్న మూడేళ్లలో పది లక్షలకు పైగా ఉద్యోగాలు.
- ఏఐ, ఎంఎల్; డేటా అనలిటిక్స్ విభాగంలో దాదాపు మూడు లక్షల కొలువులు.
- ఎస్ఈఓ, ఎస్ఈఎం విభాగాలకు పెరుగుతున్న డిమాండ్.
- సీఆర్ఎం, ఫోన్ బ్యాంకింగ్ ఆఫీసర్ తదితర జాబ్స్‌కు ప్రారంభంలో రూ.రెండు లక్షల వార్షిక వేతనం.
- కోర్ టెక్నాలజీస్, డేటా అనలిటిక్స్‌లో సగటున రూ.నాలుగు లక్షల వార్షిక వేతనం.
- వెబ్ డెవలపర్స్, వెబ్ అడ్మినిస్ట్రేటర్స్‌కు రూ.2.5 లక్షల సగటు వార్షిక వేతనం
- ఐఐఎంలు, ఐఐటీలు, ఇతర ప్రముఖ బి-స్కూల్స్‌లో ఏఐఎంఎల్, డేటాసైన్స్ విభాగాల్లో కోర్సులు.

### ఈ-కామర్స్ ఉద్యోగాలు.. అవసరమైన నైపుణ్యాలు

- సంబంధిత విభాగంలో అకడమిక్ నైపుణ్యం
- మార్కెట్ పరిస్థితులను విశ్లేషించే సామర్థ్యం
- వినియోగదారుల అభిరుచులను గుర్తించే లక్షణం
- సరికొత్త నైపుణ్యాలను సొంతం చేసుకోగలగడం
- కమ్యూనికేషన్ స్కిల్స్

### టెక్నికల్ విభాగాల్లో డిమాండ్

ఈ-కామర్స్ రంగంలో లక్షల సంఖ్యలో కొలువులు లభిస్తాయనే అంచనాలు ఉన్నాయి. అయితే ఇతర విభాగాలతో పోల్చితే టెక్నికల్ విభాగాల్లో మంచి వేతనాలు సొంతం చేసుకోవచ్చు. మార్కెటింగ్, ముఖ్యంగా డిజిటల్ మార్కెటింగ్‌కు సంబంధించిన నైపుణ్యాలతో ఈకామర్స్ కొలువులు దక్కించుకోవచ్చు. ప్రధానంగా కమ్యూనికేషన్ స్కిల్స్, ఎస్ఈఎం, ఎస్ఈఓ నైపుణ్యాలు సొంతం చేసుకుంటే.. కొలువులు లభిస్తాయి.

-ఉమేశ్ సింగ్,
టాలెంట్ అక్విజిషన్ లీడ్, ఫ్లిప్‌కార్ట్

---





## యూపీఎస్సీ-53

న్యూఢిల్లీలోని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ).. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 53 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** సైంటిస్ట్-బి (జియో ఫిజిక్స్-2, ఫిజిక్స్-2, కెమిస్ట్రీ-1), అసిస్టెంట్ జియోఫిజిసిస్ట్-17, సీనియర్ డివిజనల్ మెడికల్ ఆఫీసర్-10, సిస్టమ్ అనలిస్ట్-5, స్పెషలిస్ట్ గ్రేడ్ 3-6, లెక్చరర్-1, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్-9.
- **అర్హత:** పోస్టును బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ, ఎంబీబీఎస్, ఎండీ/ఎంఎస్ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.25
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 27, 2020
- **వెబ్‌సైట్:** www.upsc.gov.in

## ఢిల్లీ హైకోర్ట్-132

న్యూఢిల్లీలోని హైకోర్ట్ ఆఫ్ ఢిల్లీ.. 132 జూనియర్ జ్యుడీషియల్ అసిస్టెంట్/రిస్టోర్టర్ (గ్రూప్-సీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణతతో పాటు టైపింగ్ స్కిల్స్ ఉండాలి.
- **వయసు:** జనవరి 1, 2020 నాటికి 18-27 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** ప్రిలిమినరీ, మెయిన్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.600
- **దరఖాస్తులు ప్రారంభం:** ఫిబ్రవరి 19, 2020
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 11, 2020
- **వెబ్‌సైట్:** http://delhihighcourt.nic.in

## ఏఏఎస్ఎల్-51

ఎయిరిండియా లిమిటెడ్ అనుబంధ సంస్థ అయిన ఎయిర్‌లైన్ అలైడ్ సర్వీసెస్ లిమిటెడ్ (ఏఏఎస్ఎల్).. ఒప్పంద ప్రాతిపదికన 51 సూపర్‌వైజర్ (సెక్యూరిటీ) పోస్టుల భర్తీకి అర్హులైన స్త్రీ, పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** ఏదైనా గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణతతో పాటు సంబంధిత టెక్నికల్ సర్టిఫికెట్లు, నిర్దిష్ట శారీరక ప్రమాణాలతో పాటు స్థానిక భాష వచ్చి ఉండాలి.
- **వయసు:** ఫిబ్రవరి 15, 2020 నాటికి 33 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** సంబంధిత టెక్నికల్ అంశాలపై రాతపరీక్ష ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 4, 2020
- **వెబ్‌సైట్:** www.airindia.in

## నిమ్‌హాన్స్-7

బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్ (నిమ్‌హాన్స్).. ఒప్పంద ప్రాతిపదికన 7 డ్యూటీ మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** ఎంబీబీఎస్ డిగ్రీ ఉత్తీర్ణత, నిర్దిష్ట అనుభవం ఉండాలి.
- **వయసు:** 40 ఏళ్లకు మించకూడదు.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.590
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 28, 2020
- **వెబ్‌సైట్:** http://nimhans.ac.in

## అప్రెంటీస్

### ఎస్ఏసీ-13

అహ్మదాబాద్ (గుజరాత్)లోని ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్‌కు చెందిన స్పేస్ అప్లికేషన్ సెంటర్ (ఎస్ఏసీ).. 13 ట్రేడ్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాలు:** కంప్యూటర్ ఆపరేటర్, కార్పెంటర్, డ్రాఫ్ట్స్‌మెన్, ఫిట్టర్, టర్నర్, పెయింటర్, ఎలక్ట్రీషియన్ తదితర విభాగాలున్నాయి.
- **అర్హత:** పదోతరగతితో పాటు సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణత.
- **వయసు:** ఫిబ్రవరి 21, 2020 నాటికి 35 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** అకడమిక్ మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 21, 2020
- **వెబ్‌సైట్:** www.sac.gov.in

### ఎన్‌పీఓఎల్ (డీఆర్‌డీఓ)-41

డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ)కి చెందిన కొచ్చిలోని నేవల్ ఫిజికల్ అండ్ ఓషినోగ్రఫిక్ ల్యాబొరేటరీ (ఎన్‌పీఓఎల్).. 41 అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** ఫిట్టర్-4, టర్నర్-2, మెషినిస్ట్-3, డ్రాఫ్ట్స్‌మెన్-11, టూల్ అండ్ డై మేకర్-1, ఇంజక్షన్ మౌల్డింగ్ మెషిన్ ఆపరేటర్-1, వెల్డర్-2, ఎలక్ట్రానిక్ మెకానిక్-6, ఎలక్ట్రీషియన్-3, సీఓపీఏ-3, సెక్రటేరియల్ అసిస్టెంట్-1, ఫ్రంట్ ఆఫీస్ అసిస్టెంట్-4.
- **అర్హత:** సంబంధిత ట్రేడుల్లో ఐటీఐ ఉత్తీర్ణత.
- **ఎంపిక:** టెస్ట్/పర్సనల్ ఇంటరాక్షన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఈ-మెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **రిజిస్ట్రేషన్‌కు చివరితేదీ:** మార్చి 6, 2020
- **వెబ్‌సైట్:** www.drdo.gov.in

## కెరీర్ కౌన్సెలింగ్

నేటి టెక్నాలజీ యుగంలో కోర్సులు, కొలువులు, కెరీర్స్ రూపరేఖలు వేగంగా మారిపోతున్నాయి. రోజుకో టెక్నాలజీ తెరపైకి వస్తోంది. ఎన్నో రకాల ఉద్యోగాలు.. రకరకాల కోర్సులు.. విభిన్న నైపుణ్యాలు.. ఇలాంటి పరిస్థితుల్లో ప్రస్తుతం జాబ్ మార్కెట్ ట్రెండ్ ఎలా ఉంది.. ఏ కోర్సు చేస్తే.. ఎలాంటి ఉద్యోగం లభిస్తుంది.. భవిష్యత్ అవకాశాలు ఎలా ఉంటాయి.. ఇలా కెరీర్ ఎంపికలో మీ సందేహాలకు నిపుణులు సమాధానాలు ఇస్తారు.

మీరు చేయాల్సిందల్లా.. మీ సందేహాలను sakshieducation@gmail.comకు మెయిల్ చేయడమే!!


టెట్/డీఎస్సీ
- స్టడీ మెటీరియల్
- బిట్‌బ్యాంక్ ▸ జీకే
- ఆన్‌లైన్ టెస్టులు
- మోడల్ పేపర్స్
- కరెంట్ అఫైర్స్
- ప్రీవియస్ పేపర్స్

వీడియో గైడెన్స్ మొదలైనవి.
విద్య, ఉద్యోగ సమాచారం కోసం
WWW.SAKSHIEDUCATION.COM
SAKSHI CURRENT AFFAIRS యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి



నేటి టాబ్లాయిడ్ విద్య పేజీల్లో...
10th Class
SRIGAYATRI EDUCATIONAL INSTITUTIONS
PHYSICS


## ప్రవేశాలు

### టీఎస్ గురుకులాల్లో ప్రవేశాలు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేజీ టు పీజీ మిషన్‌లో భాగంగా సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, వెనుకబడిన తరగతుల సంక్షేమ, విద్యాశాఖల గురుకుల పాఠశాలల్లో 2020-21కి సంబంధించి ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- **ఎంపిక:** ఉమ్మడి ప్రవేశ పరీక్ష ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.100
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 1, 2020
- **పరీక్ష తేదీ:** ఏప్రిల్ 12, 2020
- **వెబ్‌సైట్:** www.tswreis.in

### ఎన్ఐఏ-పీజీడీఎం 2020

పుణెలోని భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన నేషనల్ ఇన్సూరెన్స్ అకాడమీ (ఎన్ఐఏ) 2020-22కి గాను పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ (పీజీడీఎం) ప్రోగ్రాములో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణత, క్యాట్ 2019 లేదా సీమ్యాట్ 2020 స్కోర్.
- **వయసు:** జులై 1, 2020 నాటికి 28 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** అకడమిక్ ప్రతిభ, క్యాట్ 2019 లేదా సీమ్యాట్ 2020 స్కోర్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 15, 2020
- **వెబ్‌సైట్:** http://niapune.org.in

### స్పా-విజయవాడలో ప్రవేశాలు

విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (స్పా) 2020-21 విద్యా సంవత్సరానికి గాను పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రాముల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

1. పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్స్ ఇన్ ఆర్కిటెక్చర్
   - **కాల వ్యవధి:** రెండేళ్లు
   - **మొత్తం సీట్లు:** 25
   - **(ఏ) స్పెషలైజేషన్లు:** సస్టెయినబుల్ ఆర్కిటెక్చర్, ల్యాండ్ స్కేప్ ఆర్కిటెక్చర్, ఆర్కిటెక్చరల్ కన్జర్వేషన్.
   - **(బి) మాస్టర్ ఆఫ్ బిల్డింగ్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్**
2. ఫుల్ టైమ్ పీహెచ్‌డీ ప్రోగ్రాములు
   - **అర్హత:** పీజీ ప్రోగ్రాములకు సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్ డిగ్రీ, పీహెచ్‌డీ ప్రోగాములకు ప్లానింగ్/ఆర్కిటెక్చర్ సబ్జెక్టుల్లో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణత, గేట్/జేఆర్ఎఫ్ /సీడ్ స్కోర్ ఉండాలి.

- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** పీహెచ్‌డీ ప్రోగ్రాములకు జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.3000, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులకు రూ.2000; పీజీ ప్రోగ్రాములకు జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.2000, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులకు రూ.1000;
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 6, 2020
- **వెబ్‌సైట్:** www.spav.ac.in

# ఆప్.. మళ్లీ స్వీప్



## ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఘన విజయం

- 70 సీట్లకు గానూ 62 స్థానాల్లో గెలుపు
- 8 సీట్లకు బీజేపీ పరిమితం; ఖాతా తెరవని కాంగ్రెస్

న్యూఢిల్లీ

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్ మరోసారి ఘన విజయం సాధించింది. మొత్తం 70 స్థానాలకు గానూ 62 సీట్లలో విజయ కేతనం ఎగరేసింది. బీజేపీని 8 స్థానాలకు పరిమితం చేసింది. గతంలో వరుసగా మూడుసార్లు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన కాంగ్రెస్ ఈసారి ఖాతా తెరవలేకపోయింది. ఈ ఎన్నికల్లో ఆప్‌కు 53.57%, బీజేపీకి 38.51%, కాంగ్రెస్‌కు 4.26% ఓట్లు లభించాయి. 2015 ఎన్నికల్లో ఆప్ 54.34% ఓట్లు సాధించింది. సీఎంగా కేజ్రీవాల్ ఫిబ్రవరి 14న ప్రమాణంచేస్తారని సమాచారం. ఢిల్లీ ఎన్నికల్లో విజయం సాధించిన ఆప్‌కు, ఆ పార్టీ చీఫ్ కేజ్రీవాల్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు.

> ఢిల్లీ ప్రజలు 'పని' రాజకీయానికి పట్టం కట్టారు. విద్వేష వ్యాఖ్యలను, వెకిలి రాజకీయాలను 'చీపురు'తో ఊడ్చేశారు. అభివృద్ధి వైపే తామున్నామని 'నొక్కి' వక్కాణించారు. సామాన్యుడి కోసం పనిచేసే 'ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)'ని మరోసారి అందలమెక్కించారు. బీజేపీ హై ఓల్టేజీ ప్రచారాన్ని 'ఒకే ఒక్కడు'గా ఎదుర్కొన్న అరవింద్ కేజ్రీవాలే ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోవాలని స్పష్టమైన తీర్పునిచ్చారు.

### లోక్‌సభ మీకు.. అసెంబ్లీ 'ఆప్'కు

దాదాపు 8 నెలల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వెల్లడైన ఫలితాలకు పూర్తి విరుద్ధమైన తీర్పును ఈ ఎన్నికల్లో ఢిల్లీ ప్రజలు ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీ పరిధిలోని 7 స్థానాలనూ బీజేపీ గెల్చింది. ప్రస్తుతం పౌరసత్వ సవరణ చట్టాన్ని(సీఏఏ) వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున నిరసనలు చోటు చేసుకుంటున్న సందర్భంలో జరిగిన ఈ ఎన్నికల్లో బీజేపీ ఆ ఆందోళనలపైనే ప్రచారంలో దృష్టి పెట్టింది. ఆ ఆందోళనలు పాక్ అనుకూల, ఆప్, కాంగ్రెస్ ప్రాయోజిత కార్యక్రమాలను ప్రచారం చేసింది. ప్రధాని మోదీ సహా ప్రచారంలో పాల్గొన్న అగ్ర నేతలంతా ఆ ఆందోళనలకు కేంద్ర స్థానంగా నిలిచిన షహీన్‌బాఘ్ అంశాన్ని ప్రతీ సభలోనూ ప్రస్తావించారు. కేంద్రం ప్రారంభించిన సంక్షేమ పథకాలను కేజ్రీవాల్ ఢిల్లీ ప్రజలకు అందనివ్వడం లేదని మోదీ ఆరోపించారు కూడా.

అయితే, ఢిల్లీ ప్రజలు ఈ అంశాల కన్నా గత ఐదేళ్లలో కేజ్రీవాల్ నేతృత్వంలో ఆప్ తమకందించిన సౌకర్యాలను పరిగణనలోకి తీసుకున్నట్లు ఈ ఫలితాల ద్వారా అర్థమవుతోంది. ఆప్ చేపట్టిన విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు, ప్రజా రవాణా రంగాల్లో సంస్కరణలు, సామాన్యుడిపై ఆర్థిక భారం తగ్గించే పథకాలు సామాన్యుల మనసు దోచాయి. కేజ్రీవాల్ తన ప్రచారంలోనూ ప్రధానంగా గత ఐదేళ్లలో తమ ప్రభుత్వం సాధించిన విజయాలనే వివరించారు. కాగా, కేంద్రం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సీఏఏ, ఎన్నార్సీ, ఎన్పీఆర్‌లపై వ్యతిరేకత కూడా ఫలితాలపై ప్రభావం చూపింది. సీఏఏ వ్యతిరేక నిరసనల కేంద్రమైన షహీన్ బాఘ్ ఉన్న ఓఖ్లా నియోజకవర్గంలో ఆప్ అభ్యర్థి అమానతుల్లా ఖాన్ సమీప బీజేపీ అభ్యర్థిపై 81 వేల అత్యంత భారీ మెజారిటీతో గెలుపొందారు. ఆప్ నుంచి గెలిచిన ప్రముఖుల్లో సీఎం అభ్యర్థి కేజ్రీవాల్, ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, రాఘవ్ చద్దా, అతిష్థి, గోపాల్ రాయ్, సత్యేంద్ర జైన్ తదితరులున్నారు. న్యూఢిల్లీ స్థానం నుంచి కేజ్రీవాల్ బీజేపీ అభ్యర్థి సునీల్ కుమార్ యాదవ్‌పై గెలుపొందారు.

### మూడోసారి సీఎం పీఠంపై..

ఈ ఎన్నికల్లో ఘన విజయంతో మూడోసారి సీఎం కుర్చీపై కేజ్రీవాల్ కూర్చోబోతున్నారు. తొలిసారి 2013 డిసెంబర్ 28న కాంగ్రెస్ మద్దతుతో మైనారిటీ ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రిగా కేజ్రీవాల్ ప్రమాణ స్వీకారం చేశారు. కానీ, 49 రోజులు మాత్రమే అధికారంలో ఉండి 2014, ఫిబ్రవరి 14న రాజీనామా చేశారు. ఆ తరువాత, 2015లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ 67 సీట్లతో దాదాపు క్లీన్‌స్వీప్ చేసింది. బీజేపీ 3 సీట్లలో మాత్రమే గెలుపొందింది.

### సంబరాలు.. అభినందనలు

తాజా విజయంతో ఆప్ శ్రేణులు ఢిల్లీ వ్యాప్తంగా సంబరాలు జరుపుకున్నాయి. ఆప్ ప్రధాన కార్యాలయాన్ని నీలి, తెలుపు బెలూన్లతో అలంకరించారు. ఈ ఘనవిజయం పట్ల కేజ్రీవాల్‌ను పశ్చిమబెంగాల్ సీఎం, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, శరద్ పవార్(ఎన్సీపీ), నవీన్ పట్నాయక్(బీజేడీ), స్టాలిన్(డీఎంకే) తదితర నేతలు అభినందనలు తెలిపారు. ఇంతకంటే గొప్ప జన్మదిన బహుమతి ఏముంటుందని మంగళవారం బర్త్‌డే జరుపుకుంటున్న కేజ్రీవాల్ భార్య సునీత కేజ్రీవాల్ ఆనందం వ్యక్తం చేశారు. భారతదేశ ఆత్మను కాపాడిన ఢిల్లీ ఓటర్లకు కృతజ్ఞతలని రాజకీయ వ్యూహకర్త, ఈ ఎన్నికల్లో ఆప్ విజయం కోసం వ్యూహ రచన చేసిన ప్రశాంత్ కిషోర్ ట్వీట్ చేశారు.

### ప్రజా తీర్పును ఆమోదిస్తున్నాం

ఢిల్లీ ప్రజలిచ్చిన తీర్పును ఆమోదిస్తున్నామని బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా పేర్కొన్నారు. ప్రతిపక్షంగా బీజేపీ క్రియాశీల పాత్ర పోషిస్తుందన్నారు. పార్టీ గెలుపు కోసం శ్రమించిన పార్టీ కార్యకర్తలకు నడ్డా కృతజ్ఞతలు తెలిపారు. ఢిల్లీ ప్రజలు జాగ్రత్తగా ఆలోచించే ఈ తీర్పు ఇచ్చారని బీజేపీ ఢిల్లీ చీఫ్ మనోజ్ తివారీ వ్యాఖ్యానించారు. తమ ఓటు శాతం 32% నుంచి 38 శాతానికి పెరిగిందని గుర్తు చేశారు. అపజయాన్ని అంగీకరించిన కాంగ్రెస్.. పార్టీ పునరుత్తేజానికి పునరంకితం అవుతామని పేర్కొంది. ఈ ఎన్నికల్లో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాల విష పూరిత ప్రచారం ఓడిపోయిందని వ్యాఖ్యానించింది.

## 'ఆప్'రేషన్ సప్తపది

01 గ్యారంటీ కార్డులు
02 విద్యారంగంలో సంస్కరణలు
03 పాజిటివ్ ప్రచారం
04 గుజరాత్ X ఢిల్లీ మోడల్ అభివృద్ధి
05 ఏకే, పీకే కాంబినేషన్
06 హిందుత్వపై సామరస్య ధోరణి
07 బీజేపీ, కాంగ్రెస్ ఫెయిల్యూర్ స్టోరీ

**గ్యారంటీ కార్డులు**
అయిదేళ్లలో ఢిల్లీలో తాను చేపట్టిన అభివృద్ధిని చాటి చెబుతూనే సంక్షేమ కార్యక్రమాలను భవిష్యత్‌లో కొనసాగిస్తామంటూ కేజ్రీవాల్ ఎన్నికల మేనిఫెస్టోకి ముందే గ్యారంటీ కార్డుల్ని విడుదల చేశారు. ప్రజలకి మొత్తం 10 అంశాల్లో గ్యారంటీ ఇచ్చారు. నెలకు 200 యూనిట్ల ఫ్రీ విద్యుత్, 20 వేల లీటర్లు ఉచితంగా నీళ్లు, మహిళలు, విద్యార్థులకి బస్సుల్లో ఉచిత ప్రయాణం, సీనియర్ సిటిజన్లకు ఉచిత తీర్థయాత్రలు తదితర హామీలు సీఎం పీఠంపై కూర్చోబెట్టాయి.

**విద్యారంగంలో..**
ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల పెంచడానికి గత అయిదేళ్లుగా అనుమతినివ్వలేదు. గత మూడేళ్లుగా వార్షిక బడ్జెట్‌లో 25శాతానికిపైగా విద్యా రంగంపైనే ఖర్చు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మార్పులు తీసుకువచ్చారు. మౌలిక సదుపాయాల కల్పన దగ్గర నుంచి టీచర్ ట్రైనింగ్ వరకు ప్రత్యేక శ్రద్ధ చూపించారు. పాఠశాలల్లో జరిగే ప్రతీ అంశంలోనూ పిల్లల తల్లిదండ్రుల్ని భాగస్వాముల్ని చేశారు.

**పాజిటివ్ ప్రచారం**
2015 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కేజ్రీవాల్ విజయ దుందుభి మోగించాక జాతీయ స్థాయిలో మోదీకి ప్రత్యామ్నాయంగా ఎదగాలని భావించారు. తాను ఏం చేస్తున్నానో పాజిటివ్ ప్రచారాన్ని ప్రారంభించారు. కేజ్రీవాల్ వంటి అరాచకవాదులు, ఉగ్రవాదులు దేశంలో దాక్కొని ఉంటారంటూ బీజేపీ ఎంపీ పర్వేష్ వంటి నాయకులు నోరు పారేసుకున్నా సంయమనం పాటించారు. ఆప్ గెలిస్తే తన ఆధ్వర్యంలో అవినీతిరహిత పాలన కొనసాగుతుందని విస్తృతంగా ప్రచారం చేశారు. సామాజిక మాధ్యమాల్లో కూడా బీజేపీని మించిపోయి ఆప్ చేసిన ప్రచారమే హోరెత్తింది.

**గుజరాత్ వర్సెస్ ఢిల్లీ మోడల్ అభివృద్ధి**
అభివృద్ధిలో మోదీ కంటే తాను ఒక అడుగు ముందే ఉన్నానని నిరూపించడానికి కేజ్రీవాల్ పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గుజరాత్ మోడల్ అభివృద్ధిని ఎలాగైతే ప్రచారం చేసిందో, అదే స్థాయిలో ఢిల్లీ మోడల్ అభివృద్ధిని ప్రచారం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుపరచడం, ప్రజారోగ్యం కోసం ఏర్పాటు చేసిన మొహల్లా క్లినిక్‌లలో ఉచిత చికిత్స, వైద్య పరీక్షలు, పారదర్శక పరిపాలన, చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టుల్ని తక్కువ సమయంలో, అంచనా వేసిన దానికంటే తక్కువ వ్యయంతో పూర్తి చేయడం వంటివాటితో ఢిల్లీ మోడల్ అభివృద్ధిని పాపులర్ చేశారు.

**ఏకే, పీకే కాంబినేషన్**
అరవింద్ కేజ్రీవాల్ (ఏకే), ప్రశాంత్ కిశోర్ (పీకే) వీరిద్దరి కాంబినేషన్ ఢిల్లీ ఎన్నికల దశను మార్చేసింది. ఆమ్ ఆద్మీ పార్టీ ఆవిర్భవించాక ఇప్పటివరకు ఆరు ఎన్నికల్ని ఎదుర్కొంది. రెండు లోక్‌సభ, మూడు అసెంబ్లీ, ఒక స్థానిక ఎన్నికల్లో పోటీ చేసింది. అయితే మొట్టమొదటిసారిగా ప్రశాంత్ కిశోర్‌కి చెందిన ఐపాక్ ఏజెన్సీని ఎన్నికల వ్యూహకర్తగా ఆప్ నియమించుకుంది. గ్యారంటీ కార్డుల విడుదల , కేజ్రీవాల్ స్వయంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం సాధించిన విజయాలను వివరించడం, టౌన్ హాల్స్‌లో సమావేశాలు ఏర్పాటు చేసి ముఖ్యమంత్రితో ముఖాముఖి కార్యక్రమాలు పార్టీకి అత్యంత అనుకూలంగా మారాయి.

**హిందుత్వపై సామరస్య ధోరణి**
హిందూ ఓట్లను నష్టపోకూడదనుకున్న కేజ్రీవాల్ పౌరసత్వ సవరణ చట్టానికి (సీఏఏ) వ్యతిరేకంగా షహీన్ బాగ్‌లో జరిగిన నిరసనలపై ఆచితూచి వ్యవహరించారు. తొలిసారిగా ముఖ్యమంత్రి తీర్థయాత్ర కార్యక్రమం కింద తొలి రైలుని ప్రారంభించారు. వైష్ణోదేవి ఆలయం, మథుర, రిషికేష్ వంటి పుణ్యక్షేత్రాలను సందర్శించాలనుకునే సీనియర్ సిటిజన్లకు ఉచిత ప్రయాణం, వసతి, భోజన సదుపాయాలు కల్పించారు. హనుమాన్ చాలీసా చదివితే మనసు ప్రశాంతంగా ఉంటుందంటూ ఎన్నికలకు ముందు ఒక వీడియో విడుదల చేశారు. కేజ్రీవాల్ హనుమాన్ చాలీసా చదువుతున్న ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పోలింగ్‌కు ఒక రోజు ముందు కుటుంబ సభ్యులతో కలిసి హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు.

**బీజేపీ, కాంగ్రెస్ ఫెయిల్యూర్ స్టోరీ**
కాంగ్రెస్ పార్టీ ముందే ఓటమి ఖాయమని తెలిపోవడంతో ప్రచారంపై దృష్టి సారించలేదు. బీజేపీ తొలి దశలో ఆప్ చేసిన అభివృద్ధి ఏమీ లేదని, అదంతా డొల్లేనని ప్రచారం చేసింది. తర్వాత వ్యూహాన్ని మార్చుకొని జాతీయవాదాన్నే మళ్లీ ఎజెండాగా తీసుకుంది. స్థానిక సమస్యలకు బదులుగా పౌరసత్వ సవరణ చట్టానికి (సీఏఏ) వ్యతిరేకంగా షహీన్‌బాగ్‌లో కొనసాగుతున్న నిరసన ప్రదర్శనల్ని ప్రచారాస్త్రంగా చేసుకుంది. అయినా అవేవీ కేజ్రీవాల్‌కి ఉన్న క్రేజ్ ముందు నిలబడలేకపోయాయి.

## కేజ్రీవాల్.. ఫిబ్రవరి 14!

కేజ్రీవాల్ జీవితానికి ఫిబ్రవరి 14కి ఆసక్తికర బంధముంది. తొలిసారి సీఎంగా బాధ్యతలు చేపట్టాక 49 రోజుల తర్వాత ఫిబ్రవరి 14ననే ఆయన రాజీనామా చేశారు. 2015లో గెలిచాక ఫిబ్రవరి 14వ తేదీనే ఆయన సీఎంగా ప్రమాణం చేశారు. ఇప్పుడు ముచ్చటగా మూడోసారి సీఎంగా ప్రమాణం చేయబోయేదీ ఫిబ్రవరి 14వ తేదీననే అని సమాచారం. కేజ్రీవాల్‌ది ప్రేమ వివాహం.

### ఎగ్జిట్ పోల్స్ నిజం!

ఆప్ గెలుస్తుందన్న ఎగ్జిట్‌పోల్స్ అంచనాలకు అనుగుణంగానే ఢిల్లీలో ఆప్ విజయం సాధించింది. ఇండియాటుడే-యాక్సిస్, ఏబీపీ-సీ ఓటర్, టీవీ9 భరత్‌వర్ష్‌లు అంచనా వేసినట్లే సీట్లు వచ్చాయి. ఇండియా టుడే-యాక్సిస్ సర్వే ఆప్‌కి 59-68 సీట్లు వస్తాయని వెల్లడించింది. బీజేపీకి 2 నుంచి 11 సీట్లొస్తాయని చెప్పింది. ఏబీపీ-సీ ఓటర్ ఆప్‌కి 49 నుంచి 63 స్థానాలూ, బీజేపీకి 5 నుంచి 19 స్థానాలూ వస్తాయని చెప్పింది. ఇక టీవీ 9 భరత్‌వర్ష్ అంచనాల ప్రకారం ఆప్‌కి 52 నుంచి 64, బీజేపీకి 6 నుంచి 16 స్థానాలు వస్తాయని వెల్లడించింది.



## 'పని రాజకీయం' పురుడు పోసుకుంది!

అరవింద్ కేజ్రీవాల్ వ్యాఖ్య

న్యూఢిల్లీ: ఎన్నికల్లో ఘనవిజయం అందించిన ఢిల్లీ ప్రజలకు ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ కృతజ్ఞతలు తెలిపారు. ఆప్ విజయాన్ని భరత మాత విజయంగా అభివర్ణించారు. ఢిల్లీ ప్రజలు తనను పెద్ద కొడుకుగా ఆదరించి ఈ విజయాన్ని అందించారన్నారు. 'ఢిల్లీ ప్రజలారా.. మీరు అద్భుతం చేశారు.. ఐ లవ్ యూ' అని పేర్కొన్నారు. పార్టీ ప్రధాన కార్యాలయంలో కార్యకర్తలను ఉద్దేశించి కేజ్రీవాల్ ప్రసంగించారు. 'ఈ రోజు ఢిల్లీ ప్రజలు 'పని రాజకీయం(పాలిటిక్స్ ఆఫ్ వర్క్స్)' అనే కొత్త తరహా రాజకీయ సంస్కృతికి తెర తీశారు' అని కుటుంబ సభ్యులు, పార్టీ నేతలు ఉన్న వేదికపై నుంచి కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు.

**ప్రధాని మోదీ శుభాకాంక్షలు**
ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్‌కు ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు. 'ఆప్‌నకు, ఆ పార్టీ చీఫ్ కేజ్రీవాల్‌కు అభినందనలు. వారు ఢిల్లీ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలని కోరకుంటున్నా' అని మోదీ ట్వీట్ చేశారు.

**అత్యుత్తమ బర్త్‌డే గిఫ్ట్ ఇది: భార్య సునీత**
'అత్యుత్తమ బర్త్‌డే గిఫ్ట్ ఇది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పు కంటే పెద్ద బహుమతి అడగను' అని కేజ్రీవాల్ భార్య సునీత అన్నారు. ఎన్నికల విడుదల రోజైన మంగళవారమే ఆమె పుట్టిన రోజు. ఢిల్లీలోని పార్టీ కార్యాలయంలో భర్త, కొడుకు, కూతురు సమక్షంలో కేక్ కట్‌చేశారు.

## ఢిల్లీ కూడా దక్కలేదు!

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ.. హోంమంత్రి అమిత్ షా..పెద్ద సంఖ్యలో కేంద్రమంత్రులు.. సుమారు 300 మంది ఎంపీలు..గల్లీగల్లీకి తిరిగి ప్రచారం చేపట్టినా బీజేపీకి ఫలితం దక్కలేదు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోదీ రెండు ర్యాలీల్లో ప్రసంగించగా, హోం మంత్రి అమిత్‌షా 60 నియోజకవర్గాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. యూపీ సీఎం ఆదిత్యనాథ్ సహా బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు, 300 మంది ఎంపీలు వచ్చినా ప్రజల మనస్సును మార్చలేకపోయారు. పార్టీ అధ్యక్షుడిగా జేపీ నడ్డా బాధ్యతలు చేపట్టిన తర్వాత జరిగిన మొదటి ఎన్నికలివి. అసెంబ్లీలోని 70 స్థానాలకు గాను 45కు పైగా సీట్లు గెలుచుకుంటామని నడ్డా ధీమా వ్యక్తం చేసినా 8 చోట్ల మాత్రమే గెలవడం ఆ పార్టీకి మింగుడుపడటం లేదు. 1993లో 48 శాతం ఓట్లతో ఢిల్లీ అధికార పగ్గాలు చేపట్టిన బీజేపీ..గత 2015 ఎన్నికల్లో 32 శాతం ఓట్లు మాత్రమే దక్కాయి. ఈసారి మాత్రం ఓట్ల శాతాన్ని 38కి పెంచుకోవడం ఒక విధంగా ఊరట కలిగించే అంశమని ఆ పార్టీ నేతలు అంటున్నారు. మిత్రపక్షాలు జేడీయూ, ఎల్‌జేపీకి వచ్చిన ఓట్లతో కలుపుకుంటే ఇది 40 శాతం వరకు ఉంటుందని బీజేపీ ప్రధాన కార్యదర్శి కైలాశ్ విజయ్‌వర్గీయ తెలిపారు. ఆప్‌కు కేజ్రీవాల్ పెద్ద అండ కాగా ప్రజాదరణ పొందిన స్థానిక నేతలెవరూ లేకపోవడం బీజేపీ వైఫల్యానికి ప్రధాన కారణమనేది కొందరి మాట. కేంద్ర మంత్రి హర్షవర్ధన్ వంటి స్థానిక నేతలను పక్కనబెట్టిన కేంద్ర నాయకత్వం స్థానికేతరుడిగా భావించే మనోజ్ తివారీకి పెద్దపీట వేయడం కూడా ఢిల్లీ శ్రేణులు జీర్ణించుకోలేకపోయాయనే వ్యాఖ్యలు వినవస్తున్నాయి.



'విజయం మమ్మల్ని అహంకారులను చేయదు. అలాగే ఓటమి కుంగదీయదు' అంటూ ఢిల్లీ బీజేపీ ఆఫీసు బయట మంగళవారం వెలసిన ఓ పోస్టర్

## రాజధానిలో రెండోసారి డకౌట్

### కాంగ్రెస్ ఓటు బ్యాంకుని కొల్లగొట్టిన ఆప్

న్యూఢిల్లీ: రాజధాని ఢిల్లీలో ఒకప్పుడు హ్యాట్రిక్ కొట్టిన కాంగ్రెస్ పార్టీ వరసగా రెండోసారి డకౌట్ అయింది. ఒక్క సీటు కూడా సాధించలేక చతికిలపడింది. వాస్తవానికి కాంగ్రెస్ హయాంలోనే ఢిల్లీ అభివృద్ధికి బాటలు పడ్డాయి. 1998-2013 సంవత్సరం మధ్యలో షీలాదీక్షిత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ఢిల్లీ రాజధాని కళను సంతరించుకుంది. అలాంటిది ఆమ్ ఆద్మీ పార్టీ రాజకీయ రంగ ప్రవేశం చేశాక ఆ పార్టీ పునాదుల్నే కదిలించేసింది. చివరికి పౌరసత్వ సవరణ చట్టానికి (సీఏఏ)కి వ్యతిరేకంగా షహీన్‌బాగ్‌లో వెల్లువెత్తిన నిరసనలకు కేవలం కాంగ్రెస్ పార్టీ బహిరంగ మద్దతు తెలిపింది. ఢిల్లీ తాజా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘోరంగా విఫలమైంది. ఈ ఎన్నికల్లో రాష్ట్రీయ జనతాదళ్(ఆర్జేడీ)తో కలసి పోటీ చేసింది. అందులో 66 మంది కాంగ్రెస్ తరపున, మరో నలుగురు ఆర్జేడీ తరపున బరిలో దిగారు. అందులో కాంగ్రెస తరపున పోటీలో నిలిచిన 66 మందిలో 63 మంది అభ్యర్థులు కనీసం 5శాతం ఓట్లు కూడా సాధించలేక డిపాజిట్లు కోల్పోయారు.

## పీకే.. పక్కా వ్యూహకర్త

న్యూఢిల్లీ: ప్రశాంత్ కిశోర్. ఎవరికీ పరిచయం చేయనక్కర్లేని పేరు. ఎన్నో రాజకీయ పార్టీలకు ఎన్నికల వ్యూహకర్తగా తెరవెనుక పని చేసి తనకంటూ ఒక ఇమేజ్ కల్పించుకున్నారు. ఢిల్లీ ఎన్నికల్లో ఆప్ విజయంతో మరోసారి ఆయన పేరు దేశ వ్యాప్త రాజకీయాల్లో మారుమోగిపోతోంది. ప్రశాంత్ కిశోర్‌కు చెందిన ఇండియన్ పొలిటికల్ యాక్షన్ కమిటీ (ఐ-ప్యాక్)తో గత డిసెంబర్‌లో ఆప్ చేతులు కలిపింది. అప్పట్నుంచి ఆప్ ప్రచార ధోరణే మారిపోయింది. బీజేపీ చేసే వ్యతిరేక ప్రచారానికి అసలు బదులివ్వొద్దని, సంయమనం పాటించాలని కేజ్రీవాల్‌కు సూచించింది ప్రశాంత్ కిశోరేనని ఐప్యాక్ వర్గాలు వెల్లడించాయి. అలా పాజిటివ్ ప్రచారంతో ఆప్ విజయభేరి మోగించింది. ఫలితాలు వెలువడగానే ప్రశాంత్ కిశోర్ ''భారత్ ఆత్మను కాపాడడానికి ఒక్కటై నిలిచిన ఢిల్లీవాసులకి ధన్యవాదాలు'' అని ట్వీట్ చేశారు. ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలో ఆప్ సర్కార్ విద్య, ఆరోగ్య రంగాల్లో సాధించిన విజయాలనే ప్రచారంలో హైలైట్ చేశారు. స్విమ్మింగ్ పూల్స్‌తో ఉన్న పాఠశాలలు, మొహల్లా క్లినిక్‌ల గురించి విస్తృతంగా ప్రచారం చేయడమే కాదు, ఆప్ థీమ్ సాంగ్ లగేరహో కేజ్రీవాల్ అనే పాటను బాలీవుడ్ మ్యూజిక్ డైరెక్టర్ విశాల్ దాద్లానీతో దగ్గరుండి ట్యూన్ చేయించి ప్రభుత్వ పథకాలు జనంలోకి వెళ్లేలా చేయడంలో విజయం సాధించారు. ఐపాక్ సంస్థ తొలిసారిగా 2014 లోక్‌సభ ఎన్నికల్లో తెరవెనుక ఎన్నికల వ్యూహాలను రచించింది. అప్పుడు ప్రచారంలో ప్రధాని అభ్యర్థిగా ఉన్న నరేంద్ర మోదీ చాయ్ పే చర్చ కార్యక్రమం రచించింది ప్రశాంత్ కిశోరే.



మంగళవారం ఢిల్లీలో కేజ్రీవాల్‌తో ప్రశాంత్

## కేజ్రీవాల్‌కు ఏపీ సీఎం జగన్ అభినందనలు

సాక్షి, అమరావతి: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అరవింద్ కేజ్రీవాల్ అద్భుతమైన విజయం సాధించినందుకు ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయనకు మంగళవారం ట్వీట్ ద్వారా అభినందనలు తెలిపారు. కేజ్రీవాల్ పదవీకాలం అంతా విజయవంతంగా కొనసాగాలని జగన్ ఆకాంక్షించారు.

## తెలంగాణ సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన ఆప్ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు కేసీఆర్ ఆయనకు అభినందన సందేశం పంపారు. కేజ్రీవాల్ నాయకత్వంలో ఢిల్లీ అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందుతుందని, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు దిగ్విజయంగా అమలవుతాయని ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రజలే కేంద్రంగా ఆలోచించి పాలన చేస్తే ప్రజాభిమానం పొందుతారనడానికి కేజ్రీవాల్ విజయం ఓ ఉదాహరణ అని సీఎం పేర్కొన్నారు.

## ఏ.కే-62

న్యూఢిల్లీ: బీజేపీ విభజన రాజకీయాలను తిప్పికొట్టి, కాంగ్రెస్‌కి రిక్తహస్తమే మిగిల్చి ఢిల్లీలో 70 అసెంబ్లీ స్థానాల్లో 62 స్థానాలను కైవసం చేసుకొని బీజేపీని 8 స్థానాలకు దిగజార్చిన ఘనత ఆమ్‌ఆద్మీ పార్టీ రథసారథి అరవింద్ కేజ్రీవాల్(ఏ.కే)కు దక్కింది.

**కుటుంబంతో కలిసి భోజనం, ఎప్పుడన్నా ఓ సినిమా**
హరియాణాలోని హిస్సార్‌లో గీతాదేవి, గోవింద్‌రాం కేజ్రీవాల్‌లకు 1968 ఆగస్టు 16న అరవింద్ జన్మించారు. కేజ్రీవాల్‌కు భార్య సునీత, ఇద్దరు పిల్లలున్నారు. కుటుంబంతో కలిసి అప్పుడప్పుడూ హోటల్లో భోంచేయడం, ఎప్పుడన్నా ఓ సినిమా చూడ్డం ఆయన ఇష్టాలు. కూతురు హర్షిత, కొడుకు పుల్‌కిత్ ఇద్దరూ ఐఐటీల్లో చదివారు.

**అన్నాహజారే ఉద్యమంలో కార్యకర్త:** ఖరగ్‌పూర్ ఐఐటీ గ్రాడ్యుయేట్ అయిన కేజ్రీవాల్ ఇండియన్ రెవెన్యూ సర్వీస్(ఐఆర్ఎస్) అధికారిగా పనిచేశారు. 1999లో 'పరివర్తన్' అనే స్వచ్ఛంద సంస్థ నెలకొల్పారు. 2011లో హజారే అవినీతి వ్యతిరేక ఉద్యమం ద్వారా దేశ ప్రజల దృష్టిని ఆకర్షించారు.

**2006లో మెగసెసే అవార్డు**
తొలి నుంచి వ్యవస్థ మూలాలను మార్చగలిగేది అవినీతి రహిత సమాజమేనని నమ్మిన కేజ్రీవాల్ 2006లో అవినీతిపై యుద్ధానికి సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ)ని ఆయుధంగా మలుచుకున్నారు. ఆ పోరాటం ఆయనకు 2006లో రామన్ మెగసేసే అవార్డు సాధించిపెట్టింది. అయితే, ఆ అవార్డు ద్వారా వచ్చిన నగదుని సైతం కేజ్రీవాల్, మనీశ్ సిసోడియాలు పాలనా పారదర్శకత కోసం 'పబ్లిక్ కాజ్ రీసెర్చ్ ఫౌండేషన్' స్థాపనకు వాడారు.

**2012లో పార్టీ స్థాపన:** హజారే ఉద్యమం నుంచి బయటకొచ్చిన కేజ్రీవాల్ 2012లో ఆమ్‌ఆద్మీ పార్టీని స్థాపించారు. ఆ తదుపరి ఏడాది జరిగిన ఎన్నికల్లో ఢిల్లీ ముఖ్యమంత్రి షీలా దీక్షిత్‌ని 25 వేల ఓట్ల తేడాతో ఓడించారు. అసెంబ్లీలో జన్‌లోక్‌పాల్ బిల్లు పాస్ చేయించుకోలేకపోవడంతో రాజీనామా చేసి 2015 అసెంబ్లీ ఎన్నికల్లో అధికారాన్ని చేజిక్కించుకున్నారు.

**2015 ఎన్నికల్లో**
2015 అసెంబ్లీ ఎన్నికల్లో 70 సీట్లకు గాను 67 స్థానాలను కైవసం చేసుకొని విజయదుందుభి మోగించారు. ఢిల్లీ లెఫ్టినెంట్ జనరల్‌కి ఉన్న అధికారాలను తగ్గించాలంటూ ఉద్యమించారు.

**పాలనాదక్షత**
తాను నమ్మిన సిద్ధాంతానికి అనుగుణంగా కేజ్రీవాల్ విద్య, ఆరోగ్యం, అభివృద్ధిపై దృష్టి సారించి ఢిల్లీ ప్రజల మనసు దోచుకున్నారు. మంచి పాలనాదక్షుడిగా నిలదొక్కుకున్నారు. మళ్ళీ అధికారాన్ని చేజిక్కించుకున్నారు. బడ్జెట్‌లో గతంలో రూ. 6,600 కోట్లు ఉన్న విద్యారంగ కేటాయింపులను రూ. 15,600 కోట్లకు పెంచారు. ప్రభుత్వ పాఠశాలలకు కార్పొరేట్ స్కూల్ స్థాయిని కల్పించేందుకు గత ఐదేళ్లలో 20వేల తరగతి గదులను నిర్మించారు.



నవీ ముంబైలో ఆప్ గుర్తు అయిన చీపురు పట్టుకుని నృత్యం చేస్తున్న కార్యకర్త

**4** మూడు లేదా అంతకంటే ఎక్కువ వన్డేలు ఉన్న ద్వైపాక్షిక సిరీస్‌లో భారత్ వైట్‌వాష్‌కు గురవడం ఇది నాలుగోసారి. 1983, 1989లలో విండీస్ 5-0తో భారత్‌పై గెలవగా...1997లో శ్రీలంక 3-0తో ఓడించింది. కోహ్లి సారథ్యంలో ఏ ఫార్మాట్ లోనైనా భారత్‌కు ఇలాంటి ఫలితం రావడం ఇదే మొదటిసారి.

**1** సిరీస్‌లో బుమ్రా ఒక్క వికెట్ కూడా తీయకపోవడం ఇదే మొదటిసారి. తన కెరీర్‌లో అతను ఇప్పటి వరకు 16 సిరీస్‌లు ఆడాడు. స్వదేశంలో ఇటీవల ఆస్ట్రేలియాతో జరిగిన సిరీస్‌లో కూడా మూడు మ్యాచ్‌లలో కలిపి అతను ఒకటే వికెట్ పడగొట్టాడు.


కోహ్లి

# 23 ఏళ్ల తర్వాత...

# 0-3

## న్యూజిలాండ్ చేతిలో భారత్ వైట్‌వాష్

**చివరి వన్డేలో 5 వికెట్లతో కివీస్ విజయం**

**రాహుల్ సెంచరీ వృథా ● 21 నుంచి తొలి టెస్టు**

ఎప్పుడో 1997లో భారత జట్టు శ్రీలంక చేతిలో 0-3తో వన్డే సిరీస్‌లో పరాభవం ఎదుర్కొంది. సొంతగడ్డ అయినా, విదేశాల్లో అయినా ఆ తర్వాత ఎప్పుడూ అలాంటి పరిస్థితి టీమిండియాకు ఎదురు కాలేదు. కానీ ఇప్పుడు న్యూజిలాండ్ చేతిలో మళ్లీ అంతటి అవమానకర ఓటమి ఎదురైంది. టి20 సిరీస్‌ను 5-0తో క్లీన్‌స్వీప్ చేసి అద్భుతం చూపించిన మన జట్టు అంతలోనే వన్డేల్లో తలవంచింది. సరైన రీతిలో ప్రతీకారం తీర్చుకుంటూ కివీస్ ఇప్పుడు 3-0తో తమ ప్రతాపం ప్రదర్శించింది. రాహుల్ సెంచరీ, అయ్యర్ అర్ధ సెంచరీ సాధించినా 300 పరుగులు చేయలేకపోయిన కోహ్లి సేన చివరి మ్యాచ్‌లో లక్ష్యాన్ని కాపాడుకోవడంలో విఫలమైంది. అటు బౌలింగ్‌లో, ఇటు బ్యాటింగ్‌లో సమష్టి ప్రదర్శన కనబర్చిన కివీస్ పరిమిత ఓవర్ల పోటీల్లో లెక్క సరి చేసింది. ఇక ఇరు జట్లు టెస్టుల్లో అమీతుమీ తేల్చుకోవడమే మిగిలింది.

**మౌంట్ మాంగనీ:** న్యూజిలాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో భారత్ గెలుపు రుచి చూడలేకపోయింది. మంగళవారం ఇక్కడ జరిగిన చివరి మ్యాచ్‌లో కివీస్ 5 వికెట్ల తేడాతో భారత్‌ను ఓడించింది. ఫలితంగా మూడు వన్డేల సిరీస్‌ను 3–0తో సొంతం చేసుకుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 296 పరుగులు చేసింది. రాహుల్ (113 బంతుల్లో 112; 9 ఫోర్లు, 2 సిక్సర్లు) సెంచరీ సాధించగా, అయ్యర్ (63 బంతుల్లో 62; 9 ఫోర్లు) రాణించాడు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 100 పరుగులు జోడించారు. బెన్నెట్‌కు 4 వికెట్లు దక్కాయి. అనంతరం కివీస్ 47.1 ఓవర్లలో 5 వికెట్లకు 300 పరుగులు సాధించింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' హెన్రీ నికోల్స్ (103 బంతుల్లో 80; 9 ఫోర్లు), గప్టిల్ (46 బంతుల్లో 66; 6 ఫోర్లు, 4 సిక్సర్లు), గ్రాండ్‌హోమ్ (28 బంతుల్లో 58 నాటౌట్; 6 ఫోర్లు, 3 సిక్సర్లు) విజయంలో కీలక పాత్ర పోషించారు. టేలర్‌కు 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య రెండు టెస్టుల సిరీస్‌లో భాగంగా ఈ నెల 21 నుంచి వెల్లింగ్టన్‌లో తొలి టెస్టు జరుగుతుంది.


ట్రోఫీతో న్యూజిలాండ్ జట్టు

### కోహ్లి విఫలం...

గత మ్యాచ్‌లాగే పృథ్వీ షా (42 బంతుల్లో 40; 3 ఫోర్లు, 2 సిక్సర్లు) ఈసారి కూడా దూకుడుగా ఆడగా, మయాంక్ (1) మళ్లీ విఫలమయ్యాడు. కోహ్లి (9) కూడా ఎక్కువ సేపు నిలబడలేదు. ఆ తర్వాత బెన్నెట్ వేసిన ఓవర్లో రెండు సిక్సర్లు, ఫోర్‌తో షా 16 పరుగులు రాబట్టడం విశేషం. పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 56 పరుగులకు చేరింది. అయితే రెండో పరుగు తీసే ప్రయత్నం లో రనౌటైన షా నిరాశగా వెనుదిరిగాడు.


రాహుల్

### కీలక భాగస్వామ్యాలు...

అద్భుత ఫామ్‌లో ఉన్న రాహుల్, అయ్యర్ కలిసి ఈ దశలో జట్టు ఇన్నింగ్స్‌ను నడిపించారు. వీరిద్దరు చక్కటి భాగస్వామ్యంతో చకచకా పరుగులు సాధించారు. జేమీసన్ ఓవర్లో వరుసగా రెండు ఫోర్లు కొట్టిన అయ్యర్ 52 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే అయ్యర్‌ను అవుట్ చేసి నీషమ్ ఈ జోడీని విడదీశాడు. రాహుల్‌తో జత కలిసిన మనీశ్ పాండే (48 బంతుల్లో 42; 2 ఫోర్లు) కూడా మంచి సహకారం అందించాడు. 66 బంతుల్లో రాహుల్ హాఫ్ సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. 64 పరుగుల వద్ద రాహుల్‌ను రనౌట్ చేసేందుకు వచ్చిన అవకాశాన్ని జారవిడిచిన సాన్‌ట్నర్... కొద్ది సేపటికే మళ్లీ అలాంటి తప్పు చేశాడు. పాండే 35 పరుగుల వద్ద సింగిల్‌కు ప్రయత్నించగా, ఫీల్డర్ నుంచి బంతిని అందుకున్న సాన్‌ట్నర్ బంతి తన చేతుల్లోకి రాక ముందే బెయిల్స్‌ను పడేశాడు. దాంతో రనౌట్ అవకాశం చేజారింది. బెన్నెట్ వేసిన తర్వాతి ఓవర్లో డీప్ స్క్వేర్ లెగ్ వైపు స్వీప్ చేసి రెండు పరుగులు తీసిన రాహుల్ 104 బంతుల్లో శతకం చేరుకున్నాడు. అయితే ఐదో వికెట్‌కు 107 పరుగులు జోడించిన అనంతరం రాహుల్, పాండేలిద్దరూ వరుస బంతుల్లో వెనుదిరగడంతో భారత్ 300 పరుగులు దాటడంలో విఫలమైంది.

### సూపర్ ఓపెనింగ్ ...

గత రెండు మ్యాచ్‌లలో విడి విడిగా రాణించిన ఓపెనర్లు గప్టిల్, నికోల్స్ ఈ సారి కలిసి చెలరేగారు. తొలి ఓవర్ నుంచే వీరు ధాటిని ప్రదర్శించారు. సైనీ ఓవర్లో ఫోర్, సిక్స్ బాదిన గప్టిల్ ఆ తర్వాత మరో సారి అదే బౌలర్ ఓవర్లో వరుసగా సిక్స్, ఫోర్ కొట్టాడు. ఆ తర్వాత శార్దుల్ ఓవర్లో వరుస సిక్స్, ఫోర్‌తో 29 బంతుల్లోనే గప్టిల్ అర్ధసెంచరీ పూర్తయింది. తొలి పది ఓవర్లలో న్యూజిలాండ్ 65 పరుగులు చేసింది. ఎట్టకేలకు ఈ భాగస్వామ్యం వంద పరుగులు దాటిన తర్వాత గప్టిల్‌ను చహల్ బౌల్డ్ చేశాడు. ఆ తర్వాత నికోల్స్ కొన్ని చూడచక్కటి షాట్లు ఆడాడు. 72 బంతుల్లో అతను హాఫ్ సెంచరీని చేరుకున్నాడు. అయితే తక్కువ వ్యవధిలో విలియమ్సన్ (22), టేలర్ (12), నికోల్స్, నీషమ్ (19) వికెట్లు తీసి భారత్ ఒక్కసారిగా మ్యాచ్‌పై పట్టు బిగిస్తున్నట్లు కనిపించింది.

### గ్రాండ్‌హోమ్ జోరు...

ఐదో వికెట్ పడిన తర్వాత విజయానికి 63 బంతుల్లో 77 పరుగులు చేయాల్సిన స్థితిలో కివీస్ నిలిచింది. అయితే గ్రాండ్‌హోమ్ మెరుపు బ్యాటింగ్‌తో జట్టును గెలిపించాడు. భారత్‌తో పోరులో 3 టి20ల్లో వరుసగా 0, 3, 5 పరుగులు... గత రెండు వన్డేల్లో 1, 5 పరుగులు చేసిన అతను అసలు మ్యాచ్‌లో చెలరేగిపోయాడు. టామ్ లాథమ్ (34 బంతుల్లో 32 నాటౌట్; 3 ఫోర్లు)నుంచి అతనికి చక్కటి సహకారం లభించింది. శార్దుల్ వేసిన 43వ ఓవర్లో రెండు ఫోర్లు, సిక్స్ బాదిన గ్రాండ్‌హోమ్... అతనే వేసిన 46వ ఓవర్లో 3 ఫోర్లు, సిక్సర్ బాది జట్టును విజయానికి చేరువగా తెచ్చాడు. ఈ ఓవర్లో మొత్తం 20 పరుగులు వచ్చాయి. ఆరో వికెట్‌కు గ్రాండ్‌హోమ్, లాథమ్ 46 బంతుల్లోనే అభేద్యంగా 80 పరుగులు జోడించడం విశేషం.

### స్కోరు వివరాలు

**భారత్ ఇన్నింగ్స్:** పృథ్వీ షా (రనౌట్) 40; మయాంక్ (బి) జేమీసన్ 1; కోహ్లి (సి) జేమీసన్ (బి) బెన్నెట్ 9; అయ్యర్ (సి) గ్రాండ్‌హోమ్ (బి) నీషమ్ 62; రాహుల్ (సి) జేమీసన్ (బి) బెన్నెట్ 112; పాండే (సి) సాన్‌ట్నర్ (బి) బెన్నెట్ 42; జడేజా (నాటౌట్) 8; శార్దుల్ (సి) గ్రాండ్‌హోమ్ (బి) బెన్నెట్ 7; సైనీ (నాటౌట్) 8; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 296. వికెట్ల పతనం:** 1–8; 2–32; 3–62; 4–162; 5–269; 6–269; 7–280. **బౌలింగ్:** సౌతీ 9–0–59–0; జేమీసన్ 10–0–53–1; బెన్నెట్ 10–1–64–4; గ్రాండ్‌హోమ్ 3–0–10–0; నీషమ్ 8–0–50–1; సాన్‌ట్నర్ 10–0–59–0.

**న్యూజిలాండ్ ఇన్నింగ్స్:** గప్టిల్ (బి) చహల్ 66; నికోల్స్ (సి) రాహుల్ (బి) శార్దుల్ 80; విలియమ్సన్ (సి) మయాంక్ (బి) చహల్ 22; రాస్ టేలర్ (సి) కోహ్లి (బి) జడేజా 12; లాథమ్ (నాటౌట్) 32; నీషమ్ (సి) కోహ్లి (బి) చహల్ 19; గ్రాండ్‌హోమ్ (నాటౌట్) 58; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (47.1 ఓవర్లలో 5 వికెట్లకు) 300. వికెట్ల పతనం:** 1–106; 2–159; 3–186; 4–189; 5–220. **బౌలింగ్:** బుమ్రా 10–0–50–0; సైనీ 8–0–68–0; చహల్ 10–1–47–3; శార్దుల్ 9.1–0–87–1; జడేజా 10–0–45–1.

"మూడు మ్యాచుల్లోనూ మా ప్రదర్శన, ఫీల్డింగ్ అంతర్జాతీయ క్రికెట్ స్థాయికి తగిన విధంగా లేవు. తొలి వన్డేలో మాత్రం మేం గెలిచే స్థితిలో నిలిచాం. మైదానంలో ప్రత్యర్థిని ఓడించేందుకు మా ఆట సరిపోలేదు. టి20లు అద్భుతంగా ఆడినా వన్డేల్లో కొందరు కొత్త కుర్రాళ్లొచ్చారు. వారికి ఇది మంచి అనుభవం. టి20 సిరీస్ ఓడిన తర్వాత న్యూజిలాండ్ చాలా బాగా ఆడింది. వారికే 3–0తో గెలిచే అర్హత ఉంది.

– విరాట్ కోహ్లి, భారత కెప్టెన్

"గత నాలుగైదేళ్లలో ఇది భారత జట్టుకు నాలుగో లేదా ఐదో సిరీస్ పరాజయం మాత్రమే. ప్రతీ మ్యాచ్‌లో గెలవడం సాధ్యం కాదు. మా ఫీల్డింగ్ పేలవంగా ఉందనేది వాస్తవం. తర్వాతి సిరీస్‌లోగా మా తప్పులు సరిదిద్దుకుంటాం. జడేజా అన్ని రంగాల్లో మంచి ప్రదర్శన కనబరుస్తుండటం వల్లే నేను, కుల్దీప్ ఒకే మ్యాచ్‌లో బరిలోకి దిగే అవకాశం రావడం లేదు. ఇద్దరం చెరి సగం మ్యాచ్‌లలో ఆడాల్సి వస్తోంది.

– చహల్, భారత బౌలర్

---

# 'అతి'కి సస్పెన్షన్ పాయింట్లు

**ఇద్దరు భారత్, ముగ్గురు బంగ్లాదేశ్ యువ క్రికెటర్లపై ఐసీసీ చర్యలు**

**దుబాయ్:** జెంటిల్‌మెన్ క్రికెట్‌కు తమ దురుసు ప్రవర్తనతో మచ్చ తెచ్చిన భారత్, బంగ్లాదేశ్ యువ క్రికెటర్లపై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) చర్యలు తీసుకుంది. అండర్–19 ప్రపంచకప్ ఫైనల్ ముగిశాక ఆటగాళ్ల ప్రవర్తన... లెవెల్–3 నియమావళికి విరుద్ధంగా ఉండటంతో ఐసీసీ చర్యలు చేపట్టింది. కప్ నెగ్గిన ఆనందంలో 'అతి'గా సంబరపడిన బంగ్లాదేశ్ ఆటగాళ్లపై, దీనికి దీటుగా ఆవేశపడిన భారత ఆటగాళ్లపై సస్పెన్షన్ పాయింట్లు విధించింది.



భారత్‌కు చెందిన ఆకాశ్ సింగ్‌కు 8 సస్పెన్షన్ పాయింట్లు (6 డి మెరిట్ పాయింట్లకు సమానం), రవి బిష్ణోయ్‌కి 5 సస్పెన్షన్ (2 డి మెరిట్) పాయింట్లు విధించారు. బంగ్లాదేశ్ ఆటగాళ్లలో తౌహిద్ హ్రిదోయ్ (10 సస్పెన్షన్=6 డి మెరిట్), షమీమ్ హుస్సేన్ (8 సస్పెన్షన్=6 డి మెరిట్), రకీబుల్ హసన్ (4 సస్పెన్షన్= 5 డి మెరిట్)లపై ఐసీసీ చర్యలు తీసుకుంది. రకీబుల్ ప్రవర్తించిన తీరుపై ఎక్కువ డి మెరిట్ పాయింట్ల నిషేధం విధించింది. ఆదివారం ఉత్కంఠ పెంచిన 'లో' స్కోర్ల మ్యాచ్‌లో బంగ్లాదేశ్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 3 వికెట్ల తేడాతో భారత్‌పై గెలిచింది. తొలిసారి ఐసీసీ ప్రపంచకప్ నెగ్గిన ఆనందంలో బంగ్లాదేశ్ యువ ఆటగాళ్లు విచక్షణ కోల్పోయారు.



---


శ్రీకాంత్

# భారత్ శుభారంభం

**4–1తో కజకిస్తాన్‌పై జయభేరి ● క్వార్టర్ ఫైనల్ బెర్త్ ఖాయం ● ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్**

**మనీలా:** ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత పురుషుల జట్టు శుభారంభం చేసింది. మంగళవారం గ్రూప్ 'బి'లో కజకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ 4–1తో ఘనవిజయం సాధించింది. ముందుగా జరిగిన మూడు సింగిల్స్ పోటీల్లో కిడాంబి శ్రీకాంత్, లక్ష్య సేన్, శుభాంకర్ డే విజయం సాధించారు. తొలి డబుల్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్–చిరాగ్ శెట్టి జోడీ కంగుతినగా, రెండో డబుల్స్‌లో ఎం.ఆర్.అర్జున్–ధ్రువ్ కపిల ద్వయం గెలుపొందింది. ఈ విజయంతో భారత్ క్వార్టర్ ఫైనల్స్‌ను దాదాపు ఖాయం చేసుకుంది. తొలి మ్యాచ్ బరిలోకి దిగిన ప్రపంచ మాజీ నంబర్‌వన్ శ్రీకాంత్ కేవలం 23 నిమిషాల్లోనే ప్రత్యర్థిని ఓడించాడు. శ్రీకాంత్ 21–10, 21–7తో డిమిత్రి పనరిన్‌పై అలవోక విజయం సాధించాడు. లక్ష్యసేన్ కూడా 21 నిమిషాల్లో ఆట ముగించాడు. అతను 21–13, 21–8తో అర్తుర నియజోవ్‌పై నెగ్గగా... శుభాంకర్ డే 21–11, 21–5తో కైత్‌మురత్ కుల్మతోవ్‌పై గెలిచేందుకు 26 నిమిషాలే పట్టింది. డబుల్స్‌లో ప్రణయ్–చిరాగ్ శెట్టి జోడీ 21–18, 16–21, 19–21తో నియజోవ్–పనరిన్ జంట చేతిలో ఓడింది. మరో డబుల్స్‌లో అర్జున్–ధ్రువ్ కపిల ద్వయం 21–14, 21–8తో నికిట బ్రగిన్–కైత్‌మురత్ జోడీపై వరుస గేముల్లో గెలిచింది. ప్రపంచ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత సాయిప్రణీత్ మంగళవారం బరిలోకి దిగలేదు. గురువారం జరిగే తమ తదుపరి లీగ్ మ్యాచ్‌లో మలేసియాతో భారత్ ఆడుతుంది. ఒక్కో గ్రూప్ నుంచి రెండేసి జట్లు క్వార్టర్స్ చేరతాయి.

---

# నేడు ఆసీస్‌తో భారత్ అమీతుమీ

**ముక్కోణపు మహిళల టి20 క్రికెట్ టోర్నీ**

**మెల్‌బోర్న్:** పొట్టి ప్రపంచకప్‌కు ముందు ముక్కోణపు టైటిల్ పట్టాలని భారత్, ఆస్ట్రేలియా మహిళలు గట్టి పట్టుదలతో ఉన్నారు. ఇరు జట్ల మధ్య బుధవారం టి20 ఫైనల్ పోరు జరుగనుంది. ఇంగ్లండ్ కూడా పాల్గొన్న ఈ టోర్నీలో లీగ్ మ్యాచ్‌ల తర్వాత మూడు జట్లూ నాలుగేసి పాయింట్లతో సమ ఉజ్జీగా నిలిచాయి. దాంతో మెరుగైన రన్‌రేట్‌తో భారత్, ఆస్ట్రేలియా టైటిల్ పోరుకు అర్హత సాధించాయి. ఆసీస్‌తో చివరి లీగ్ మ్యాచ్‌లో షఫాలీ వర్మ, స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్ ధాటిగా ఆడటంతో కొండంత లక్ష్యాన్ని భారత్ ఛేదించింది. బౌలింగ్‌లో దీప్తి, రాజేశ్వరి గైక్వాడ్, రాధ యాదవ్‌లు కూడా తమ స్థాయి మేరకు రాణిస్తే ఆసీస్‌ను మళ్లీ కంగుతినిపించి కప్ కొట్టడం భారత్‌కు కష్టమేమీ కాదు.



ఉదయం గం. 8.10 నుంచి సోనీ సిక్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

---

## లాల్‌రెమ్‌సియామికి 'రైజింగ్ స్టార్' అవార్డు



**లుసానే:** భారత మహిళా హాకీ స్ట్రయికర్, 19 ఏళ్ల లాల్‌రెమ్‌సియామి 2019 ఏడాదికిగాను అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్‌ఐహెచ్) 'రైజింగ్ స్టార్ ఆఫ్ ద ఇయర్' అవార్డుకు ఎంపికైంది. 2018లో జరిగిన ప్రపంచకప్‌లో విశేషంగా రాణించడం ద్వారా వెలుగులోకి వచ్చిన లాల్‌రెమ్‌సియామి తదనంతరం కూడా నిలకడైన ప్రదర్శనను కొనసాగించింది.

## ప్రిక్వార్టర్ ఫైనల్లో సాకేత్, నిక్కీ

**బెంగళూరు:** బెంగళూరు ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు సాకేత్ మైనేని, నిక్కీ కలియంద పునాచ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. రెండో రౌండ్‌లో ప్రపంచ 192వ ర్యాంకర్ సాకేత్ 6–3, 6–3తో 111వ ర్యాంకర్ డాన్‌స్కాయ్ (రష్యా)పై... ప్రపంచ 1105వ ర్యాంకర్ నిక్కీ 6–4, 2–6, 6–3తో 168వ ర్యాంకర్ లుకాస్ రసోల్ (చెక్ రిపబ్లిక్)పై గెలిచారు.

---



# హారిక, హంపి గేమ్‌లు 'డ్రా'

**సెయింట్ లూయిస్ (అమెరికా):** కెయిన్స్ కప్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక తమ నాలుగో రౌండ్ గేమ్‌లను 'డ్రా' చేసుకున్నారు. ప్రపంచ ఆరో ర్యాంకర్ కాటరీనా లాగ్నో (రష్యా)తో జరిగిన గేమ్‌ను ప్రపంచ నాలుగో ర్యాంకర్ హంపి 30 ఎత్తుల్లో... ప్రపంచ 41వ ర్యాంకర్ ఇరీనా క్రష్ (అమెరికా)తో జరిగిన గేమ్‌ను ప్రపంచ పదో ర్యాంకర్ హారిక 33 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించారు. పది మంది అగ్రశ్రేణి క్రీడాకారిణుల మధ్య జరుగుతున్న ఈ టోర్నీలో నాలుగో రౌండ్ తర్వాత 2.5 పాయింట్లతో హారిక ఐదో స్థానంలో... 2 పాయింట్లతో హంపి ఏడో స్థానంలో ఉన్నారు.

---

# 'ముందు'కొచ్చిన నోబాల్‌పై మూడో కన్ను

**ఐసీసీ మహిళల టి20 ప్రపంచకప్‌లో కొనసాగింపు**



**దుబాయ్:** త్వరలో జరిగే మహిళల పొట్టి ప్రపంచకప్‌లో మూడో కన్నుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. బౌలర్లు గీతదాటి వేసిన నోబాల్స్‌ను థర్డ్ అంపైర్ చూస్తారని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తెలిపింది. ఇంతకుముందు భారత్, వెస్టిండీస్‌లలో జరిగిన మ్యాచ్‌ల్లో థర్డ్ అంపైర్‌కు ప్రయోగాత్మకంగా ఆ బాధ్యతను అప్పగించి పరిశీలించిన ఐసీసీ... అమ్మాయిల మెగా టోర్నీలో పూర్తిస్థాయిలో మూడో అంపైర్‌కే నిర్ణయాధికారం వదిలేసింది. ఇటీవల 12 మ్యాచ్‌ల్లో 4717 బంతులు సంధించగా... థర్డ్ అంపైర్ గీత దాటిన 13 నోబాల్‌లను గుర్తించారు. ఇందులో కచ్చితమైన నిర్ణయాలు రావడంతో ఐసీసీ మెగా ఈవెంట్‌లో మూడో కన్నుకే ఆ పని అప్పజెప్పింది. ఆస్ట్రేలియా ఆతిథ్యమివ్వనున్న అమ్మాయిల టి20 ప్రపంచకప్ ఈ నెల 21న మొదలవుతుంది. సిడ్నీలో జరిగే తొలి మ్యాచ్‌లో భారత్, ఆస్ట్రేలియా జట్లు తలపడతాయి.

epaper.sakshi.com

సాక్షి బిజినెస్
బుధవారం 12-2-2020
WWW.SAKSHIBUSINESS.COM

## స్టాక్ మార్కెట్లు

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ | 237 ▲ | 41,216 |
| నిఫ్టీ | 76 ▲ | 12,108 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

| విదేశీ సూచీలు (తొలి రెండు 11.30గంటలకు) | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 9,680 | ▲ | 51 |
| డోజోన్స్ | 29,310 | ▲ | 33 |
| ఎఫ్‌టీఎస్ఈ 100 | 7,449 | ▲ | 53 |
| డాక్స్ | 13,628 | ▲ | 134 |
| షాంఘై | 2,902 | ▲ | 11 |
| నికాయ్(సోమవారం ముగింపు) | 23,686 | ▼ | 142 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 70.50 | 72.14 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 90.56 | 93.75 |
| € | యూరో | ఎస్‌బీఐ | 76.42 | 79.32 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 63.74 | 66.12 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 46.81 | 48.95 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 50.52 | 52.28 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.22 | 19.82 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.94 | 19.95 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.60 | 11.00 |

# మొబైల్స్‌కూ కరోనా కష్టాలు..!



### చైనా నుంచి పరికరాల సరఫరా సమస్యలు
### దేశీ పరిశ్రమపై తీవ్ర ప్రభావం
### ఈ వారం పరిస్థితి చక్కబడొచ్చని ఆశలు

**న్యూఢిల్లీ:** ప్రపంచాన్ని కుదిపేస్తున్న కరోనా వైరస్ .. దేశీ స్మార్ట్‌ఫోన్స్ పరిశ్రమను కూడా కలవరపెడుతోంది. పరికరాలు, సబ్–అసెంబ్లీస్ కోసం చైనాపై ఆధారపడిన దేశీ కంపెనీలకు .. సరఫరాపరమైన సమస్యలతో క్రమంగా సెగ తగులుతోంది. చైనాలో మూతబడిన ఫ్యాక్టరీలు మళ్లీ తెరుచుకుని, ఈ వారంలోనైనా ఉత్పత్తుల సరఫరా ప్రారంభమవుతుందేమోనని స్మార్ట్‌ఫోన్ సంస్థలు ఆశగా ఎదురుచూస్తున్నాయి. 'దేశీ పరిశ్రమపై కరోనా వైరస్ ప్రభావం ఉంది. కొన్ని ఉత్పత్తులు, మోడల్స్‌పై ఇది స్పష్టంగా కనిపిస్తోంది. అయితే, కొన్ని ఫ్యాక్టరీలు దశలవారీగా మళ్లీ ఉత్పత్తి ప్రారంభించనున్న నేపథ్యంలో ప్రభావ తీవ్రతపై ఇప్పుడే ఒక అంచనాకు రావడం సాధ్యపడదు' అని ఇండియా సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) చైర్మన్ పంకజ్ మహీంద్రూ తెలిపారు. దీనిపై మరింత వివరణ ఇచ్చేందుకు నిరాకరించిన మహీంద్రూ.. దేశీ పరిశ్రమ ఈ వారమంతా వేచి, చూడాలని భావిస్తోందని పేర్కొన్నారు. మరోవైపు, దేశీ స్మార్ట్‌ఫోన్ సంస్థలకు అవసరమైన కీలక పరికరాలన్నీ చైనా నుంచే రావాల్సి ఉన్నందున.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు అస్సలు బాగాలేవని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఇక డిమాండ్ లేక మార్కెట్‌లో మందగమనం పరిశ్రమను మరింత కలవరపెడుతోందని పేర్కొన్నాయి.

కాగా, సరఫరాపరమైన సమస్యలకు సంబంధించి ప్రస్తుతానికైతే భారత్‌లో స్టాక్స్, ఉత్పత్తిపై పెద్దగా ప్రతికూల ప్రభావమేమీ లేదని స్మార్ట్‌ఫోన్స్ తయారీ సంస్థ రియల్‌మీ తెలిపింది. మరోవైపు, ఓ భారీ స్థాయి కాంట్రాక్ట్ తయారీ సంస్థ చైనాలోని ఒక ప్లాంటులో కార్యకలాపాలు తిరిగి ప్రారంభించినట్లు వార్తలు వచ్చాయి. కొద్ది సిబ్బందితో పనులు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. కరోనా వైరస్ బారిన పడి చైనాలో మరణించిన వారి సంఖ్య వెయ్యి దాటిపోయింది. చైనా వెలుపల ఇతర దేశాల్లో 350 పైగా కేసులు నమోదయ్యాయి. హాంకాంగ్, ఫిలిప్పీన్స్ దేశాల్లో కూడా ఇద్దరు మృత్యువాత పడ్డారు.

**మధ్యకాలికంగా సరఫరా ఇక్కట్లు: ఇండ్–రా**

కరోనా వైరస్ కారణంగా మధ్యకాలికంగా సరఫరా వ్యవస్థలు దెబ్బతినే ప్రమాదముందని రేటింగ్ ఏజెన్సీ ఇండ్–రా తెలిపింది. అయితే, వైరస్ ఒకవేళ హుబె ప్రావిన్స్‌కే పరిమితమైతే.. సమీప కాలంలో భారతీయ సంస్థలపై పెద్దగా ప్రతికూల ప్రభావం పడకపోవచ్చని తెలిపింది. కానీ, 'కరోనా తీవ్రత మరో మూడు 4 నెలలు కొనసాగిందంటే మాత్రం ఫార్మా, టెక్స్‌టైల్స్, వాహన సంస్థలకు కీలకమైన ముడి వస్తువుల సరఫరాపరమైన సమస్యలు రావొచ్చు. ఇది 2003లో వచ్చిన సార్స్ ప్రభావాల కన్నా ఎక్కువగా ఉండొచ్చు' అని ఇండ్–రా వివరించింది.

### మొబైల్ కాంగ్రెస్‌కు దిగ్గజాలు దూరం..

కరోనా వైరస్ (ఎన్‌సీపీ) ప్రబలుతున్న నేపథ్యంలో త్వరలో జరగబోయే మొబైల్ వరల్డ్ కాంగ్రెస్ 2020కి (ఎండబ్ల్యూసీ) దూరంగా ఉండాలని భావిస్తున్న కంపెనీల సంఖ్య పెరుగుతోంది. తాజాగా చైనాకు చెందిన హ్యాండ్‌సెట్ సంస్థ వివో, చిప్‌సెట్ సంస్థ ఇంటెల్‌తో పాటు పలు గ్లోబల్ బ్రాండ్స్ .. ఇందులో పాల్గొనడం లేదని ప్రకటించాయి. తమ ఉద్యోగులు, ఇతరత్రా ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివో ఒక ప్రకటనలో తెలిపింది. జీఎస్ఎం అసోసియేషన్ తీసుకుంటున్న ముందస్తు జాగ్రత్త చర్యలు అభినందనీయమైనప్పటికీ ఎండబ్ల్యూసీకి దూరంగా ఉండటమే శ్రేయస్కరమని తాము భావిస్తున్నట్లు సాఫ్ట్‌వేర్ సేవలందించే యామ్‌డాక్స్ పేర్కొంది. అయితే, పరిస్థితులను బట్టి షెడ్యూల్ ప్రకారమే ఎండబ్ల్యూసీలో పాల్గొంటామని వివో అనుబంధ సంస్థ ఒపో వెల్లడించింది. ఎరిక్సన్, అమెజాన్, సోనీ వంటి దిగ్గజాలు ఇప్పటికే ఎండబ్ల్యూసీలో పాల్గొనటం లేదని ప్రకటించిన సంగతి తెలిసిందే.

**షెడ్యూల్ ప్రకారమే కాంగ్రెస్...**

ఫిబ్రవరి 24–27 తేదీల మధ్య స్పెయిన్‌లోని బార్సెలోనాలో మొబైల్ కాంగ్రెస్ జరగనుంది. అయితే, కరోనా వైరస్ భయాల కారణంగా చైనా నుంచి రావాల్సిన 5,000–6,000 మంది దాకా డెలిగేట్లు హాజరు కాలేకపోతున్నారని మొబైల్ కాంగ్రెస్ నిర్వహించే జీఎస్ఎం అసోసియేషన్ వెల్లడించింది. అయినప్పటికీ అన్ని జాగ్రత్తలూ తీసుకుని, షెడ్యూల్ ప్రకారమే ఎండబ్ల్యూసీని నిర్వహించనున్నట్లు పేర్కొంది.

## కోల్ ఇండియా లాభం రూ.3,922 కోట్లు



**కోల్‌కత:** మైనింగ్ దిగ్గజం కోల్ ఇండియా నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం (2019–20) డిసెంబర్ క్వార్టర్లో 14 శాతం పతనమై రూ.3,922 కోట్లకు తగ్గింది. గత ఆర్థిక సంవత్సరం(2018–19) క్యూ3లో రూ.23,385 కోట్లుగా ఉన్న నికర అమ్మకాలు ఈ క్యూ3లో రూ.21,566 కోట్లకు చేరాయని కోల్ ఇండియా తెలిపింది. మొత్తం సమగ్ర ఆదాయం రూ.4,140 కోట్ల నుంచి రూ.3,670 కోట్లకు తగ్గిందని పేర్కొంది. ఇంధన సరఫరా ఒప్పందం(ఎఫ్ఎస్ఏ) ప్రకారం ఒక్కో టన్నుకు రూ.1,411 మేర మొత్తం రూ.18,015 కోట్ల రియలైజేషన్లు సాధించామని తెలిపింది. సగటు రియలైజేషన్ ఒక్కో టన్నుకు రూ.1,524గా ఉందని వివరించింది. గత క్యూ3లో 155.97 మిలియన్ టన్నులుగా ఉన్న ముడి బొగ్గు ఉత్పత్తి ఈ క్యూ3లో 147.50 మిలియన్ టన్నులకు తగ్గిందని తెలిపింది. బీఎస్ఈలో కోల్ ఇండియా షేర్ 0.2 శాతం లాభంతో రూ.179 వద్ద ముగిసింది.

## రూ.999కే విమాన టికెట్

### ఇండిగో వాలెంటైన్స్ డే ఆఫర్



**న్యూఢిల్లీ:** చౌక ధరల విమానయాన సంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ (ఇండిగో).. రూ. 999కే దేశీ రూట్లలో టికెట్ అందిస్తోంది. వాలెంటైన్స్ డే సందర్భంగా కంపెనీ ఈ ఆఫర్‌ను అందుబాటులో ఉంచింది. నాలుగు రోజులపాటు కొనసాగే ఈ చౌక చార్జీల ఆఫర్ మంగళవారం (11న) ప్రారంభమైంది. ఫిబ్రవరి 14 వరకు కొనసాగే ప్రేమికుల రోజు డిస్కౌంట్‌లో భాగంగా మొత్తం 10 లక్షల సీట్లు అందుబాటులో ఉన్నట్లు కంపెనీ ప్రకటించింది. ఈ ఏడాది మార్చి ఒకటి నుంచి సెప్టెంబర్ 30 వరకు జరిగే ప్రయాణాలపై తాజా డిస్కౌంట్ ఆఫర్ వర్తిస్తుందని సంస్థ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ విలియం బౌల్టర్ వెల్లడించారు.

## ఆరుగురు బ్యాంక్ సీఈఓలపై సీబీఐ, ఈడీ విచారణ



**న్యూఢిల్లీ:** ఆరుగురు బ్యాంక్ సీఈఓలపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(సీబీఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) విచారణ ప్రస్తుతం జరుగుతోంది. లోక్‌సభకు మంగళవారం ఇచ్చిన ఒక లిఖితపూర్వక సమాధానంలో ఆర్థికశాఖ సహాయమంత్రి అనురాగ్ ఠాకూర్ ఈ విషయాన్ని తెలిపారు. అయితే ఈ కేసులకు సంబంధించి ఎటువంటి అరెస్టులు జరగలేదని కూడా ఆయన తెలిపారు. 'పీఐడీపీఐ (పబ్లిక్ ఇన్‌ట్రస్ట్ డిస్‌క్లోజర్ అండ్ ప్రొటెక్షన్ రిజల్యూషన్) తాజా మార్గదర్శకాల ప్రకారం ప్రజావేగులు (విజిల్‌బ్లోయర్స్) ఇచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపే అధికారం సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ)కు కూడా ఉంది'' అని ఆర్థికశాఖ సహాయ మంత్రి ఈ సందర్భంగా తెలిపారు.

## సిండికేట్ బ్యాంక్ లాభం 4 రెట్లు అప్



**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ సిండికేట్ బ్యాంక్ నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం(2019–20) మూడో త్రైమాసికంలో నాలుగు రెట్లు పెరిగింది. గత ఆర్థిక సంవత్సరం(2018–19) క్యూ3లో రూ.108 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ3లో రూ.435 కోట్లకు ఎగసింది. మొత్తం ఆదాయం రూ.6,078 కోట్ల నుంచి రూ.6,317 కోట్లకు పెరిగిందని సిండికేట్ బ్యాంక్ తెలిపింది. మరిన్ని వివరాలు.....

**పెరిగిన కేటాయింపులు...:** ఈ బ్యాంక్ మొండి బకాయిలు తగ్గాయి. గత క్యూ3లో 12.54 శాతంగా ఉన్న స్థూల మొండి బకాయిలు ఈ క్యూ3లో 11.33 శాతానికి తగ్గాయి. నికర మొండి బకాయిలు 6.75 శాతం నుంచి 5.94 శాతానికి తగ్గాయి. విలువ పరంగా చూస్తే, స్థూల మొండి బకాయిలు రూ.26,185 కోట్ల నుంచి రూ.25,330 కోట్లకు, నికర మొండి బకాయిలు రూ.13,211 కోట్ల నుంచి రూ.12,514 కోట్లకు తగ్గాయి. మొండి బకాయిలు తగ్గినప్పటికీ, మొండి బకాయిలకు అధిక కేటాయింపులు జరిపింది. గత క్యూ3లో రూ.910 కోట్లుగా ఉన్న మొండి బకాయిలకు కేటాయింపులు ఈ క్యూ3లో రూ.1,287 కోట్లకు పెరిగాయి. ప్రొవిజన్ కవరేజ్ రేషియో 69.28 శాతంగా ఉంది. ఈ బ్యాంక్ కెనరా బ్యాంక్‌లో విలీనమవుతోంది. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో సిండికేట్ బ్యాంక్ షేర్ 0.8 శాతం లాభంతో రూ.24 వద్ద ముగిసింది.

## భెల్ ఆదాయం రూ.5,828 కోట్లు



**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ ఇంజినీరింగ్ కంపెనీ భెల్ నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం డిసెంబర్ క్వార్టర్లో 17 శాతం తగ్గింది. గత క్యూ3లో రూ.196 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ3లో రూ.162 కోట్లకు తగ్గింది. మొత్తం ఆదాయం రూ.7,564 కోట్ల నుంచి రూ.5,828 కోట్లకు చేరిందని భెల్ తెలిపింది. ఇక ఈ ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలల కాలంలో రూ.64 కోట్ల నికర లాభం సాధించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలానికి నికర లాభం రూ.322 కోట్లుగా ఉంది. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో భెల్ షేర్0.7 శాతం లాభంతో రూ.38.55 వద్ద ముగిసింది.

### 2019 అక్టోబర్-డిసెంబర్ కాలానికి..

(రూ. కోట్లలో)

| కంపెనీ | నికర లాభం 2019-20 | నికర లాభం 2018-19 | వృ./క్షీ.(%) | మొత్తం ఆదాయం 2019-20 | మొత్తం ఆదాయం 2018-19 | వృ./క్షీ.(%) |
|---|---|---|---|---|---|---|
| అరవింద్ ఫ్యాషన్స్ | (51) | 8 | -- | 1,135 | 1,259 | -10 |
| సీమెన్స్ | 266 | 231 | 15 | 2,772 | 2,914 | -5 |
| ఆర్‌సీఎఫ్ | 78 | 46 | 70 | 2,246 | 2,374 | -5 |
| క్రిసిల్ | 95 | 114 | -16 | 464 | 467 | -- |
| *హెక్సావేర్ | 168 | 123 | 36 | 1,529 | 1,252 | 22 |
| అలహాబాద్ బ్యాంక్ | (1,986) | (733) | -- | 4,860 | 4,757 | 2 |
| పెన్నార్ ఇండస్ట్రీస్ | 12 | -- | 20 | 541 | 575 | -6 |
| ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ | 5 | (4) | -- | 113 | 96 | 18 |

*ఒక్కో షేర్‌కు రూ.2.50 తుది డివిడెండ్‌ను ఇవ్వనున్నది. (నష్టం)

### టైటాన్ చేతికి హగ్ ఇన్నోవేషన్స్



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** కన్జూమర్ గూడ్స్ రంగ సంస్థ టైటాన్ తాజాగా హైదరాబాద్‌కు చెందిన టెక్నాలజీ, వేరియబుల్స్ కంపెనీ హగ్ ఇన్నోవేషన్స్‌ను కొనుగోలు చేసింది. హగ్ ఫౌండర్ రాజ్ నేరావటితోపాటు 23 మంది ఉద్యోగులు జనవరి 1న తమ సంస్థలో చేరారని టైటాన్ వాచెస్, వేరియబుల్స్ విభాగం సీఈవో ఎస్.రవికాంత్ తెలిపారు. కాగా, కనెక్టెడ్ ఎక్స్ పేరుతో టైటాన్ ఫుల్ టచ్ స్మార్ట్‌వాచ్‌ను ప్రవేశపెట్టింది. వాచ్ ధర రూ.14,995.

### రూ.190 కోట్లతో పిట్టి విస్తరణ



ఎలక్ట్రికల్ స్టీల్ ల్యామినేషన్స్ తయారీ సంస్థ పిట్టి ఇంజినీరింగ్ రూ.190 కోట్లతో విస్తరణ చేపట్టనుంది. ఇది పూర్తి అయితే కంపెనీ వార్షిక తయారీ సామర్థ్యం 36,000 మెట్రిక్ టన్నుల నుంచి 46,000 మెట్రిక్ టన్నులకు, మెషీనింగ్ సామర్థ్యం 2,47,600 గంటల నుంచి 4,05,600 గంటలకు చేరుతుంది. ఔరంగాబాద్, హైదరాబాద్ ప్లాంట్లలో ఈ విస్తరణ 36 నెలల్లో పూర్తి కానుంది. ప్రస్తుతం తయారీ కేంద్రాల్లో వినియోగం 70 శాతముంది. కాగా, డిసెంబరు త్రైమాసికంలో నికర లాభం 20 శాతం తగ్గి రూ.4 కోట్లు నమోదు చేసింది. టర్నోవరు రూ.165 కోట్ల నుంచి రూ.120 కోట్లకు వచ్చి చేరింది.

### 100 మందితో ఉబర్ మనీ టీమ్



రైడ్ హెయిలింగ్ కంపెనీ ఉబర్ తాజాగా హైదరాబాద్ టెక్ సెంటర్‌లో 100 మంది టెక్నాలజీ ప్రొఫెషనల్స్‌తో కూడిన ఉబర్ మనీ టీమ్‌ను ఏర్పాటు చేసింది. సంస్థ గ్లోబల్ ఫైనాన్షియల్ ప్రొడక్ట్స్, టెక్నాలజీ ఇన్నోవేషన్స్ బాధ్యతలను ఈ బృందం చేపడుతుంది. రిస్క్, పేమెంట్స్, ఫైనాన్షియల్ రిపోర్టింగ్, అనలిటిక్స్ విభాగాల్లో నిపుణులైన సిబ్బందివ తమ కేంద్రంలో పనిచేస్తున్నారని ఉబర్ ఇండియా ఇంజనీరింగ్ డైరెక్టర్, హైదరాబాద్ సైట్ లీడ్ నాగ కాసు తెలిపారు.

## పసిడి ఈటీఎఫ్‌ల్లోకి పెట్టుబడుల ప్రవాహం

- జనవరిలో రూ. 200 కోట్లు
- ఏడేళ్లలో ఇదే అత్యధికం



**న్యూఢిల్లీ:** ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక, రాజకీయపరమైన అనిశ్చితి పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు.. పసిడి వంటి సురక్షితమైన పెట్టుబడి సాధనాల వైపు మళ్లుతున్నారు. దేశీయంగా ఇదే ధోరణి ప్రతిబింబిస్తూ.. గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడింగ్ ఫండ్స్ (ఈటీఎఫ్)లో వరుసగా మూడో నెలా పెట్టుబడుల రాక కొనసాగింది. జనవరిలో గోల్డ్ ఈటీఎఫ్‌లలో రూ. 200 కోట్ల పెట్టుబడులు నమోదయ్యాయి. ఇది ఏడేళ్ల గరిష్టం. 2012 డిసెంబర్ తర్వాత ఒక నెలలో ఇంత భారీగా ఇన్వెస్ట్‌మెంట్స్ రావడం ఇదే ప్రథమం. అప్పట్లో గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి రూ. 474 కోట్లు వచ్చాయి. మ్యూచువల్ ఫండ్స్ సంస్థల సమాఖ్య యాంఫీ విడుదల చేసిన గణాంకాల ప్రకారం జనవరిలో నికరంగా రూ. 202 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అంతక్రితం నెలలో రూ. 27 కోట్లు, నవంబర్‌లో రూ. 7.68 కోట్ల ఇన్వెస్ట్‌మెంట్స్ నమోదయ్యాయి. 'కరోనా వైరస్ ప్రభావాలపై ఆందోళన తీవ్రమవుతున్న నేపథ్యంలో పెట్టుబడి సాధనంగా బంగారం ఆకర్షణ మరింతగా పెరుగుతోంది. అందుకే పసిడిలో పెట్టుబడులు పెరుగుతున్నాయి' అని మార్నింగ్‌స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ ఇండియా అనలిస్టు హిమాంశు శ్రీవాస్తవ తెలిపారు. యాంఫీ గణాంకాల ప్రకారం డిసెంబర్ ఆఖరు నాటికి గోల్డ్ ఫండ్స్‌లో రూ. 5,768 కోట్లుగా ఉన్న పెట్టుబడులు జనవరి ఆఖరు నాటికి 7.6 శాతం పెరిగి.. రూ. 6,207 కోట్లకు చేరాయి.

## 'ఎన్‌ఐఎఫ్‌ఎం'కు అరుణ్ జైట్లీ పేరు..!



**న్యూఢిల్లీ:** నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐఎఫ్ఎం) పేరును మార్చాలని ప్రభుత్వం భావిస్తోంది. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్‌సీ) నియమించే ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ సర్వీసెస్ ఆఫీసర్లకు శిక్షణ ఇచ్చే ఈ సంస్థ పేరును అరుణ్ జైట్లీ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్(ఏజేఎన్ఐఎఫ్ఎం)గా మార్చాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఇండియన్ కాస్ట్ అకౌంట్స్ సర్వీస్ అధికారులకు కూడా ఈ సంస్థ ట్రైనింగ్ ఇస్తోంది. 1993లో సొసైటీగా రిజిస్టర్ అయిన ఈ ట్రైనింగ్ సంస్థకు కేంద్ర ఆర్థిక మంత్రి (ప్రస్తుతం నిర్మలా సీతారామన్) ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తారు. మాజీ ఆర్థిక మంత్రి దివంగత అరుణ్ జైట్లీ ఆశయాలను ముందుకు తీసుకుని వెళ్లడం కోసం నూతన పేరును నిర్ణయించినట్లు వివరించింది.

## ఐడీబీఐ బ్యాంక్ నష్టాలు రూ.5,763 కోట్లు



**న్యూఢిల్లీ:** ఐడీబీఐ బ్యాంక్ నష్టాలు మరింతగా పెరిగాయి. గత ఆర్థిక సంవత్సరం (2019–20) మూడో త్రైమాసికంలో రూ.4,185 కోట్లుగా ఉన్న నికర నష్టాలు ఈ ఆర్థిక సంవత్సరం (2019–20) ఇదే క్వార్టర్‌లో రూ.5,763 కోట్లకు పెరిగాయి. మొత్తం ఆదాయం రూ.6,191 కోట్ల నుంచి రూ.6,216 కోట్లకు పెరిగింది. బ్యాంక్ మొండి బకాయిలు ఈ క్యూ3లో తగ్గాయి. స్థూల మొండి బకాయిలు స్వల్పంగా తగ్గగా, నికర మొండి బకాయిలు సగం మేర దిగి వచ్చాయి. గత క్యూ3లో 29.67 శాతంగా ఉన్న స్థూల మొండి బకాయిలు ఈ క్యూ3లో 28.72 శాతానికి తగ్గాయి. నికర మొండి బకాయిలు కూడా 14.01 శాతం నుంచి 5.25 శాతానికి చేరాయి. మొండి బకాయిలు తగ్గడంతో కేటాయింపులు కూడా తగ్గాయి. గత క్యూ3లో రూ.5,075 కోట్లుగా ఉన్న మొండి బకాయిల కేటాయింపులు ఈ క్యూ3లో రూ.440 కోట్లకు తగ్గాయి. మొత్తం కేటాయింపులు రూ.6,531 కోట్ల నుంచి రూ.522 కోట్లకు చేరాయి. ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో ఐడీబీఐ బ్యాంక్ షేర్ 2 శాతం లాభంతో రూ.37 వద్ద ముగిసింది.

## రెండు రోజుల నష్టాలకు బ్రేక్





- లాభాల్లో ప్రపంచ మార్కెట్లు
- 237 పాయింట్లు లాభపడి 41,216కు సెన్సెక్స్
- 76 పాయింట్లు పెరిగి 12,108కు నిఫ్టీ

కరోనా వైరస్ బాధితులకు సంబంధించిన కొత్త కేసులు తగ్గడంతో ప్రపంచ మార్కెట్లతో పాటే మన మార్కెట్ కూడా మంగళవారం లాభపడింది. రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు లాభపడటం కలిసి వచ్చింది. సెన్సెక్స్, నిఫ్టీలు కీలకమైన నిరోధ స్థాయిలపైకి ఎగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 237 పాయింట్లు లాభపడి 41,216 పాయింట్ల, ఎన్ఎస్ఈ నిఫ్టీ 76 పాయింట్లు పెరిగి 12,108 పాయింట్లు వద్ద ముగిశాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 474 పాయింట్ల మేర లాభపడినప్పటికీ, చివర్లో సగం లాభాలు ఆవిరయ్యాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ స్వల్పంగా తగ్గినా, ముడి చమురు ధరలు 1.5 శాతం మేర పెరిగినా, మన మార్కెట్ లాభాల్లోనే ముగిసింది. రెండు రోజుల నష్టాలకు బ్రేక్ పడింది. చాంద్రమాన కొత్త సంవత్సరాది సెలవులను చైనా దేశం కరోనా వైరస్ భయాలతో బలవంతంగా పొడిగించింది. ఈ పొడిగించిన సెలవులు పూర్తయి, చైనాలో ఫ్యాక్టరీలు మళ్లీ ఆరంభం కావడం, సోమవారం అమెరికా స్టాక్ సూచీలు కొత్త రికార్డ్‌లను సృష్టించడం సానుకూల ప్రభావం చూపించాయి. షాంఘై, హాంగ్‌కాంగ్, దక్షిణ కొరియా సూచీలు 1.2–0.3% లాభపడ్డాయి. సెలవు కారణంగా జపాన్ మార్కెట్ పనిచేయలేదు. ఇక యూరప్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి.

### ఎస్‌బీఐ కార్డ్స్ ఐపీఓకు సెబీ ఓకే

ఎస్‌బీఐ క్రెడిట్ కార్డ్ విభాగం, ఎస్‌బీఐ కార్డ్స్ అండ్ పేమెంట్ సర్వీసెస్ కంపెనీ ఐపీఓ(ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్)కు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ఆమోదం తెలిపింది. ఇష్యూ సైజు రూ.9,000–10,000 కోట్ల రేంజ్‌లో ఉంటుందని, ఈ నెల చివర్లో ఐపీఓ ఉండొచ్చని అంచనా.

## మహీంద్రా లాభం 85 శాతం డౌన్



**ముంబై:** వాహన దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం(2019–20) డిసెంబర్ క్వార్టర్‌లో 85 శాతం క్షీణించి రూ..200 కోట్లకు తగ్గిందని మహీంద్రా అండ్ మహీంద్రా తెలిపింది. డిమాండ్ సంక్షోభం కారణంగా వాహన అమ్మకాలు తగ్గడంతో నికర లాభం ఈ రేంజ్‌లో తగ్గిందని తెలిపింది. గత క్యూ3లో రూ.519 కోట్ల వన్‌టైమ్ లాభాలు రాగా, ఈ క్యూ3లో రూ.554 కోట్ల వన్‌టైమ్ నష్టాలు రావడం కూడా ప్రతికూల ప్రభావం చూపిందని పేర్కొంది. మొత్తం ఆదాయం 4% తగ్గి రూ.25,303 కోట్లకు చేరింది. మార్జిన్లు మాత్రం 13.2 శాతం నుంచి 14.8%కి చేరాయి.

**8 శాతం తగ్గిన వాహన విక్రయాలు...**

స్టాండ్‌అలోన్ పరంగా చూస్తే, నికర లాభం 73 శాతం తగ్గి రూ.380 కోట్లకు, ఆదాయం 6 శాతం తగ్గి రూ.12,120 కోట్లకు తగ్గింది. వాహన విక్రయాలు 8 శాతం తగ్గి 1.23 లక్షలకు చేరాయి. ట్రాక్టర్లు 6 శాతం తగ్గి 81,453కు, ఎగుమతులు 22 శాతం తగ్గి 9,633కు తగ్గాయి. అమ్మకాలు ఇప్పట్లో పుంజుకునే పరిస్థితుల లేవని కంపెనీ భావిస్తోంది. వచ్చే ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల వరకూ (ఈ ఏడాది సెప్టెంబర్ వరకూ) మందగమనం కొనసాగగలదని, ట్రాక్టర్ల అమ్మకాలు మాత్రం 5 శాతం పెరగగలవని అంచనా వేస్తోంది. వర్షాలు సాధారణంగానే ఉంటాయన్న అంచనాలు, గ్రామీణ ఆదాయం పెంపుపై ప్రభుత్వం దృష్టి సారించడం వంటి కారణాల వల్ల ట్రాక్టర్ల అమ్మకాలు పెరుగుతాయని భావిస్తోంది.

**మూడేళ్లలో నాలుగు కొత్త మోడళ్లు...**

మహీందా కంపెనీ మోడళ్ల బీఎస్–సిక్స్ వేరియంట్ల ధరలు రూ.20,000(పెట్రోల్) నుంచి రూ.1.3 లక్షలు(డీజిల్)కు పెరుగుతాయని కంపెనీ ఎమ్‌డీ పవన్ గోయెంకా చెప్పారు. మూడేళ్లలో నాలుగు కొత్త మోడళ్లను అందుబాటులోకి తెస్తామని వివరించారు. దేశీయ మార్కెట్లో నెలకొన్న మందగమనాన్ని తట్టుకోవడానికి కొత్త దేశాలకు ఎగుమతులు ఆరంభించనున్నామని తెలిపారు.

ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో మహీంద్రా అండ్ మహీంద్రా షేర్ 0.7 శాతం నష్టంతో రూ.524 వద్ద ముగిసింది.

### ఏప్రిల్ తర్వాత 'ఫోర్డ్ జేవీ' వాహనాలు

మహీంద్రా–ఫోర్డ్ జాయింట్ వెంచర్ తయారు చేసే వాహనాలు వచ్చే ఆర్థిక సంవత్సరంలో మార్కెట్లోకి వస్తాయని గోయెంకా తెలిపారు. ఈ జేవీకి కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఆమోదం లభించిందని పేర్కొన్నారు. సీ–ఎస్‌యూవీ, బీ–ఎస్‌యూవీ కోడ్ పేర్లతో రెండు ఎస్‌యూవీలను తయారు చేస్తున్నామని, ఈ ఏడాది ఏప్రిల్ తర్వాత ఈ వాహనాలను మార్కెట్లోకి విడుదల చేస్తామని వివరించారు. ఈ జేవీ కోసం తమ రెండు కంపెనీలు రూ.15,000 కోట్లు పెట్టుబడులు పెడుతున్నాయని తెలిపారు.

### నేటి బోర్డ్ మీటింగ్స్...

పీఎఫ్‌సీ, హిందాల్కో, ఐఆర్‌సీటీసీ, దివీస్ ల్యాబ్స్, డిష్ టీవీ, ఎన్‌బీసీసీ, ఇన్ఫోఎడ్జ్ ఇండియా, ఓమాక్సీ, ఆర్తి ఇండస్ట్రీస్, ఏబీబీ ఇండియా, జైప్రకాశ్ పవర్ వెంచర్స్

### బులియన్ రూ.లలో

| | | | |
|---|---|---|---|
| **ముంబై** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 41,630 | | 0 |
| బంగారం (22 క్యారెట్లు) | 39,650 | ▼ | 0 |
| వెండి (కిలో) | 50,000 | ▼ | 100 |
| **హైదరాబాద్/చెన్నై** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 40,660 | ▼ | 200 |
| బంగారం (22 క్యారెట్లు) | 38,720 | ▼ | 190 |
| వెండి (కిలో) | 50,000 | ▼ | 100 |
| **విశాఖపట్నం** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 41,600 | ▼ | 170 |
| బంగారం (22 క్యారెట్లు) | 38,690 | ▼ | 160 |
| వెండి (కిలో) | 47,500 | | 0 |
| **ప్రొద్దుటూరు** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 41,000 | | 0 |
| బంగారం (22 క్యారెట్లు) | 37,880 | | 0 |
| వెండి (కిలో) | 47,500 | | 0 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 41,870 | ▼ | 190 |
| బంగారం (22 క్యారెట్లు) | 38,720 | ▼ | 190 |
| వెండి (కిలో) | 47,500 | ▼ | 100 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

### కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 12-2-2020

| | |
|---|---|
| విశాఖ | 405–00 |
| చిత్తూరు | 413–00 |
| వరంగల్ | 368–00 |
| విజయవాడ | 385–00 |
| గోదావరి | 385–00 |
| **11-2-2020 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 365–00 |

# ‘మేడిగడ్డ’లో పెరిగిన ముంపు!

## బ్యారేజీ పూర్తి సామర్థ్యం 16.17 టీఎంసీలు

- ప్రస్తుతం 14 టీఎంసీలకు చేరిన నీటి నిల్వ
- తెలంగాణ, మహారాష్ట్రలోని పంట చేలలోకి చేరుతున్న నీరు
- పంట నష్టంపై ఇరిగేషన్ అధికారుల సర్వే

**కాళేశ్వరం:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజీ పరిధిలో ముంపు మరింతగా పెరిగింది. ఈ బ్యారేజీకి ఆనుకుని ప్రవహించే ప్రధానమైన నాలుగు పిల్ల వాగులు గోదావరిలో కలిసే చోట కరకట్టల నిర్మాణం జరగలేదు. దీంతో పంట చేన్లలోకి నిల్వ నీరు బ్యాక్ వాటర్ రూపంలో చేరుతోంది. తెలంగాణ, మహారాష్ట్రంలో వందల ఎకరాల్లో పంట నష్టపోతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది నవంబర్ 21 నుంచి లక్ష్మీ బ్యారేజీలోని 85 గేట్లను పూర్తిగా మూసివేశారు. ప్రాణహిత ద్వారా వచ్చే నీటి ప్రవాహాన్ని బ్యారేజీ వద్ద ఒడిసి పడుతున్నారు. ప్రాణహిత ద్వారా ప్రస్తుతం 2,200 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. లక్ష్మీ బ్యారేజీ పూర్తి సామర్థ్యం 16.17 టీఎంసీలు కాగా.. మంగళవారం సాయంత్రం వరకు 14 టీఎంసీలకు చేరింది. బ్యారేజీలో ఫుల్ రిజర్వాయర్ లెవల్ (ఎఫ్ఆర్ఎల్) 99 మీటర్ల వరకు చేరగా ఈనెల 14లోగా 100 మీటర్లకు చేర్చి పూర్తి సామర్థ్యంతో నీటిని నిల్వ చేసేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

**వర్షాకాలంలోనే..**

గతేడాది ఆగస్టు, సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు మేడిగడ్డ బ్యారేజీ వద్ద నీటి మట్టం 7.5 టీఎంసీల వరకు మాత్రమే నిలిపారు. ప్రాణహిత, గోదావరి ద్వారా వచ్చే వరద ప్రవాహంతో పాటు వర్షాలు కురుస్తుండటంతో బ్యాక్ వాటర్ మొత్తం బ్యారేజీ సరిహద్దులోని పంట చేలలోకి చేరాయి. దీంతో అధికారులు బ్యారేజీలోని 85 గేట్లు పూర్తిగా ఎత్తివేసి నీటిని దిగువకు వదిలారు. ఆ సమయంలో రోజుకు 3 నుంచి 8 లక్షల క్యూసెక్కుల వరద దిగువకు వృథాగా తరలిపోయింది.

### తెలంగాణ, మహారాష్ట్రలలో పంట నష్టం

మేడిగడ్డలోని లక్ష్మీ బ్యారేజీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలో నిర్మించారు. గోదావరి అవతలి వైపు 1.6 కిలోమీటర్ల దూరం వరకు మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సిరొంచ తాలూకా పోచంపల్లి ఒడ్డుపైకి మేడిగడ్డ బ్యారేజీ వ్యాపించి ఉంది. ఈ నిర్మాణం కోసం మండలంలోని అంబట్‌పల్లిలో 698 ఎకరాలు, మహారాష్ట్ర వైపున 568 ఎకరాల వరకు భూసేకరణ చేసి రైతులకు పరిహారం అందజేశారు.

### బ్యాక్‌వాటర్‌తో పెరిగిన ముంపు

ప్రస్తుతం నవంబర్ 21 నుంచి మేడిగడ్డ గేట్లు పూర్తిగా మూసివేయడంతో బ్యాక్‌వాటర్ నిల్వ రోజురోజుకూ పెరుగుతోంది. దీంతో రోజుకు 0.2 టీఎంసీ చొప్పున నీరు పెరుగుతోంది. ప్రస్తుతం మేడిగడ్డలో 14 టీఎంసీల నీరు చేరడంతో పంట చేనుల్లోకి నీరు అధికంగా చేరిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కుదురుపల్లి వాగు, బొమ్మాపూర్ వాగు, మహదేవపూర్‌లోని కొంగలవాగు, సూరారంలోని ఉప్పుల ఒర్రెవాగులతో ప్రధానంగా బ్యాక్ వాటర్ పంట చేలలోకి వచ్చి పత్తి, మిర్చి, పెసర రైతులు నష్టపోతున్నారు. ఈ వాగులు గోదావరిలో కలిసే చోట కరకరట్టలు, రివిట్‌మెంట్ పనులు జరగకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. కాగా, మహదేవపూర్ మండలంలో ఇంజనీరింగ్ అధికారులు పంట నష్టంపై సర్వే చేపట్టారు. అధికారుల లెక్కల ప్రకారం 190 ఎకరాల వరకు ముంపుకు గురైనట్లు ప్రాథమికంగా అంచనా వేశారు.



బ్రాహ్మణపల్లిలో నీట మునిగిన మిర్చి పంటను చూపుతున్న రైతు

**రైతులు అధైర్యపడొద్దు**

కాళేశ్వరం ప్రాజెక్టులోనే కీలకమైనది మేడిగడ్డ బ్యారేజీ. ఇందులో పూర్తి 100 ఎఫ్ఆర్ఎల్ నీరు నిల్వ చేసేందుకు టెస్టింగ్ చేస్తున్నాం. వర్షాకాలంలో పూర్తి సామర్థ్యం చూడలేం. ఇప్పుడు సాధ్యమైంది కనుక బ్యారేజీలో 100 ఎఫ్ఆర్ఎల్ వరకు నీరు చేరితే ఎంత వరకు ముంపునకు గురవుతుందనేది సర్వే ద్వారా తెలుస్తుంది. తెలంగాణలో 190, మహారాష్ట్రలో 40 ఎకరాల్లో పంట నష్టం ఉన్నట్లు ప్రాథమికంగా తేలింది. ఆయా రైతులకు పరిహారం చెల్లిస్తాం. ముంపు భూములను తీసుకోవడానికి కూడా సీఎం అనుమతి తీసుకున్నాం. మూడు నెలల్లో భూసేకరణ ప్రక్రియ జరుగుతుంది. ఇరు రాష్ట్రాల్లోని రైతులు అధైర్యపడొద్దు.

– నల్ల వెంకటేశ్వర్లు, కాళేశ్వరం బ్యారేజీ ఈఎన్‌సీ





**గిన్నిస్ కోసం..**

ఇప్పటికే తొమ్మిది గిన్నిస్ రికార్డులు సాధించిన గీతం యూనివర్సిటీలో ఇంజనీరింగ్ చదువుతున్న బీటెక్ విద్యార్థిని శివాలి జోహ్రీ శ్రీవాస్తవ మరో నాలుగు రికార్డులే లక్ష్యంగా మంగళవారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులోని గీతం కాలేజీలో భారీ ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఆమె తల్లిదండ్రులు కవితా జోహ్రీ శ్రీవాస్తవ, అనిల్ శ్రీవాస్తవలతో కలసి ఆరెగామీ కాగితంతో రూపొందించిన వేలాది బొమ్మలను ప్రదర్శించారు. ఒకదానికి మరొకటి విభిన్నమైన 2,242 క్విల్లింగ్ డాల్స్, నలుపు రంగులో ఉన్న 2,779 ఆరెగామీ పెంగ్విన్స్, లేత ఆకుపచ్చ రంగులో ఉన్న 3,663 ఎగిరే కప్పలు, 1,993 రంగు రంగుల ఆరెగామీ మాప్లీ (కెనడాలోని ఓ చెట్టు ఆకు)లను తయారు చేసి ఒకే చోట ఉంచి ప్రపంచలోనే అతి పెద్ద ప్రదర్శనగా రికార్డు నెలకొల్పింది. న్యాయ నిర్ణేతలు ఈ ప్రదర్శనను తిలకించి ధ్రువీకరణ పత్రాలను గిన్నిస్ అధికారులకు పంపారు.

– పటాన్‌చెరు

# నల్లమలలో గుప్తనిధుల వేట

## ముగ్గురు నిందితుల పట్టివేత

**మన్ననూర్:** నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని భౌరాపూర్ చెరువు వద్ద ఉన్న పురాతన భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంపై గుర్తుతెలియని వ్యక్తులు కన్నేశారు. ఈ నెల 10న హైదరాబాద్‌కు చెందిన తిరుమలేశ్ నాయుడు, ఎల్లప్ప, షహీబాజ్ అలీతో పాటు మరో ఇద్దరు వ్యక్తులు వ్యూ పాయింట్ చూసేందుకని ఫరహాబాద్ చెక్‌పోస్టులో సిబ్బందికి చెప్పి నల్లమలలోకి స్కార్పియో వాహనంలో బయలుదేరారు. ఆ తర్వాత అక్కడున్న ఆలయంలోని విగ్రహాలను పెకిలించి తవ్వకాలు జరిపారు. అనంతరం వాటిని తిరిగి ఎప్పటిలాగే సిమెంట్, ఇసుకతో శుభ్రం చేసి ధూప, దీప, నైవేద్యాలతో పూజలు చేశారు. వీరి తీరుపై అనుమానం వచ్చిన కొందరు చెంచు యువకులు మంగళవారం అధికారులకు సమాచారమిచ్చారు. దీంతో ఫరహాబాద్ చౌరస్తా చెరువుకొమ్ము లింగమయ్య వద్ద పట్టుకున్నారు. వీరిని బేస్‌క్యాంపు వద్ద విచారిస్తుండగా ఇద్దరు నిందితులు పారిపోయారు. అనంతరం ఎఫ్ఆర్‌ఓ ప్రభాకర్ సమక్షంలో అమ్రాబాద్ రేంజ్ కార్యాలయం వద్దకు ముగ్గురిని తీసుకెళ్లి పూర్తిస్థాయిలో విచారణ చేయగా గుప్త నిధుల కోసమే వచ్చినట్టు తేలింది. చెంచుల రాకపోకలపై ఆంక్షలు విధిస్తున్న అధికారులు.. ఏకంగా గుప్త నిధుల కోసం వచ్చిన వారిని అనుమతించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# ఢిల్లీలో బీజేపీ బలపడింది



లక్ష్మణ్

**యాదగిరిగుట్ట:** ఢిల్లీలో జరిగిన గత అసెంబ్లీ ఎన్నికల్లో మూడు సీట్లు సాధించిన బీజేపీ, ఇప్పుడు అధిక సీట్లు గెలుచుకుని అక్కడ బలపడిందని, ఆమ్ ఆద్మీ పార్టీకి దీటుగా ఓట్ల శాతం పెంచుకుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ అన్నారు. మంగళవారం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని ఆయన కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్న అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఢిల్లీ ఎన్నికల ఫలితాలు చూస్తే కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలు కుమ్మక్కై బీజేపీని ఓడించేందుకు కుట్రలు చేశాయని అర్థమవుతుందని ఆరోపించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 9 శాతం ఓట్లు వస్తే.. ఇప్పుడు నామమాత్రం లేకుండా కనుమరుగైందన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రాంతీయ పార్టీగా మారుతుందన్నారు. బీజేపీని దేశవ్యాప్తంగా ఓడించేందుకు కాంగ్రెస్ అన్ని పార్టీలతో కలిసి వస్తుంటే ప్రజలు మాత్రం బీజేపీ వైపు వస్తున్నారన్నారు.

# నేలకొరిగిన ఉద్యమ కెరటం

- ఆర్థిక ఇబ్బందులతో తెలంగాణ ఉద్యమకారుడు ఆత్మహత్య
- బతుకు భారమైందని మనస్తాపం.. ఎమ్మెల్యే పెద్ది నివాళి

**దుగ్గొండి:** ఉన్నత విద్యావంతుడు.. ఉద్యోగం, ఆస్తిపాస్తులు లేవు.. బతుకుదెరువు దొరుకుతుందని ఆశపడి 2001 నుంచి తెలంగాణ ఉద్యమంలో భాగమయ్యాడు. ఊరూ వాడను ఏకం చేయడంతో పాటు గిరిజన తండాల్లో ఉద్యమ బిడ్డలను తయారు చేశాడు. తెలంగాణ రాష్ట్రం వచ్చి ఆరేళ్లు గడిచినా ఎలాంటి బతుకుదెరువు దొరకలేదు. కన్నబిడ్డలు పెళ్లీడుకొచ్చినా చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో జీవితం వ్యర్థమని భావించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వరంగల్ రూరల్ జిల్లా దుగ్గొండి మండలం పీజీ తండా గ్రామానికి చెందిన నూనావత్ రవినాయక్ (40) కాకతీయ యూనివర్సిటీలో పీజీ చదువుతున్న సమయంలో తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. తెలంగాణ వచ్చిన ఆరేళ్ల నుంచి ఉద్యోగం కోసం పడరాని పాట్లు పడినా ఫలితం లేదు. ఓ పక్క ఎలాంటి ఆస్తి లేకపోవడం, ఇద్దరు కూతుళ్లు లిఖిల, కళ్యాణి డిగ్రీ చదువుతూ పెళ్లీడుకు రావడంతో భార్య జ్యోతి కూలి పనులు చేస్తూ కుటుంబపోషణలో పాలు పంచుకుంటోంది. దీంతో రవినాయక్ తీవ్ర మనస్తాపం చెంది సోమవారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున కన్నుమూశాడు. కాగా, రవినాయక్ మృతదేహం వద్ద నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి నివాళులు అర్పించారు. మృతుడి కుటుంబాన్ని ఓదార్చారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. వెంటనే రూ.25 వేల ఆర్థిక సాయాన్ని అందించారు.



నూనావత్ రవినాయక్ (ఫైల్)

# వరంగల్ కోర్టుకు కాశీం

## ఈనెల 25 వరకు రిమాండ్

**వరంగల్ లీగల్:** ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్, విప్లవ రచయితల సంఘం కార్యదర్శి చింతకింది కాశీంను పోలీసులు మంగళవారం వరంగల్ కోర్టులో హాజరుపర్చారు. ఈ మేరకు న్యాయమూర్తి బి.శివరంజని ఈ నెల 25 వరకు జ్యుడీషియల్ రిమాండ్‌కు ఆదేశించారు. కాశీం మావోయిస్టులకు సహకరిస్తున్నారనే అభియోగాలపై 2012 జూన్ 9న వరంగల్ రూరల్ జిల్లా ఖానాపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి ఈ కేసు విచారణ పెండింగ్‌లో ఉంది. అయితే, సిద్దిపేట జిల్లా ములుగు పోలీసుస్టేషన్ పరిధిలో నమోదైన కేసులో ప్రొఫెసర్ కాశీం జైలులో ఉన్న సమాచారంతో ఖానాపూర్ పోలీసులు పీటీ వారెంట్ ద్వారా మంగళవారం వరంగల్ కోర్టులో హాజరుపర్చారు. కాగా, కాశీంను పోలీసులు కోర్టులో హాజరుపర్చిన సమయంలో ఆయన సొమ్మసిల్లి పడిపోయారు. దీంతో పోలీసులు, న్యాయవాదులు కాశీంను కోర్టు హాలు నుంచి బయటకు తీసుకొచ్చి స్పృహ వచ్చే వరకు సపర్యలు చేశారు. అనంతరం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. వైద్య పరీక్షల అనంతరం వరంగల్ సెంట్రల్ జైలుకు తరలించారు.

# పోలీసులమంటూ అత్యాచారం

## నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి అఘాయిత్యం

**బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు**

**జహీరాబాద్:** మహిళతో పరిచయం పెంచుకొని ఓ గుర్తు తెలియని వ్యక్తి పోలీసునని చెప్పి అత్యాచారానికి పాల్పడ్డాడు. మంగళవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని పస్తాపూర్ క్రాస్‌రోడ్డు వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్ కథనం ప్రకారం.. కోదాడ నియోజకవర్గంలోని లక్ష్మీపురానికి చెందిన ఓ మహిళ(35) భర్త మరణించడంతో కిరాణం కొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తోంది. తన కొడుకుతో కలిసి వ్యాపారం నిమిత్తం నిషేధిత గుట్కాలను కొనేందుకు సోమవారం కర్ణాటకలోని బీదర్‌కు వెళ్లింది. మంగళవారం ఉదయం రూ.10 వేల విలువ గల గుట్కాలను అక్కడ కొనుగోలు చేసి కోదాడకు బయలుదేరింది. మార్గమధ్యలో గుర్తు తెలియని వ్యక్తితో కలిసి ఫాతిమా బేగం బస్సు దిగింది. అతనితోపాటు అతని స్నేహితుడు సైతం బస్సు దిగాడు. అయితే మొదటి వ్యక్తి తాము పోలీసులమని, బ్యాగ్‌ను తనిఖీ చేయాలని చెప్పడంతో ఆమె భయపడింది. తాము చెప్పినట్లు వినాలని, లేదంటే కేసు పెడతామని హెచ్చరించడంతో నిందితుడు చెప్పినట్లు చేస్తానని ఒప్పుకుంది. దీంతో బాధితురాలిని పస్తాపూర్ క్రాస్‌రోడ్డు వద్ద గల దుకాణాల సముదాయం వెనకకు తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. తనతో వచ్చిన మరో వ్యక్తిని, ఆమె కుమారుడిని పస్తాపూర్ క్రాస్‌రోడ్డు వద్ద గుట్కాకు కాపలా ఉంచాడు. లైంగిక దాడికి పాల్పడిన అనంతరం మహిళను అక్కడే వదిలిపెట్టి ఆమె తీసుకువచ్చిన గుట్కాతో వారు పరారయ్యారు. బాధితురాలు జహీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.



పోలీసునని చెప్పి మహిళను తీసుకెళుతున్న వ్యక్తి


**ANDHRA PRADESH SOLAR POWER CORPORATION PVT LTD**
(A JOINT VENTURE COMPANY OF GOVERNMENT OF A.P AND GOVERNMENT OF INDIA)

**DPR Enquiry Notice**

APSPCL invites quotations for Preparation of Detailed Project Reports for establishment of Solar Projects at 1) Kolimigundla Mandal of Kurnool Dist, 2) Mudigubba Mandal of Ananthapuramu Dist Last date for receipt of quotations is **24.02.2020 at 03.00 P.M.** For further details, please go through our website : www.apspcl.ap.gov.in

**MSME-TOOL ROOM, HYDERABAD**
**(CENTRAL INSTITUTE OF TOOL DESIGN)**
(A Government of India Society, Ministry of MSME)
Balanagar, Hyderabad - 500 037, INDIA
Tel.No: 91-40-2377 2749, E-Mail:citdcadcam@citdindia.org www.citdindia.org

**Innovative Ideas are Invited for Incubation Centre**

MSME TOOL ROOM, HYDERABAD (CITD) invites innovative ideas along with five minutes video presentation for its **Incubation centre** in the sectors of

1. Agriculture aids for Mechanization and boosting agri yield.
2. Agro Processing
3. Preserving & Packaging
4. Environment, Water, Sanitation, Waste and Recycling management
5. Renewable energy, EVs & Green transportation
6. Technology & Devises for prevention diagnosis, Treatment and rehabilitation of illness
7. Energy efficiency automation for industrial manufacturing
8. Security, UAVs, Disaster management & Defence

**SELECTED INNOVATIVE IDEAS WILL GET**

1. Working space, Enterprise support and Incubation for the idea in MSME Tool Room
2. Grant in aid to the host incubator for developing and nurturing the selected idea upto Rs. 15,00,000/-

**ELIGIBILITY OF INCUBATEES**

1. Applicant should be ready to setup or already have a small startup business
2. The applicant should be able to articulate the business model & conduct the entrepreneurial opportunity.

Last date for submission of Innovative ideas is **15th Feb 2020.**
**For more details contact G. SANATH KUMAR, Dy. Director (Trg.). Ph. 9908211787.**

Sd/-
PRINCIPAL DIRECTOR


# ఆటోను ఢీకొన్న లారీ.. ముగ్గురి మృతి

**హసన్‌పర్తి:** అతివేగం ముగ్గురి ప్రాణాలు బలి తీసుకుంది. ఈ ప్రమాదంలో మరో ముగ్గురు గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వరంగల్ అర్బన్ జిల్లాలోని హసన్‌పర్తి కాకతీయ గ్రామీణ బ్యాంక్ వద్ద మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను అతివేగంగా వచ్చిన గ్రానైట్ లారీ ఢీకొనగా హసన్‌పర్తికి చెందిన అరికెటి గట్టమ్మ (50), బావుపేటకు చెందిన మర్రి శ్రీకాంత్ (24) అక్కడికక్కడే మృతి చెందారు. అలాగే, వర్ధన్నపేటకు చెందిన బీటెక్ విద్యార్థిని కలకోట్ల స్రవంతి అలియాస్ శ్రావణి (18) ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. ఇదే ఘటనలో నవ్యశ్రీ, సరోజన, ఆటో డ్రైవర్ అరుణ్‌కు గాయాలయ్యాయి. అయితే ఘటన జరిగిన వెంటనే డ్రైవర్ వేగంగా వెళ్తున్న లారీపై నుంచి కిందకు దూకగా.. లారీ మాత్రం అదే వేగంతో రోడ్డు కిందికి దూసుకెళ్లింది. ఘటన స్థలాన్ని వరంగల్ సీపీ రవీందర్, పోలీసులు పరిశీలించి వివరాలు ఆరా తీశారు.



శ్రీకాంత్ | స్రవంతి | గట్టమ్మ



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో


**IFCI LIMITED**
(A Govt. of India Undertaking)

ప్రాంతీయ కార్యాలయం: IFCI లిమిటెడ్, 8వ అంతస్తు, తారామండల్ కాంప్లెక్స్, 5-9-13, సైఫాబాద్, హైదరాబాద్-500 004
ఫోన్:+91-040-23243505/06
ఫ్యాక్స్: +91-040-23241138
వెబ్‌సైట్ : www.ifciltd.com
CIN : L74899DL1993GOI053677

**ఇ-వేలం అమ్మకం ప్రకటన**

**శ్రీ కృష్ణ స్టాకిస్ట్స్ అండ్ ట్రేడర్స్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క సెక్యూర్డ్ ఆస్తుల అమ్మకం కొరకు**

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్9తో చదువబడే రూల్ 8(6) క్రింద సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (SRFA & ESI చట్టం, 2002)లోని నిబంధనల ప్రకారం)

శ్రీకృష్ణ స్టాకిస్ట్స్ అండ్ ట్రేడర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (SKSTPL) నుంచి అంగీకరించిన రేట్లలో తదుపరి వడ్డీతో మరియు ఇతర డెబిట్స్‌తో కలిపి **30-11-2017** నాటికి **రూ. 82,37,73,626 (ఎనభై రెండు కోట్ల ముప్పై ఏడు లక్షల డెబ్బై మూడు వేల ఆరు వందల ఇరవై ఆరు రూపాయలు మాత్రమే)** IFCI లిమిటెడ్ యొక్క సెక్యూర్డ్ రుణాలు రాబట్టుకోడానికి SARFA&ESI చట్టం 2002 క్రింద అధీకృత అధికారి స్వాధీనం చేసుకున్న దానికి అనుగుణంగా, (SKSTPL చే వినియోగించుకోబడిన పైన తెలిపిన రుణసదుపాయాలు పొందేందుకు IFCI లిమిటెడ్ వద్ద తనఖా పెట్టిన) ఆస్తులు ఇ-వేలం ద్వారా **"ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే మరియు అక్కడ ఏమున్నవో అవే పద్ధతిపై మరియు ఎటువంటి సహాయం లేని పద్ధతిపైన"** కొనుగోలు చేయుటకు దిగువ సంతకందారుచే ఆఫర్లు కోరబడుచున్నవి. SKSTPL చెల్లించవలసిన బకాయి మొత్తాలు **15-01-2020** వరకు లెక్కకట్టిన **రూ. 126,27,71,024.53 (ఒక వంద ఇరవై ఆరు కోట్ల ఇరవై ఏడు లక్షల డెబ్బయి ఒక వేల ఇరవై నాలుగు రూపాయల యాభై మూడు పైసలు మాత్రమే)** వసూలు తేదీ వరకు **16-01-2020** నుండి వర్తింపుతో తదుపరి వడ్డీ మరియు ఇతర డెబిట్స్‌తో కలిపి చెల్లించవలసి ఉంది. అమ్మకానికి ఆస్తులు/ప్రోపర్టీస్ వివరాలు మరియు దాని రిజర్వు ధర దిగువ తెలియజేయబడినది.

**ఆస్తుల వివరణ** (రూ. కోట్లలో)

| లాట్ | ఆస్తి వివరణ | రిజర్వు ధర | బయానా | తనిఖీ తేదీ, సమయం | ఇ-వేలం తేదీ, సమయం |
|---|---|---|---|---|---|
| A | దిగువ సర్వే నంబర్లు కలిగి **ఎకరాలు 4-43 సెంట్లు** విస్తీర్ణంగల వ్యవసాయేతర భూమి: R.S. No. 1018 విస్తీర్ణం ఎకరాలు 4.43 సెంట్లు ఇది శ్రీకృష్ణ స్టాకిస్ట్స్ అండ్ ట్రేడర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సొంతమై ఉండి **దేవరపల్లి గ్రామం** మరియు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, రిజిస్ట్రేషన్ సబ్ జిల్లా కొవ్వూరు, ఆంధ్రప్రదేశ్‌లో ఉంది. | 1.99 | 0.20 | 27-02-2020న ఉ.11.00 గం. నుండి సా.4.00 గం. వరకు | 19-03-2020న ఉ.10.00 గం. నుండి ఉ.11.00 గం. వరకు |
| B | దిగువ సర్వే నంబర్లు కలిగి **ఎకరాలు 4-63 సెంట్లు** విస్తీర్ణంగల వ్యవసాయేతర భూమి: (i) R.S. No. 323 విస్తీర్ణం ఎకరాలు 1.50 సెంట్లు; (ii) R.S. No. 325/1 విస్తీర్ణం ఎకరాలు 2.79 సెంట్లు; (iii) R.S. No. 325/4 విస్తీర్ణం ఎకరాలు 0.34 సెంట్లు; ఇది శ్రీకృష్ణ స్టాకిస్ట్స్ అండ్ ట్రేడర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సొంతమై ఉండి **దుద్దుకూరు గ్రామం** మరియు తాలూకా, పశ్చిమ గోదావరి జిల్లా, రిజిస్ట్రేషన్ సబ్ జిల్లా కొవ్వూరు, ఆంధ్రప్రదేశ్‌లో ఉంది. | 1.85 | 0.19 | 27-02-2020న ఉ.11.00 గం. నుండి సా.4.00 గం. వరకు | 19-03-2020న ఉ.11.15 గం. నుండి మ. 12.15 గం. వరకు |
| C | దిగువ సర్వే నంబర్లు కలిగి **ఎకరాలు 3-99 సెంట్లు** విస్తీర్ణంగల వ్యవసాయేతర భూమి: (i) R.S. No. 330/2 విస్తీర్ణం ఎకరాలు 3.99 సెంట్లు; ఇది శ్రీకృష్ణ స్టాకిస్ట్స్ అండ్ ట్రేడర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సొంతమై ఉండి దొమ్మేరు శివారు, **కాపవరం గ్రామం** మరియు తాలూకా, పశ్చిమ గోదావరి జిల్లా, రిజిస్ట్రేషన్ సబ్ జిల్లా కొవ్వూరు, ఆంధ్రప్రదేశ్‌లో ఉంది. | 2.40 | 0.24 | 27-02-2020న ఉ.11.00 గం. నుండి సా.4.00 గం. వరకు | 19-03-2020న మ.12.30 గం. నుండి మ. 1.30 గం. వరకు |
| D | దిగువ సర్వే నంబర్లు కలిగి **ఎకరాలు 8-10 సెంట్లు** విస్తీర్ణంగల వ్యవసాయేతర భూమి: (i) R.S. No. 34/13 విస్తీర్ణం ఎకరాలు 1.25 సెంట్లు; (ii) R.S. No. 34/14 విస్తీర్ణం ఎకరాలు 1.67 సెంట్లు; (iii) R.S. No. 35/1 విస్తీర్ణం ఎకరాలు 2.43 సెంట్లు; (iv) R.S. No. 35/2 విస్తీర్ణం ఎకరాలు 2.75 సెంట్లు; ఇది శ్రీకృష్ణ స్టాకిస్ట్స్ అండ్ ట్రేడర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సొంతమై ఉండి **చాగల్లు గ్రామం** మరియు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, రిజిస్ట్రేషన్ సబ్ జిల్లా కొవ్వూరు, ఆంధ్రప్రదేశ్‌లో ఉంది. | 3.24 | 0.32 | 28-02-2020న ఉ.11.00 గం. నుండి సా.4.00 గం. వరకు | 19-03-2020న మ.1.45 గం. నుండి మ. 2.45 గం. వరకు |
| E | దిగువ సర్వే నంబర్లు కలిగి **ఎకరాలు 5-70 సెంట్లు** విస్తీర్ణంగల వ్యవసాయేతర భూమి: (i) R.S. No. 346/2A విస్తీర్ణం ఎకరాలు 5.70 సెంట్లు; ఇది శ్రీకృష్ణ స్టాకిస్ట్స్ అండ్ ట్రేడర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సొంతమై ఉండి **చాగల్లు గ్రామం** మరియు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, రిజిస్ట్రేషన్ సబ్ జిల్లా కొవ్వూరు, ఆంధ్రప్రదేశ్‌లో ఉంది. | 2.28 | 0.23 | 28-02-2020న ఉ.11.00 గం. నుండి సా.4.00 గం. వరకు | 19-03-2020న మ.3.00 గం. నుండి సా. 4.00 గం. వరకు |
| F | దిగువ సర్వే నంబర్లు కలిగి **ఎకరాలు 6-69 సెంట్లు** విస్తీర్ణంగల వ్యవసాయేతర భూమి: (i) R.S. No. 220/1 విస్తీర్ణం ఎకరాలు 0.38 సెంట్లు; (ii) R.S. No. 220/2 విస్తీర్ణం ఎకరాలు 0.35 సెంట్లు; (iii) R.S. No. 220/3 విస్తీర్ణం ఎకరాలు 0.72 సెంట్లు; (iv) R.S. No. 220/4 విస్తీర్ణం ఎకరాలు 2.15 సెంట్లు; (v) R.S. No. 220/5 విస్తీర్ణం ఎకరాలు 0.86 సెంట్లు; (vi) R.S. No. 220/6 విస్తీర్ణం ఎకరాలు 0.31 సెంట్లు; (vii) R.S. No. 220/7 విస్తీర్ణం ఎకరాలు 0.27 సెంట్లు; (viii) R.S. No. 220/8 విస్తీర్ణం ఎకరాలు 1.13 సెంట్లు; (ix) R.S. No. 223/2 విస్తీర్ణం ఎకరాలు 0.52 సెంట్లు; ఇది శ్రీకృష్ణ స్టాకిస్ట్స్ అండ్ ట్రేడర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సొంతమై ఉండి **ఉనగట్ల గ్రామం**, చాగల్లు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, రిజిస్ట్రేషన్ సబ్ జిల్లా కొవ్వూరు, ఆంధ్రప్రదేశ్‌లో ఉంది. | 2.68 | 0.27 | 28-02-2020న ఉ.11.00 గం. నుండి సా.4.00 గం. వరకు | 19-03-2020న సా. 4.15 గం. నుండి సా. 5.15 గం. వరకు |

**నియమ నిబంధనలు**

1. ఇ-వేలం **https://ifciltd.auctiontiger.net** ద్వారా ఆన్‌లైన్‌లో నిర్వహించబడుతుంది మరియు ఇ-వేలం ప్రతి బిడ్ కోసం ప్రతి 10 నిమిషాల పొడిగింపుతో పైన తెలిపిన తేదీ మరియు సమయాన సర్వీస్ ప్రొవైడర్ అనగా **M/s e-Procurement Technologies Limited (Auction Tiger)** సహాయంతో నిర్వహించబడుతుంది. విడి లాట్లు A నుంచి Fలో ప్రతి ఆస్తికి విడివిడిగా కనీస బిడ్ ఇంక్రిమెంట్ మొత్తం రూ.1,00,000/- ఉంటుంది.
2. పాల్గొనాలనుకునే ఆసక్తిగల వ్యక్తులు (ఎ) బయానా డిపాజిట్, (బి) వారి పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోగ్రాఫ్, (సి) ఫొటో ఐడెంటిటీ కార్డ్ యొక్క కాపీ మరియు (డి) పూర్తి కాంటాక్ట్ వివరాలతో పాటు కాంటాక్ట్ / మొబైల్ నంబర్ దాఖలు చేయవలెను.
3. సవివరమైన అమ్మకం నియమ నిబంధనలు కలిగిన టెండరు డాక్యుమెంట్‌ను IFCI లిమిటెడ్ కార్యాలయం, హైదరాబాద్ నుంచి 12/02/2020 నుంచి రూ.1,000/- చెల్లించి పొందవచ్చును లేదా IFCI వెబ్‌సైట్ **(www.ifciltd.com)** నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. అయితే టెండరు డాక్యుమెంట్‌ను IFCI లిమిటెడ్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుంటే, బిడ్డరు బయానాతో పాటు టెండరు డాక్యుమెంట్ నిమిత్తం రూ.1,000/- అదనంగా చెల్లించవలెను.
4. ఆసక్తిగల బిడ్డర్లు పైన తెలిపిన రిజర్వు ధరలో 10% బయానాను "IFCI Limited" పేరున హైదరాబాద్ వద్ద చెల్లించబడేలా తీసిన డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో డిపాజిట్ చేయవలెను మరియు "The Authorised Officer, IFCI Limited, 8th Floor, Taramandal Complex, 5-9-13, Saifabad, Hyderabad-500 004"వారికి పంపించవలెను. టెండరుతో పాటు బయానా మొత్తాన్ని **"The Authorised Officer, IFCI Limited, 8th Floor, Taramandal Complex, 5-9-13, Saifabad, Hyderabad-500 004"**వారికి డిపాజిట్ చేయుటకు **చివరి తేదీ మరియు సమయం 16/03/2020న 1600 గం. వరకు.**
5. బయానా స్వీకరించిన మీదట, కాగోరు బిడ్డర్లు వారి చెల్లుబాటగు ఇ-మెయిల్ ఐడి (ఇ-వేలం కోసం తప్పనిసరి)పై యూజర్ ఐడి/పాస్‌వర్డ్‌ను **M/s e-Procurement Technologies Limited (Auction Tiger)** నుంచి పొందుతారు. కాగోరు బిడ్డర్లు **M/s e-Procurement Technologies Limited (Auction Tiger)** నుంచి ఇ-వేలంపై ఆన్‌లైన్ శిక్షణను వినియోగించుకోవచ్చును. సర్వీస్ ప్రొవైడర్ హెల్ప్ డెస్క్ నంబరు 9265562828/ 07961200530/ 7989449311 మరియు ఇ-మెయిల్: **Telangana@auctiontiger.net / sudhir@auctiontiger.net / rikin@auction-tiger.net**
6. కృతార్థుడైన బిడ్డర్ యొక్క బయానా పాక్షిక అమ్మకం నిమిత్తం ఉంచుకోబడుతుంది మరియు కృతార్థులు కాని బిడ్డర్(ల) బయానా తిరిగి ఇవ్వబడుతుంది. బయానాకు వడ్డీ ఉండదు. గెలుపొందిన బిడ్డర్ అమ్మకం / వేలం ప్రొసీడ్స్‌లో 25% (బయానాతో కలిపి) "IFCI Limited" పేరున హైదరాబాద్ వద్ద చెల్లించబడేలా తీసిన డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా లేదా RTGS (RTGS వివరాలను IFCI కార్యాలయం నుంచి పొందవచ్చును) ద్వారా లేదా అధీకృత అధికారి, **శ్రీ బర్రె ప్రసాద్, DGM, IFCI లిమిటెడ్,** హైదరాబాద్ (మొబైల్ నం.**+91 9951611808**లో మరియు **b.prasad@ifciltd.com** లో కూడా అందుబాటులో ఉంటారు) వారికి అదేరోజున 1700 గం.లోగా డిపాజిట్ చేయాలి.
7. కృతార్థుడైన బిడ్డర్ అమ్మకం / వేలం ప్రొసీడ్స్‌లో మిగతా 75% మొత్తాన్ని అమ్మకం తేదీ 15వ రోజు ముందు లేదా ఆలోగా లేదా వ్రాతపూర్వకంగా అంగీకరించిన పిదప మరియు అధీకృత అధికారి విచక్షణ మేరకు అట్టి పొడిగించిన కాలంలోగా డిపాజిట్ చేయాలి. కృతార్థుడైన బిడ్డర్ విఫలమైతే ఇప్పటికే చెల్లించిన మొత్తం స్వాధీనం చేసుకోబడుతుంది మరియు ఆస్తి తిరిగి వేలానికి ఉంచబడుతుంది మరియు అట్టి బిడ్డరుకు ఆస్తికి/మొత్తానికి సంబంధించి ఎలాంటి క్లెయిం/హక్కు ఉండదు.
8. వేలానికి ఉంచిన ఆస్తికి సంబంధించిన తాకట్టు రుణభారాలు, ప్రదేశం మరియు టైటిల్‌కు సంబంధించి మరియు ఆస్తిని ప్రభావితం చేసే క్లెయింలు/హక్కులు బకాయిలు మొదలైన వాటి గురించి కాగోరు బిడ్డర్లు తమ బిడ్ దాఖలు చేసేముందు తమకు తాము తమ స్వంత, స్వతంత్ర విచారణలను చేసుకోవాలి. మరియు సంతృప్తి చెందాలి. ఇ-వేలం ప్రకటన IFCI లిమిటెడ్ పక్షాన ఎటువంటి నిబద్ధతను లేదా ప్రాతినిధ్యాన్ని కల్పించదు మరియు కల్పిస్తున్నట్లు భావించరాదు. IFCI లిమిటెడ్‌కు తెలిసిన లేదా తెలియని, అన్ని ప్రస్తుత మరియు భవిష్యత్ తాకట్టు రుణభారాలతో ఆస్తి విక్రయించబడుతుంది.
9. వర్తించే స్టాంప్ డ్యూటీలు/అదనపు స్టాంప్ డ్యూటీ/బదిలీ చార్జీలు, రుసుము మొదలైన వాటిని మరియు ఎవరికైనా చెల్లించవలసిన చట్టబద్ధమైన/చట్టబద్ధంకాని బకాయిలు, పన్నులు, రేట్లు, అసెస్‌మెంట్ ఛార్జీలు, రుసుము మొదలైన వాటిని కృతార్థులైన కొనుగోలుదారు భరించవలెను.
10. అత్యధిక ఆఫరును అంగీకరించుటకు అధీకృత అధికారి కట్టుబడి ఉండరు మరియు ఎలాంటి కారణం తెలియజేయకుండానే ఏదేని లేదా అన్ని ఆఫర్(ల)ను అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు లేదా ఇ-వేలాన్ని వాయిదావేయుటకు/నిలిపివేయుటకు/ రద్దుచేయుటకు అధీకృత అధికారి సంపూర్ణ హక్కు కలిగియున్నారు.
11. అధీకృత అధికారి ముందస్తు సమాచారంతో/అనుమతితో పైన తెలిపిన తేదీన మరియు సమయాన ఆసక్తిగల పార్టీలు ఆస్తిని తనిఖీ చేసుకోవచ్చును, మరియు అధీకృత అధికారిని **9951611808**లో సంప్రదించగలరు. పార్టీలు ప్రత్యామ్నాయంగా **శ్రీ దీపక్ మిశ్రా, GM - 9990725911** లేదా **శ్రీ ఎస్. శ్రీనివాస్, DGM - 9121010844** లేదా **శ్రీ ఎమ్. శ్రీనివాస్ రావు, AGM - 9990725939** వారిని సంప్రదించవచ్చును.
12. ఏదేని కోర్టు/ట్రిబ్యునల్/ఫోరం స్టే/ఏదేని ఇతర నిలుపుదల ఉత్తర్వు కారణంగా జరిగే ఖాళీ స్వాధీనత అందజేయడంలో కలిగిన ఏదేని జాప్యానికి లేదా ఏదేని కోర్టు లేదా ట్రిబ్యునల్ లేదా ఫోరం ఆక్షన్ ప్రొసీడింగ్స్‌కు స్టే విధిస్తే బిడ్డరు చెల్లించిన ఏ మొత్తంపైన ఎటువంటి ఖర్చు, డ్యామేజ్‌లు మరియు వడ్డీ మొదలైన వాటిని IFCI చెల్లించదని ఆసక్తిగల బిడ్డర్లకు తెలియజేయడమైనది.

ప్రదేశం: హైదరాబాద్
తేది: 12.02.2020

సం/- ఆథరైజ్డ్ ఆఫీసర్
IFCI లిమిటెడ్

## మెట్రోలో ఒకే రోజు
# 4.47 లక్షల మంది ప్రయాణం



**సాక్షి, హైదరాబాద్:** గ్రేటర్ వాసుల కలల మెట్రో రైలులో ప్రయాణికుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. సోమవారం ఒకే రోజు 4.47 లక్షల మంది ప్రయాణికులు మూడు మెట్రో మార్గాల్లో రాకపోకలు సాగించినట్లు హెచ్‌ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. కొత్తగా ప్రారంభమైన జేబీఎస్–ఎంజీబీఎస్ మార్గంలో 34 వేల మంది ప్రయాణించారని ఆయన చెప్పారు. ఎల్బీనగర్–మియాపూర్ రూట్‌లో 2.46 లక్షల మంది, నాగోల్–రాయదుర్గం మార్గంలో 1.67 లక్షల మంది తమ గమ్యస్థానాలకు చేరుకున్నారని పేర్కొన్నారు. అత్యధికంగా అమీర్‌పేట స్టేషన్ నుంచి 26 వేల మంది, ఎల్బీనగర్ స్టేషన్ నుంచి 24 వేల మంది, రాయదుర్గం నుంచి 22 వేల మంది, మియాపూర్ నుంచి 19 వేలు, కేపీహెచ్‌బీ నుంచి 17 వేలు, సికింద్రాబాద్ ఈస్ట్ స్టేషన్ నుంచి 15 వేల మంది రాకపోకలు సాగించారని వివరించారు. నిత్యం స్మార్ట్ కార్డులు వినియోగించి మెట్రో రైళ్లలో ప్రయాణించే వారి సంఖ్య 50 వేలకు చేరిందన్నారు. మెట్రో ప్రయాణికుల సంఖ్య వారానికి పది వేల చొప్పున పెరుగుతోందన్నారు.

## గాంధీలో ఏడుగురు
# కరోనా అనుమానితులు



**హైదరాబాద్:** సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ఐసోలేషన్ వార్డులో మంగళవారం ఏడుగురు కరోనా అనుమానితులు అడ్మిట్ అయ్యారు. ఐసోలేషన్ వార్డులోనే అనుమానితులకు ఎక్స్‌రేలు తీసి, రక్త నమూనాలు సేకరించి నిర్ధారణ పరీక్షలకు గాంధీ మెడికల్ కాలేజీలోని వైరాలజీ ల్యాబ్‌కు పంపించారు. ఇప్పటివరకు గాంధీ ఆస్పత్రిలో 52 మంది కరోనా అనుమానితులు అడ్మిట్ కాగా కరోనా నెగిటివ్ వచ్చిన 45 మందికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించి డిశ్చార్జ్ చేశామని నోడల్ అధికారి ప్రభాకరరెడ్డి తెలిపారు. వారం తర్వాత జలుబు, దగ్గు, జ్వరం ఉన్నట్లయితే మరోమారు గాంధీ ఆస్పత్రికి వచ్చి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని వివరించామని తెలిపారు. ఐసోలేషన్, ఎక్యూట్ మెడికల్ కేర్ వార్డుల్లో 30 పడకలు, పేయింగ్ రూమ్ విభాగంలో ఏడు పడకలతో ఏర్పాటు చేసిన వీఐపీ వార్డును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చామన్నారు.

## 1,01,116 మొక్కలు నాటి
# కేసీఆర్ జన్మదిన వేడుకలు



**సాక్షి, హైదరాబాద్:** ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు జన్మదినం సందర్భంగా ఈ నెల 17న రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ విద్యా సంస్థల్లో 1,01,116 మొక్కలు నాటి సంబురాలు నిర్వహించనున్నట్లు విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి వెల్లడించారు. సీఎం పుట్టిన రోజున ఆయనకు కానుకగా ప్రతి ఒక్క విద్యార్థి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొననున్నారని తెలిపారు. పాఠశాలలు, ఇంటర్మీడియట్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల్లో మొక్కలు నాటేందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించామని మంత్రి చెప్పారు. మొక్కలు నాటడమే కాకుండా ఉపాధ్యాయుల పర్యవేక్షణలో వాటి సంరక్షణా బాధ్యతలు కూడా స్వీకరిస్తామన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో నాటేందుకు అవసరమైన మొక్కలను అందుబాటులో ఉంచామని వివరించారు. కార్యక్రమంలో స్థానికంగా ఉన్న ప్రజా ప్రతినిధులను కూడా భాగస్వాములను చేయనున్నామని పేర్కొన్నారు.




## యూఏవీ ప్రయోగం
# విజయవంతం

**తొలి 3డీ యూఏవీని రూపొందించిన టి వర్క్స్**

**సాక్షి, హైదరాబాద్:** తొలి 3డీ ముద్రిత మానవ రహిత ఏరియల్ వెహికల్ (యూఏవీ) తొలిసారిగా మంగళవారం విజయవంతంగా గాలిలోకి ఎగిరింది. 3డీ ముద్రిత మానవ రహిత విమానాన్ని 'టి వర్క్స్'గతేడాది నవంబర్‌లో రూపొందించగా, పలు ప్రయత్నాల తర్వాత గాలిలోకి ఎగిరింది. గంటకు 80 కి.మీ. వేగంతో గాలిలోకి ఎగిరిన విమానం వేగం పుంజుకుని ఆ తర్వాత గంటకు 140 కి.మీ. వేగాన్ని అందుకుంది. సుమారు రెండు నిమిషాల పాటు గాలిలో ప్రయాణించిన తర్వాత రేడియో సంబంధాలను కోల్పోయి నేలకూలింది. ఈ అనుభవంతో మరింత మెరుగైన యూఏవీని త్వర లో తయారుచేస్తామని టి వర్క్స్ ప్రకటిం చింది. 3డీ ముద్రిత యూఏవీని తయారు చేయడంలో టి వర్క్స్ చేసిన కృషిని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె.తారకరామారావు అభినందించారు. ఎన్నో ప్రత్యేకతలను కలిగిన యూఏవీ తయారీలో పూర్తిగా 3డీ ముద్రిత విడి భాగాలను ఉపయోగించారు. ఈ విడి భాగాలను పాలీ లాక్టిక్ యాసిడ్ (పీఎల్ఏ), అక్రిలోనైట్రిల్ బ్యూటడీన్ స్టిరీన్, హై ఇంపాక్ట్ పాలిస్టీన్ (హెచ్‌ఐపీఎస్) వంటి పదార్థాలతో తయారు చేశారు. ఒకటిన్నర కిలోల బరువున్న ఈ యూఏవీని గంటకు 200 కి.మీ. వేగంతో పయనించే సామర్థ్యంతో రూపొందించారు. మంగళవారం జరిగిన ప్రయోగ ఫలితాల ఆధారంగా భవిష్యత్‌లో 3డీ ముద్రిత యూఏవీల ఎయిరోడైనమిక్ ధర్మాలను విశ్లేషించి, మరింత మెరుగైన యూఏవీని తయారుచేసేందుకు టి వర్క్స్ సన్నాహాలు చేస్తోంది.

**ప్రోటోటైప్‌ల తయారీ సులభం..**

ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రోమెకానికల్, మెకానికల్ రంగాలకు సంబంధించి దేశంలోనే అతిపెద్ద ప్రోటోటైప్ సెంటర్‌గా పేరొందిన టి వర్క్స్.. ఎయిరోస్పేస్ రంగంలో 3డీ ప్రింటింగ్ అప్లికేషన్ల సామర్థ్యం, పనితీరుపై వరుస పరిశోధనలు చేస్తోంది. గతంలో ఎయిర్‌క్రాఫ్ట్‌ల విడిభాగాలను కలప, ప్లైవుడ్‌తో తయారు చేసేందుకు నాలుగైదు వందల గంటల సమయం పట్టేది. కానీ కంప్యూటర్‌లో విడి భాగాల డిజైనింగ్, 3డీ ప్రింటర్ల ద్వారా ప్రోటోటైప్‌ల తయారీ సులభతరమైంది. యూఏవీలో అంతర్భాగాలను నట్లు, బోల్టులు తదితరాలతో సంబంధం లేకుండానే తేనెపట్టులో అమర్చినట్లు బిగించి రూపాన్ని ఇచ్చారు. లిథియం పాలిమర్ బ్యాటరీ వినియోగంతో తక్కువ ఖర్చుతో, తక్కువ సంక్లిష్టతతో తయారు చేసిన ఈ యూఏవీ డిజైన్, 3డీ విడి భాగాల ముద్రణకు వంద గంటల సమయం మాత్రమే పట్టిందని టి వర్క్స్ వర్గాలు వెల్లడించాయి.

## కళ్లు తిరిగే కరెంటు బిల్లు

**గిర్మాపూర్ గ్రామ పంచాయతీ బకాయి రూ. 4,39,791**

**పెద్దేముల్:** వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం గిర్మాపూర్ గ్రామ పంచాయతీ కరెంటు బిల్లు చూసిన ఆ గ్రామ సర్పంచ్ జయమ్మ, వార్డు సభ్యులు అవాక్కయ్యారు. గ్రామ పంచాయతీకి సంబంధించి రూ. 4,39,791 బకాయి ఉన్నట్లు విద్యుత్ సిబ్బంది వారికి బిల్లు అందజేయడంతో షాకయ్యారు. ఐదేళ్ల పాటు కూడా తమ పంచాయతీకి అంత ఆదాయం రాదని సర్పంచ్, సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లు ఎలా కట్టాలో తెలియడం లేదని వాపోయారు. ఇంత బకాయి ఎలా పేరుకుపోయిందనే వివరాలు అడిగితే సిబ్బంది తమకు తెలియదని సమాధానం చెప్పారని పేర్కొన్నారు.

# గాంధీలో డాక్టర్ హల్‌చల్

## పెట్రోల్ బాటిళ్లు నడుముకు కట్టుకుని గంటన్నరపాటు హైడ్రామా

- చాకచక్యంగా వైద్యుడు వసంతకుమార్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- చిలకలగూడ పోలీసులకు సీపీ నజరానా



గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో నిప్పంటించుకుంటానని బెదిరిస్తున్న వైద్యుడు వసంత్‌కుమార్



చేతిలో లైటర్

**హైదరాబాద్:** సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో డాక్టర్ వసంత్‌కుమార్ మంగళవారం నడుముకు పెట్రోల్ బాటిళ్లు, చేతిలో లైటర్‌తో హల్‌చల్ చేశారు. సుమారు గంటన్నర పాటు పోలీసులు, వైద్య సిబ్బందికి ముచ్చెమటలు పట్టించారు. చివరకు పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని బేగంపేట ఠాణాకు తరలించారు. ఈ ఘటనలో చాకచక్యంగా వ్యవహరించిన చిలకలగూడ పోలీసులకు నగర కొత్వాలు రూ.10,000 నజరానా ప్రకటించారు. గాంధీ ఆస్పత్రిలో డాక్టర్ వసంత్‌కుమార్ క్యాజువాలిటి మెడికల్ ఆఫీసర్ (సీఎంఓ)గా విధులు నిర్వహిస్తూ, టీజీజీడీఏ గాంధీ యూనిట్ కార్యదర్శిగా కొనసాగుతున్నారు. కరోనా అనుమానితులకు అందించాల్సిన సేవలపై గాంధీ సూపరింటెండెంట్ శ్రవణ్‌కుమార్ నేతృత్వంలో ఈ నెల 7న ఆస్పత్రి పాలనా యంత్రాంగం సమావేశమైంది. అక్కడకు వచ్చిన వసంత్‌కుమార్ పారిశుధ్య నిర్వహణ, నర్సింగ్ సిబ్బంది కొరతపై మాట్లాడుతూ.. ఆర్ఎంఓ జయకృష్ణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని కోరినా వినిపించుకోకుండా పాలనాయంత్రాంగం పట్ల దురుసుగా ప్రవర్తించారు. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న పాలనా యంత్రాంగం వైద్య ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో వసంత్‌కుమార్‌ను డైరెక్టర్ ఆఫ్ మెడికల్ హెల్త్ (డీఎంహెచ్)కు సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

**పెట్రోల్ బాటిళ్లు కట్టుకుని...**

ఈ క్రమంలో వసంత్‌కుమార్ మంగళవారం మధ్యాహ్నం 12.05 గంటలకు మూడు లీటర్ల పెట్రోల్‌ను బాటిళ్లలో నింపి నడుముకు కట్టుకుని, చేతిలో లైటర్ పట్టుకుని గాంధీ ఆస్పత్రి ప్రధాన భవనం వద్దకు చేరుకున్నారు. తనను అన్యాయంగా సరెండర్ చేశారని, గాంధీ ఆస్పత్రిలో అవినీతి, అక్రమాలను ప్రశ్నించినందుకే ఇలా చేశారని ఆరోపించారు. పోలీసులు, వైద్యులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. దగ్గరకు వస్తే నిప్పంటించుకుంటానని బెదిరించడంతో దగ్గరకు వెళ్లేందుకు ఎవరూ సాహసించలేదు. సుమారు గంటన్నరపాటు హైడ్రామా కొనసాగింది. పరిస్థితి చేయిదాటుతుందని భావించిన పోలీసులు వ్యూహం సిద్ధం చేశారు. వసంత్‌కుమార్‌తో మీడియా ప్రతినిధులు మాట్లాడుతుండగా సీఐ బాలగంగిరెడ్డి ఒక్క ఉదుటున అతన్ని సమీపించి చేతిని వెనకకు విరిచి పట్టుకుని లైటర్‌ను గుంజుకోగా, మిగిలిన సిబ్బంది క్షణాల్లో ఆయన నడుముకున్న బాటిళ్లను తీసేశారు. అనంతరం బేగంపేట ఠాణాకు తరలించారు.

ఈ ఘటనను జనరల్ డైరీ (జీడీ)లో పొందుపర్చామని, న్యాయనిపుణుల సలహా మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని చిలకలగూడ సీఐ తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించి వైద్యుని ప్రాణాలు కాపాడినందుకు నగర కొత్వాల్ అంజనీకుమార్.. చిలకలగూడ సీఐ బాలగంగిరెడ్డి, పోలీస్ సిబ్బందికి రూ.10 వేల నజరానా ప్రకటించారు.

**కన్నీటిపర్యంతమైన జ్యోతిర్మయి....**

వసంత్‌కుమార్ భార్య జ్యోతిర్మయి గాంధీ గైనకాలజీ విభాగంలో వైద్యురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. నిండు గర్భిణి అయిన ఆమె ఆస్పత్రిలో జరిగిన ఘటనను చూస్తూ కన్నీటిపర్యంతమయ్యారు. వసంత్‌కుమార్‌కు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా, వసంత్‌కుమార్ ఆస్పత్రి ప్రాంగణంలో చేసిన చర్యను తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లం ప్రవీణ్ ఖండించారు. వసంత్‌కుమార్‌కు అన్యాయం జరిగితే వైద్య ఉన్నతాధికారులతో సమావేశమై చర్చిస్తామన్నారు.

**ప్రజారోగ్య విభాగానికి అప్పగించాం**

గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ నిర్వహించిన సమీక్షలో ఆర్ఎంవోను దుర్భాషలాడిన విషయంపై వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా డాక్టర్ వసంత్‌ను ప్రజారోగ్య సంచాలకుడికి అప్పగించామని వైద్య విద్య సంచాలకులు (డీఎంఈ) డాక్టర్ రమేశ్‌రెడ్డి తెలిపారు. ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నిస్తూ వసంత్‌కుమార్ ఆస్పత్రిలో ఫార్మసీ కుంభకోణం జరిగిందని డీఎంఈ రమేశ్‌రెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేశారు. దీనిపై రమేశ్‌రెడ్డి స్పందించారు. కొద్దికాలంగా వసంత్ ప్రవర్తన బాగోలేదని, తనపై చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపాలన్నారు. ఆర్ఎంవోను దుర్భాషలాడిన విషయంపై మాత్రమే వసంత్‌ను సరెండర్ చేశామని స్పష్టం చేశారు. అవకతవకలపై ఇంతకాలం ఎందుకు మాట్లాడలేదని వసంత్‌ను ప్రశ్నించారు.





ROYALTY REDEFINED
ALTURAS G4
by Mahindra

11332407

PREMIUM SUV OF THE YEAR
AUTOCAR AWARDS 2019

SUV OF THE YEAR
CAR INDIA AWARDS 2019

LUXURY SUV OF THE YEAR
ET NOW AWARDS 2019

• Quilted Nappa Leather Upholstery • 9 Airbags • 3-D Around View Camera • Electric Sunroof • Ventilated Seats • 8-Way Powered Driver Seat with Memory Profile • Mercedes-Benz 7-Speed Automatic Transmission • 4 Wheel Drive • Dual-Zone Fully Automatic Temperature Control • 20.32 cm Touchscreen with Android Auto™ and Apple CarPlay* • HID Headlamps with DRLs • Active-Rollover Protection • Electronic Parking Brake • Diamond Cut Alloy Wheels

www.alturasg4.com | youtube.com/alturasg4 | facebook.com/AlturasG4 | instagram.com/alturasg4 | twitter.com/alturasg4 | PURPLE CLUB

For more information, call us at 1800-266-7000.

Accessories shown are not part of standard equipment. Vehicle body color may differ from the printed photographs. T&C apply. Android Auto™ is only compatible with mobile devices with Android OS. *Apple CarPlay is a trademark of Apple Inc., registered in the U.S. and other countries. All features mentioned are not available on all models.

SANSAI AUTO SERVICES PVT. LTD: NALGONDA, SURYAPET, MIRYALGUDA: 8448005424.


Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.